PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 42 సంచిక : 257 | విజయవాడ, గురువారం 20 ఏప్రిల్ 2023 | 8 + 8 పేజీలు వెల : 5.50
Vol No | Vijayawada, Thursday 20 April 2023 | Rs

ఆంగ్ల మాధ్యమం కోర్సుల్లోనూ మాతృభాషలో పరీక్షలు

- విద్యార్థుల ఐచ్ఛికం మేరకు అనుమతి
- వర్శిటీలకు యుజిసి ఉత్తర్వులు

లోపలి పేజీలో..

ఆక్స్‌ఫామ్‌పై సిబిఐ కేసు, సోదాలు

న్యూఢిల్లీ: విదేశీ నిధుల నిబంధనల నిబంధనలను ఉల్లంఘించినందుకు ఆక్స్‌ఫామ్ ఇండియా, ఆఫీస్ బేరర్‌లపై సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సిబిఐ) కేసు నమోదు చేసి, సంస్థ కార్యాలయాలపై సోదాలు జరుపుతున్నట్లు అధికారులు బుధవారం తెలిపారు. సిబిఐకి కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఫిర్యాదు ప్రకారం... ఆక్స్‌ఫామ్ ఇండియా 2013 2016 మధ్య నిర్ణీత బ్యాంక్ ఖాతాకు బదులుగా దాదాపు రూ. 1.5 కోట్లను తన ఫారిన్ కంట్రిబ్యూషన్ యుటిలైజేషన్ ఖాతాలోకి నేరుగా పొందింది. విదేశీ కాంట్రిబ్యూషన్ (నియంత్రణ) చట్టం (ఎఫ్‌సిఆర్‌ఎ) 2010 నిబంధనలను ఉల్లంఘించింది. ఇతర సంఘాలు లేదా లాభాపేక్ష కన్సల్టెన్సీ సంస్థలకు నిధులను బదిలీ చేయడం ద్వారా ఆక్స్‌ఫామ్ ఇండియా ఎఫ్‌సిఆర్‌ఎను ఉల్లంఘించాలని యోచిస్తోందని ఫిర్యాదులో పేర్కొన్నారు. గత ఏడాది జరిపిన సోదాల్లో ఆక్స్‌ఫామ్ ఇండియా కార్యాలయం నుంచి పలు ఇమెయిల్‌లను స్వాధీనం చేసుకున్నట్లు సిబిఐ తెలిపింది.

జనాభాలో నెంబర్ వన్ మనమే

142.86 కోట్లతో చైనాను అధిగమించిన భారత్

ఐరాస జనాభా డాష్ బోర్డు వెల్లడి

న్యూయార్క్: ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన దేశంగా భారత్ ఆవిర్భవించింది. ఇంతవరకు రెండవ అతిపెద్ద జనాభా కలిగిన దేశంగా ఉన్న భారత్ ఇప్పుడు 142.86 కోట్లతో మొదటి స్థానం ఆక్రమించింది. ఈ విషయంలో చైనా (ప్రస్తుత జనాభా 142. 57 కోట్లు)ను భారత్ దాటేసింది. ఐక్యరాజ్యసమితి ప్రపంచ జనాభా కార్యక్రమం (యుఎన్‌ఎఫ్‌పిఎ) డాష్ బోర్డు ఈ గణాంకాలను తాజాగా చూపించింది. ఐరాస జనాభా సంస్థ తాజాగా రూపొందించిన ఈ నివేదిక భారత దేశ జనాభాను వయోగ్రూపులవారీగా కూడా విశ్లేషించింది. దీని ప్రకారం 0-14 ఏళ్ల వయోగ్రూపునకు చెందినవారు దేశ జనాభాలో 25 శాతం దాకా ఉన్నారు. 10-24 ఏళ్ల వయోగ్రూపువారు 26 శాతం ఉండగా, 15-64 ఏళ్ల వయోగ్రూపువారు 68 శాతం మంది దాకా ఉన్నారు. 65ఏళ్లు పైబడినవారు 7 శాతంగా ఉన్నట్లు యుఎన్‌ఎఫ్‌పిఎ లెక్క తేల్చింది.వివిధ సంస్థల అంచనాల ప్రచారం భారత దేశ జనాభా 165 కోట్లకు చేరుకోవడానికి ముందు దాదాపు మూడు దశాబ్దాల పాటు అలా పెరుగుతూ, ఆ తరువాత క్షీణించనారంభిస్తుంది. భారత దేశ జనాభా గణాంకాలు రాష్ట్రానికి రాష్ట్రానికి మారుతూ ఉంటాయి. కేరళ, పంజాబ్ రాష్ట్రాల్లో వృద్ధులు అధికంగా ఉండగా, బీహార్, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాలు యువతను ఎక్కువగా కలిగి ఉన్నాయని నిపుణులు తెలిపారు. ఐరాస పాపులేషన్ ఫండ్ భారత దేశ ప్రతినిధి, భూటాన్ డైరక్టర్ ఆండ్రియా వోజ్నార్ మాట్లాడుతూ, భారత దేశంలోని 142 కోట్ల జనాభాను 142 కోట్ల అవకాశాలుగా చూడాలని అన్నారు. అతిపెద్ద సంఖ్యలో యువతను కలిగిన దేశంగా భారత్ (15-24 వయసుగలవారు 25.4 కోట్ల మంది దాకా ఉన్నారు) నూతన ఆవిష్కరణలు, ఆలోచనలు, శాశ్విత పరిష్కారాలను చూపడంలో ముందుంటుందని ఆమె చెప్పారు.

ముఖ్యంగా మహిళలు, బాలికలు విద్యలో సమాన అవకాశాలు, నైపుణ్యాన్ని పెంపొందించుకోవడం, సాంకేతికత, డిజిటల్ ఆవిష్కరణలు అందుబాటులోకి తెచ్చుకోవడం, పునరుత్పత్తి హక్కులు, ఎంపికలను పూర్తి స్థాయిలో ఉపయోగించుకోవడం అత్యంతావశ్యకమని వోజ్నార్ ఉద్ఘాటించారు. స్త్రీ,పురుష సమానత్వం, సాధికారత, బాలికలకు శారీరక స్వయంప్రతిపత్తి అనేవి మహిళల సుస్థిర భవిష్యత్తుకు అత్యంత కీలకమని ఆమె అన్నారు. మహిళలు, పునరుత్పత్తి ఎంపికలు అంటే పిల్లలను ఎప్పుడు కనాలి, ఎంత మందిని కనాలి వంటివి మహిళలే నిర్ణయించుకోగలరు. ఆ హక్కులు, ఎంపికలను మనం గౌరవించాలి అని వోజ్నార్ చెప్పారు. పునరుత్పత్తి విధానాలు, కార్యక్రమాల్లో మహిళలు కేంద్రంగా ఉండాలని కూడా ఆమె ఉద్ఘాటించారు. హక్కులు, ఎంపికలు, సమాన అవకాశాలు, విలువలు నిజంగా గౌరవించబడినప్పుడు అసాధ్యమైన, అనంతమైన అవకాశాలను అందిపుచ్చుకోగలమని ఐరాస అధికారి చెప్పారు.

వలసల నివారణకు ఫిషింగ్ హార్బర్లు

పోర్టుల నిర్మాణంతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మెరుగు

- విశాఖ కేంద్రంగా సెప్టెంబర్ నుంచి పాలన
- మూలపేట పోర్టు శంకుస్థాపనలో ముఖ్యమంత్రి జగన్

పైలాన్‌ను ఆవిష్కరించిన సిఎం జగన్మోహన్ రెడ్డి

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

మత్స్యకారుల వలసల నివారణకు రాష్ట్రంలో ఫిషింగ్ హార్బర్ల నిర్మాణం చేపడుతున్నామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వెల్లడించారు. శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం మూలపేట వద్ద రూ.4,362 కోట్లతో నిర్మించనున్న పోర్టుతోపాటు పలు అభివృద్ధి కార్యక్రమాలకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం సంతబొమ్మాళి మండలం నౌపడలో నిర్వహించిన బహిరంగ సభలో ప్రసంగించారు. ఈ నాలుగేళ్లలో పది ఫిషింగ్ హార్బర్ నిర్మాణ పనులు మొదలు పెట్టామని, మరో మూడు ఫిష్ ల్యాండింగ్ సెంటర్ల పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. మరో ఫిష్ ల్యాండింగ్ సెంటర్‌కు కూడా అప్రూవల్ తీసుకున్నామని, రాబోయే రోజుల్లో దీని పనులూ ప్రారంభిస్తామని వెల్లడించారు. మత్స్యకారుల కోసం ఫిషింగ్ హార్బర్లు, రాష్ట్ర అభివృద్ధికి పోర్టుల నిర్మాణం ద్వారా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మెరుగుపడడంతోపాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు పూర్తయినా రాష్ట్రం మొత్తమ్మీద నాలుగు ప్రాంతాల్లో ఆరు పోర్టులు మాత్రమే ఉండేవని, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 46 నెలల కాలంలో మరో నాలుగు పోర్టుల నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. మూలపేటలో 24 మిలియన్ టన్నుల సామర్థ్యంతో, నాలుగు బెర్తులతో పోర్టు నిర్మించనున్నట్లు తెలిపారు. ఈ పోర్టును రెండేళ్లలో పూర్తి చేస్తామని, రాబోయే రోజుల్లో వంద మిలియన్ టన్నులకు సామర్థ్యం పెరిగేలా అభివృద్ధి చేస్తామని అన్నారు. పోర్టులు, ఫిషింగ్ హార్బర్లు, ఫిష్ ల్యాండింగ్ సెంటర్ల ద్వారా డీప్‌సీలోకి వెళ్లి చేపలను తీసుకొస్తే గుజరాత్‌కో, మరో ప్రాంతానికో పొట్ట చేత పట్టుకుని మత్స్యకారులు వలస వెళ్లే అవసరం ఉండదని తెలిపారు.

పరిపాలన వికేంద్రీకరణలో భాగంగా సెప్టెంబర్‌లో విశాఖ నగరానికి మకాం మార్చనున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. ఇక అక్కడ్నుంచే పాలన సాగుతుందని ప్రకటించారు. రాష్ట్రాన్ని ఎంతోమంది ముఖ్యమంత్రులు పాలించినా శ్రీకాకుళం జిల్లాలో కిడ్నీ సమస్య పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేయలేదని విమర్శించారు. తాము అధికారంలోకొచ్చాక కిడ్నీ రీసెర్చ్ సెంటర్, ఉద్దానం ప్రాంతానికి రక్షిత మంచినీటిని అందించే కార్యక్రమం ద్వారా సమస్యకు పరిష్కారం చూపామన్నారు. వచ్చే నెల 3న భోగాపురం ఎయిర్‌పోర్టుకు, అదానీ డేటా సెంటర్‌కు, జూన్‌లో సాలూరులో గిరిజన యూనివర్సిటీకి శంకుస్థాపన చేయనున్నామని తెలిపారు. ఉత్తరాంధ్రలో చేపడుతున్న అభివృద్ధిని బేరీజు వేసుకోవాలన్నారు. ప్రజలకు మంచి చేశామని చెప్పుకోవడానికి ఒక్కటీలేని వారంతా ఏకమవుతున్నారని, వారంతా చీకటి యుద్ధం చేస్తున్నారని విమర్శించారు. ఒక అబద్ధాన్ని పదేపదే చెప్పి నమ్మించే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. పెత్తందారుల పక్షాన నిలబడిన టిడిపికి, పేదవాడి పక్షాన నిలబడిన తనకు మధ్య యుద్ధం జరుగుతోందన్నారు.

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

పోర్టుతో పాటు సభా ప్రాంగణంలో పలు అభివృద్ధి పనులకు శిలాఫలకాలను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెం తీరంలో రూ.365.81 కోట్లతో ఫిషింగ్ హార్బర్‌కు, గొట్టాబ్యారేజీ నుంచి హిరమండలం రిజర్వాయర్‌కు రూ.176.35 కోట్లతో వంశధార లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌కు, రూ.852 కోట్ల వ్యయంతో మహేంద్రతనయ ప్రాజెక్టు ఆఫ్‌షోర్ రిజర్వాయర్ ప్రాజెక్టు పనులకు శంకుస్థాపన చేశారు. శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం, మంత్రులు గుడివాడ అమర్‌నాథ్, బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావు, సీదిరి అప్పలరాజు, అంబటి రాంబాబు, జడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీలు దువ్వాడ శ్రీనివాస్, నర్తు రామారావు, పాలవలస విక్రాంత్, వరుదు కల్యాణి, ఎమ్మెల్యేలు ధర్మాన కృష్ణదాస్, రెడ్డి శాంతి, గొర్లె కిరణ్ కుమార్, కళావతి, కంబాల జోగులు, కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, ఎస్‌పి జి.ఆర్ రాధిక పాల్గొన్నారు.

తీవ్ర ఉక్కపోత, దాహంతో అవస్థలు

సిఎం సభకు భారీగా జనాన్ని తరలించిన అధికారులు, వైసిపి నాయకులు ఆ మేరకు ఏర్పాట్లు చేయడంలో విఫలమయ్యారు. ఒకవైపు ఎండ వేడిమి, మరోవైపు ఉక్కపోత తీవ్రంగా ఉండడంతో వృద్ధులు, మహిళలు ఉక్కిరిబిక్కిరయ్యారు. తాగునీటి సదుపాయం లేక దాహంతో అలమటించారు.

సెయిల్, ఎన్‌ఎండిసి బిడ్డింగ్‌లో పాల్గొనాలి

- విశాఖ స్టీల్ ప్రైవేటీకరణ ఉపసంహరించుకునేదాకా పోరాటం
- ఉక్కు పరిరక్షణ పోరాట వేదిక రౌండ్‌టేబుల్ సమావేశంలో తీర్మానం

రౌండ్‌టేబుల్ సమావేశంలో అభివాదం చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

దేశానికే మణిమకుటం లాంటి విశాఖస్టీల్ ప్లాంట్‌లో ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంటరెస్ట్ (ఇఒఐ) బిడ్డింగ్‌లో కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలైన సెయిల్ (స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా), ఎన్‌ఎండిసి (నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్)లు పాల్గొనేలా కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట వేదిక డిమాండ్ చేసింది. స్టీల్ ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్రం ఉపసంహరించుకునేదాకా ఐక్య పోరాటాలను ఉధృతం చేయాలని పిలుపునిచ్చింది. బుధవారం విజయవాడలోని బాలోత్సవ్ భవన్‌లో విశాఖ స్టీల్ ఫ్యాక్టరీ పరిరక్షణకై రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట వేదిక కన్వీనర్ జి ఓబులేసు అధ్యక్షతన జరిగిన ఈ రౌండ్‌టేబుల్ సమావేశంలో వేదిక కన్వీనర్ వి ఉమామహేశ్వరరావు విశాఖ స్టీల్ ప్లాంట్‌లో బిడ్డింగ్‌లో సెయిల్, ఎన్‌ఎండిసిలు పాల్గొనేలా కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడిని తీసుకురావాలని తీర్మానాన్ని ప్రతిపాదించగా.. రౌండ్‌టేబుల్ సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. విశాఖ స్టీల్ ప్లాంట్‌పై కేంద్ర ప్రభుత్వం పూటకోమాట మాట్లాడటం తగదన్నారు. ఉక్కుశాఖ మంత్రి ఫగన్‌సింగ్ ఉదయం మీడియాతో విశాఖస్టీల్ ప్రైవేటీకరణ చేయబోమని చెప్పి, సాయంత్రం అయ్యేసరికి కార్మిక సంఘాలతో విశాఖ ఉక్కు అంశం తన పరిధిలో లేని అంశమని మాట మార్చారని అన్నారు. మరుసటి రోజు ప్రైవేటీకరణను ముందుకు తీసుకెళ్లేదేనని అదే మంత్రిత్వశాఖ ఒక ప్రకటన విడుదల చేసిందన్నారు. బాధ్యతాయుతమైన మంత్రి పూటకో మాట మాట్లాడటం తగదని అన్నారు. ఉనికిలో లేని కడప ఉక్కు ఫ్యాక్టరీకి సొంతగనులు కేటాయించిన ప్రభుత్వం.. నాణ్యమైన ఉక్కును ఉత్పత్తి చేసే విశాఖ స్టీల్ ప్లాంట్‌కు ఎందుకు గనులను కేటాయించరని ప్రశ్నించారు. తమిళనాడులో ఇలాంటి అంశాలు వచ్చినపుడు అక్కడి ముఖ్యమంత్రులు ప్రతిపక్షాలను కలుపుకుని ఐక్యంగా కేంద్రంపై ఒత్తిడి పెంచి విజయాలను సాధిస్తారని తెలిపారు. అలాగే కేరళలో వరదల నేపథ్యంలో ప్రతిపక్షనేతను సమీక్షా సమావేశంలో కూర్చోబెట్టుకుని వరద బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకున్నారని అన్నారు. రాష్ట్రంలోని ఏకైక పెద్ద పరిశ్రమను కాపాడుకునేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్షాలను కలుపుకుని కేంద్రంపై ఎందుకు ఒత్తిడి పెంచరని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం విమానాశ్రయాలను ప్రైవేటీకరించాలని నిర్ణయిస్తే మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి ఒత్తిడి తేవడంతో ఆ రాష్ట్రంలోని రెండు విమానాశ్రయాలు మిగతా 7లో

వడదెబ్బకు ఇద్దరు మృతి

ప్రజాశక్తి- సింగనమల (అనంతపురం జిల్లా), వడ్డాది (అనకాపల్లి జిల్లా)

వడదెబ్బకు బుధవారం ఇద్దరు మృతి చెందారు. వారిలో ఒకరు వ్యవసాయ కార్మికుడు, మరొకరు ఉపాధి కూలి ఉన్నారు. మృతుల కుటుంబ సభ్యుల కథనం ప్రకారం... అనంతపురం జిల్లా శింగనమల మండలం గోవిందరాయునిపేటకు చెందిన కట్టుబడి ఇమామ్ హుస్సేన్ (52) ఉపాధి హామీ పనికి వెళ్లారు. తీవ్రమైన ఎండలో పనిచేయడంతో అప్పటికే వడదెబ్బకు గురైన ఇంటికి వచ్చిన తర్వాత అస్వస్థతతో సొమ్మసిల్లి పడిపోయారు. కుటుంబ సభ్యులు ఆయనను మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు ధ్రువీకరించారు.

వ్యవసాయ కార్మికుడైన అనకాపల్లి జిల్లా బుచ్చయ్యపేట మండలం వడ్డాది గ్రామానికి చెందిన దొండా గోవర్ధనరావు (55) ప్రతి రోజులాగే పనికి వెళ్లారు. ఎండతీవ్రతకు వడదెబ్బకు గురైన ఆయన ఇంటికి వచ్చి తన కుమార్తె స్వాతిని మంచినీరు తీసుకురమ్మని అడిగారు. ఆమె మంచినీరు తెచ్చేలోగా గోవర్ధనరావు మృతి చెందారు.

గుటెరస్‌పై గూఢచర్యం

- అమెరికా తీరుపై ఐరాస ఆగ్రహం
- వివరణ ఇవ్వాల్సిందేనన్న చైనా

న్యూయార్క్: ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియా గుటెరస్‌పైన, ఇతర ఐరాస అధికారులపైన అమెరికా గూఢచర్యానికి పాల్పడడంపై ఐరాస ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ గూఢచర్యంపై ఐరాస తన ఆందోళనను అమెరికాకు లాంఛనంగా తెలియజేసంది. దీనిపై చైనా మరో అడుగు ముందుకేసి ఈ గూఢచర్యంపై అమెరికా బాధ్యతాయుతమైన రీతిలో వివరణ ఇవ్వాలని కోరింది.

అమెరికా తన మిత్ర దేశాలపైనే కాకుండా, ప్రపంచ సంస్థ చీఫ్‌పైనా, ఇతర అధికారులపైన గూఢచర్యానికి పాల్పడిన వైనాన్ని ఇటీవల లీకైన పెంటగాన్ పత్రాలు స్పష్టంగా బయటపెట్టాయి. ఐక్యరాజ్యసమితికి ఆతిధ్యమిస్తున్న దేశంగా అమెరికా ఇటువంటి చర్యలకు పాల్పడడం సిగ్గుచేటు అని, అంతర్జాతీయ సమాజానికి అది వివరణ ఇవ్వాలని పలు దేశాలు కోరాయి. ఐరాస స్వతంత్రతకు, స్వేచ్ఛకు భంగం కలిగించే రీతిలో అమెరికా వ్యవహరించడం ఎంత మాత్రం సమర్థనీయం కాదని అవి పేర్కొన్నాయి. ఐరాసకు అతిధ్యమిచ్చే దేశంగా అమెరికా దాని బాధ్యతలను నెరవేర్చేందుకు కొన్ని కచ్చితమైన చర్యలు చేపట్టాలని, దీనిపై వివరణ ఇవ్వకుండా అది తప్పించుకోజాలదని చైనా విదేశాంగ శాఖ పేర్కొంది. ఐరాసపై అమెరికా ఈ విధంగా గూఢచర్యానికి పాల్పడడం ఇదే తొలి సారి కాదు. 2013లో ఒకసారి ఇదే విధంగా ఐరాసపై అది నిఘా పెట్టినట్లు 'ప్రిజమ్' రహస్య పత్రాలు వెల్లడించాయి.

అడుగంటిన 'శ్రీశైలం'

- 804.70 అడుగులకు పడిపోయిన నీటిమట్టం
- ఆందోళనలో రెండు రాష్ట్రాల రైతులు

డెడ్ స్టోరేజీకి పడిపోయిన శ్రీశైలం డ్యాం నీటి నిల్వ

ప్రజాశక్తి- కర్నూలు ప్రతినిధి

శ్రీశైలం ప్రాజెక్టులో నీటిమట్టం డెడ్ స్టోరేజీకి చేరుకుంది. విద్యుదుత్పత్తి పేరుతో అటు తెలంగాణ, ఇటు ఎపి ప్రభుత్వాలు ఇష్టానుసారంగా నీటిని తోడేయడంతో ఈ పరిస్థితి వచ్చింది. పదేళ్లుగా ఇదే తంతు కొనసాగుతోంది. కీలకమైన సమయంలో సాగు నీరందక ఇరు రాష్ట్రాల రైతులూ ఆందోళన చెందుతున్నారు. శ్రీశైలం ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 885 అడుగులు. ప్రస్తుతం 804.70 అడుగులు మాత్రమే ఉంది. పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 215.807 టిఎంసిలు. ప్రస్తుతం 31.39 టిఎంసిలే ఉన్నాయి. ఏటా ఈ ప్రాజెక్టులో నీటిమట్టం 854 అడుగులు, నీటి నిల్వ 53 టిఎంసిలు మెయింటెన్ చేయాలని బచావత్ ట్రిబ్యునల్ ఆదేశించింది. కానీ, రాష్ట్ర విభజన సమయం నాటి నుంచి ఏ యేడాదీ ఈ సీజన్లో 854 అడుగుల నీటిమట్టం లేదు. ఏటా 600 టిఎంసిల నుంచి 2 వేల టిఎంసిల వరకూ వరద నీరు వృథాగా సముద్రంలోకి పోతోంది. రాయలసీమ ప్రాంత పరిధిలో కృష్ణా నది వెంట ఎక్కడా రిజర్వాయర్లు లేకపోవడమే దీనికి ప్రధాన కారణం. శ్రీశైలం డ్యామ్ నీటి నిలువ డెడ్ స్టోరేజీకి పడిపోతే జీవరాశులకు నీటి లభ్యత తగ్గిపోతుంది. దీంతోపాటు వాతావరణం వేడెక్కి పర్యావరణ సమతుల్యత కూడా దెబ్బతినే ప్రమాదం ఉంది.

సీమ ప్రాజెక్టులపై ప్రభావం

శ్రీశైలం జలాశయంపై ఆధారపడి రాయలసీమలోని గాలేరు నగరి, తెలుగుగంగ, హంద్రీనీవా, కెసి కెనాల్, ఎస్‌ఆర్‌బిసి కింద లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేస్తున్నారు. ప్రస్తుతం ముచ్చుమర్రి నుండి నీటిని నిలిపివేశారు. సుంకేసుల బ్యారేజీ నుంచి నీటిని అందిస్తున్నారు. రైతులకు సాగు అందించేందుకు 1.20 టిఎంసిలు, కర్నూలు ప్రజల దాహార్తి తీర్చేందుకు ఒక టిఎంసి నీటిని సుంకేసులలో నిల్వ చేశారు. ఎగువ నుంచి ప్రతి రోజూ 1200 క్యూసెక్కుల నీరు సుంకేసుల నుంచి వస్తుండగా కెసి కాలువ నీరు రబీలో పంటలకు అందిస్తున్నారు. ఈ నీరు సుంకేసుల నుంచి 140 కిలోమీటర్లు బానకచెర్ల క్రాస్ రెగ్యులేటర్ వరకు ప్రవహిస్తోంది. ఈ ఏడాది కెసి కాలువ కింద పంటలు దెబ్బతిన్న రైతులు శ్రీశైలం, తుంగభద్ర జలాల వినియోగంతో రెండో పంట ద్వారా గట్టెక్కవచ్చని భావించారు. ఈ నెల పదో తేదీ నుంచి సాగు నీటి విడుదల నిలిపివేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

స్విమ్స్‌లో డాక్టర్ల నియామకానికి బిజెపి కొర్రీలు

అన్యమతం పేరుతో రాద్ధాంతం

తిరుపతి స్విమ్స్ ఆస్పత్రి ఫొటో

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో

రాయలసీమకే తలమానికమైన శ్రీ వెంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ యూనివర్సిటీ (స్విమ్స్)ని ఎయిమ్స్ తరహాలో అభివృద్ధి చేసేందుకు టిటిడి ప్రయత్నాలు ప్రారంభించింది. ఖాళీ పోస్టులను భర్తీ చేయడంతోపాటు అధునాతన టెక్నాలజీతో సూపర్ స్పెషాలిటీ వైద్యాన్ని రాష్ట్ర ప్రజలకు అందించేందుకు కృషి చేస్తోంది. 142 పోస్టుల నియామకానికి నోటిఫికేషన్ ఇచ్చింది. ఈ నేపథ్యంలో పోస్టుల భర్తీకి, తద్వారా ఆస్పత్రి అభివృద్ధికి అన్యమతం పేరుతో బిజెపి మోకాలడ్డుతోంది. స్విమ్స్‌లో అన్యమతస్తులకు పోస్టింగ్ ఇవ్వరాదంటూ బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి భానుప్రకాష్‌రెడ్డి ప్రకటన చేశారు. ఇంటర్వ్యూలు జరిపితే అడ్డుకుంటామని, న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని హెచ్చరించారు. విభజనకు ముందు స్విమ్స్ ఆస్పత్రి రాయలసీమ ప్రజలకే సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలందించేది. విభజన తర్వాత ఎయిమ్స్ తరహాలో అభివృద్ధి చేసి రాష్ట్ర ప్రజలందరికీ మంచి వైద్యం అందించాలని టిటిడి సంకల్పించింది. ఈ మేరకు నిధులను టిటిడి కేటాయిస్తూ వచ్చింది. ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, డాక్టర్లు, నర్సులు, వార్డు బాయ్‌లు, ల్యాబ్ టెక్నీషియన్, సెక్యూరిటీ, పారిశుధ్య కార్మికుల పోస్టులతో కలిపి 2,500 మంది స్విమ్స్‌లో పనిచేస్తున్నారు. ఏటా టిటిడి తన బడ్జెట్లో రూ.200 కోట్లకుపైగా స్విమ్స్ అభివృద్ధికి కేటాయిస్తోంది. ఆరోగ్యశ్రీ ద్వారా మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం నుంచి డబ్బులు వస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఇవ్వడం లేదు. విభాగాలు పెరగడంతో డాక్టర్ల పోస్టుల నియామకం అవసరమైంది. వీటి భర్తీకి ఈ నెల 17న నోటిఫికేషన్ జారీ చేసింది. నిపుణులైన ప్రొఫెసర్లు 14 మంది, అసోసియేట్ ప్రొఫెసర్లు 41 మంది, అసిస్టెంట్ ప్రొఫెసర్లు 87 మందిని నియమించనుంది. టిటిడి బోర్డులో అనుమతి తర్వాతే నోటిఫికేషన్ ఇచ్చింది. నేషనల్ మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సైతం రిజర్వేషన్ ప్రాతిపదికన ఖాళీలు భర్తీ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ నెల 24న ఇంటర్వ్యూలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి భానుప్రకాష్‌రెడ్డి మోకాలడ్డేలా ప్రకటన చేశారు. టిటిడి నిధులతో నడుస్తున్న స్విమ్స్ ఆస్పత్రిలో అన్యమతస్తులకు ఉద్యోగావకాశాలు ఇవ్వరాదని, ఇంటర్వ్యూలను అడ్డుకుంటామని, హిందువులను మాత్రమే డాక్టర్లుగా నియమించాలని ఈ ప్రకటనలో పేర్కొన్నారు. గతంలోనూ తిరుపతి గరుడ వారధి నిర్మాణంలోనూ, టిటిడి విద్యా సంస్థల్లో పోస్టుల భర్తీలోనూ, తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయం విషయంలోనూ ఇదే విధంగా బిజెపి కోర్టుకెక్కింది. ప్రజాప్రయోజనాల రీత్యా అవి అవసరమని కోర్టు మొట్టికాయలు వేసింది. అయినా, బిజెపి వైఖరిలో మార్పులేకపోవడం గమనార్హం.

అగ్నిప్రమాదంలో చిన్నారి దుర్మరణం

ప్రజాశక్తి- జీలుగుమిల్లి (ఏలూరు జిల్లా)

ముక్కుపచ్చలారని చిన్నారి అగ్నిప్రమాదంలో మృతి చెందింది. ఏలూరు జిల్లాలో బుధవారం చోటుచేసుకున్న ఈ విషాద ఘటనకు సంబంధించి పోలీసుల కథనం ప్రకారం... జీలుగుమిల్లి మండలం తాటిరామన్నగూడేనికి చెందిన తాటి విజయ్, మౌనిక దంపతులకు ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. భార్యాభర్తలు వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. విజయ్ తెల్లవారుజామున కూలి పనికి వెళ్లారు. మౌనిక తన 11 నెలల కుమార్తె (ఇంకా పేరు పెట్టలేదు)ను ఇంట్లోని ఊయలలో పడుకోబెట్టారు. కుక్కర్లో రైస్ పెట్టి పక్కనే ఉన్న తన మావయ్య ఇంటికి పెద్ద కుమార్తెను తీసుకొని వెళ్లారు. ఈ సమయంలో మౌనిక ఇంట్లో విద్యుత్తు షార్ట్‌సర్క్యూట్ జరిగి ఒక్కసారిగా మంటలు వ్యాపించి ఊయలలోని చిన్నారికి తీవ్ర గాయాలయ్యాయి. తొలుత అశ్వారావుపేట ప్రభుత్వాస్పత్రికి, ఆ తర్వాత మెరుగైన వైద్యం కోసం జంగారెడ్డిగూడెం ఆస్పత్రికి తరలించినా ఫలితం లేకపోయింది. పరిస్థితి విషమించి చిన్నారి మృతి చెందింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఏకలవ్య పాఠశాలలో కరోనా కలకలం

- ఐసోలేషన్‌లో ముగ్గురు విద్యార్థులు

ప్రజాశక్తి-మక్కువ (పార్వతీపురం మన్యం జిల్లా)

పార్వతీపురం మన్యం జిల్లా మక్కువ మండలంలోని ఏకలవ్య పాఠశాలలో బుధవారం కరోనా కలకలం రేపింది. పాఠశాలలో ముగ్గురు విద్యార్థులకు కరోనా లక్షణాలు స్వల్పంగా కనిపించడంతో వారిని ఐసోలేషన్‌లో ఉంచారు. పార్వతీపురం ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్ ఏకలవ్య పాఠశాలను ఆకస్మికంగా సందర్శించి వైద్యులతో చర్చించారు. విద్యార్థులకు ఆర్‌టిపిసిఆర్ పరీక్షలు చేశామని, వాటి నివేదిక రావాల్సి ఉందని వైద్యులు తెలిపారు. ఐదు రోజులపాటు ప్రత్యేక గదిలో వారిని ఉంచి పర్యవేక్షిస్తామని పిఒకు వివరించారు. ఐసోలేషన్‌లో ఉన్న విద్యార్థులకు వైద్యుల సలహా మేరకు మెనూ అందిస్తున్నామని ఏకలవ్య పాఠశాల ప్రిన్సిపల్ ఎర్రునాయుడు తెలిపారు. రెండు రోజులుగా వైద్య సిబ్బంది అందించిన మందులను అందించామని చెప్పారు.

'వివేకా' హత్య కేసులో చంద్రబాబే తొలి ముద్దాయి

- వైసిపి ఎమ్మెల్యే సుధాకర్‌బాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైఎస్ వివేకానందరెడ్డి హత్య టిడిపి హయాంలోనే జరిగిందని, ఈ కేసులో చంద్రబాబు నాయుడే తొలి ముద్దాయని వైసిపి ఎమ్మెల్యే టిజెఆర్ సుధాకర్‌బాబు విమర్శించారు. ఈ కేసులో సిఎం జగన్‌పై కుట్ర చేసేందుకు బాధితుల్ని నిందితులుగా చిత్రీకరించే యత్నం జరుగుతోందన్నారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. డ్రైవర్ దస్తగిరి బయటకు వచ్చి హత్య చేసిన విధానం చెబుతూ గొడ్డలితో నరికానని చెప్తుంటే సునీత మౌనంగా ఎందుకు ఉన్నారని ప్రశ్నించారు. సునీత భర్తకు ఈ హత్యలో సంబంధం ఉందని, ఆ కోణంలో విచారణ ఎందుకు చేయడం లేదని అన్నారు. ముఖ్యమంత్రి నిధుల కోసం ఢిల్లీకి వెళ్లడం సాధారణ చర్య అని పేర్కొన్నారు. హంతకులను వదిలేసి, బాధితులను ముద్దాయిలుగా చిత్రీకరించేలా కుట్రలకు తెరలేపారన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు
పంపవచ్చు.

విజయవాడ రైల్వే డివిజన్ సీనియర్ డిఎఫ్ఎమ్‌గా శివరామకృష్ణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విజయవాడ రైల్వే సీనియర్ డివిజనల్ ఫైనాన్స్ మేనేజరుగా ఐఆర్ఎఎస్ అధికారి ఇవి శివరామకృష్ణ బుధవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఆయన 2003 బ్యాచ్ ఐఆర్ఎఎస్‌కు చెందినవారు. ఇప్పటి వరకు సికింద్రాబాద్ డిప్యూటీ ఫైనాన్షియల్ అడ్వైజరు అండ్ చీఫ్ అకౌంట్స్ ఆఫీసరు (కన్‌స్ట్రక్షన్స్)గా విధులు నిర్వహించారు.

7 మార్గదర్శి చిట్స్ కార్యాలయాల్లో సోదాలు

ప్రజాశకి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో వుండే ఏడు మార్గదర్శి చిట్‌ఫండ్ కార్యాలయాల్లో సిఐడి అధికారులు బుధవారం తనిఖీలు చేశారు. విశాఖపట్నంలోని సీతమ్మపేట బ్రాంచ్, రాజమండ్రిలోని శ్యామల థియేటర్ బ్రాంచ్, ఏలూరులోని నర్సింగ్‌రావుపేట, విజయవాడలోని లబ్బీపేట బ్రాంచ్, గుంటూరు సిటిలోని అరండల్‌పేట బ్రాంచ్, నర్సరావుపేటలోని సత్తెనపల్లె రోడ్‌లోని బ్రాంచ్‌తోపాటు అనంతపురంలోని లక్ష్మీనగర్‌లో వుండే బ్రాంచ్‌లో సోదాలు నిర్వహించినట్లు ఎపి సిఐడి చీఫ్, అడిషనల్ డిజి ఎన్ సంజయ్ ఒక ప్రకటనలో తెలిపారు. మార్గదర్శిలో నిబంధనల ఉల్లంఘనలు జరిగాయన్న సమాచారంతో ఈ దాడులు చేశామని వారు పేర్కొన్నారు.

అక్రమ తవ్వకాలను అడ్డుకుంటే కేసులా : నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఇసుక, మట్టి అక్రమ తవ్వకాలను అడ్డుకుంటే కేసులు పెడతారా? ఇదెక్కడి న్యాయమని జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. వైసిపి ముఖ్య నాయకుల నుంచి నియోజకవర్గస్థాయి నాయకుల వరకు ఇసుక దోపిడీ ప్రధాన ఆదాయ వనరుగా మారిపోయిందన్నారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మండపేట నియోజకవర్గం కపిలేశ్వరపురం మండలంలోని తాతపూడి దగ్గర గోదావరి తీరంలో అక్రమంగా ఇసుక, మట్టి తవ్వుతున్న నేపథ్యంలో ఆ నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌ఛార్జి వేగుళ్ల లీలాకృష్ణ హైకోర్టులో పోరాడుతున్నారని తెలిపారు.

'ఉపాధి' పరిరక్షణకు ఐక్య ఉద్యమం

- వ్యకాస రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు
- మే 19న కలెక్టరేట్ల వద్ద ధర్నాలు
- కృష్ణా జిల్లాలో ముగిసిన సైకిల్ యాత్రలు

కృష్ణాజిల్లా ఉయ్యూరు మండలం ముదునూరులో కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న వై.వెంకటేశ్వరరావు (వైవి)

ప్రజాశక్తి - ఉయ్యూరు, కోడూరు, గుడివాడ

ఉపాధి, భూమి, ఇళ్ల సాధనకు, గ్రామీణ పేదల సమస్యల పరిష్కారానికి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి రోజైన ఏప్రిల్ 14 నుండి 5 రోజులపాటు కృష్ణా జిల్లాలో సాగిన మూడు సైకిల్ యాత్రలు బుధవారంతో ముగిశాయి. ఈ మూడు సైకిల్ యాత్రా దళాలు 14న ఉదయం మచిలీపట్నంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నుండి బయలుదేరాయి. మొదటి యాత్ర బంటుమిల్లి, పెడన, గుడ్లవల్లేరు, గుడివాడ, నందివాడ మండలం జొన్నపాడు, బుడమేరు వంతెన, పుట్టగుంట మీదుగా నందివాడకు చేరుకుంది. రెండో యాత్ర మొవ్వ, ఘంటసాల, చల్లపల్లి, మోపిదేవి, అవనిగడ్డ మీదుగా కోడూరుకు చేరింది. మూడో యాత్ర పామర్రు, పమిడిముక్కల, తోట్లవల్లూరు, కంకిపాడు, ఉయ్యూరు మీదుగా పెదపారుపూడి మండలం వెంట్రప్రగడకు చేరుకుంది. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు ఉయ్యూరు మండలం కాటూరు, ముదునూరులో పర్యటించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు (వైవి) మద్దతుగా పాల్గొన్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు నందివాడ మండలం జొన్నపాడులో పర్యటించి ఉపాధి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు ఉపాధి కార్మికులనుద్దేశించి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై వ్యవసాయ కార్మికులు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో ఏడాదికి ప్రతి కుటుంబానికి రెండు వందల రోజులపాటు పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఉపాధి కార్మికులకు రోజు వేతనం రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశాల్లో కార్మికులకు కనీస వసతులు కల్పించడంలో అధికార యంత్రాంగం ఘోరంగా విఫలమవుతోందన్నారు. తాగునీరు, మెడికల్ కిట్లు, పని పనిముట్లు అందుబాటులో ఉంచడంలేదని తెలిపారు. వేతనాల చెల్లింపుల్లోనూ ఆలస్యం జరుగుతోందన్నారు. ఉపాధి హామీ చట్టం పరిరక్షణకు పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి రోజైన మే 19న రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్ల వద్ద ధర్నాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

వివేకా హత్యకు గురైతే గుండెపోటుగా ఎందుకు చెప్పారు..?

వైఎస్ అవినాష్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, ఉదయ్ కుమార్ రెడ్డిలను వేర్వేరుగా విచారించిన సిబిఐ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో కడప ఎంపి అవినాష్ రెడ్డి, ఆయన తండ్రి వైఎస్ భాస్కర్ రెడ్డి, ఉదయ్ కుమార్ రెడ్డిలను సిబిఐ బుధవారం విచారించింది. ముగ్గురునీ వేర్వేరుగా అధికారులు ప్రశ్నించారు. బుధవారం ఉదయం 10.30 గంటలకు వైఎస్ అవినాష్ రెడ్డి తన అడ్వకేట్లతో కలిసి కోఠిలోని సిబిఐ కార్యాలయానికి వెళ్లారు. అవినాష్ ఒక్కరిని మాత్రమే లోపలికి అనుమతించిన సిబిఐ అధికారులు సాయంత్రం 6.3 గంటల వరకు ప్రశ్నించారు. వివేకానంద రెడ్డి హత్య జరిగిన కొద్ది సేపటికే ఘటనాస్థలికి వెళ్లి...అక్కడ పరిస్థితిని గమనించిన తర్వాత కూడా , వివేకా గుండెపోటుతో చనిపోయారని ఎందుకు చెప్పాల్సి వచ్చిందని విచారణ అధికారులు అవినాష్‌పై ప్రశ్నల వర్షం కురిపించినట్లు తెలిసింది. హత్య జరిగిన వివేకా ఇంట్లో రక్తపు మరకలను, ఇతర సాక్ష్యాలను మాయం చేసేందుకు ఎందుకు ప్రయత్నించారు..? ఆ విధంగా చేయమని నిందితులను ఆదేశించారా..? వివేకా హత్య విషయం బాహ్య ప్రపంచానికి తెలియక ముందే మీ కుటుంబ సభ్యులకు ఎలా తెలిసింది..?అని అవినాష్ రెడ్డిని సిబిఐ ప్రశ్నించినట్లు సమాచారం. విచారణ మొత్తాన్ని ఆడియో, వీడియో రికార్డు చేశారు. హైకోర్టు ఆదేశాల మేరకు ఈ నెల 25 వరకు అవినాష్ రెడ్డి సిబి విచారణకు హాజరు కావాల్సి ఉంది.కాగా, ఇదే కేసులో అరెస్టయి చంచల్‌గూడ జైలులో ఉన్న వైఎస్ భాస్కర్ రెడ్డి, ఉదయ్ కుమార్ రెడ్డిలను సిబిఐ కోర్టు 6రోజులు కస్టడీకి ఇచ్చిన నేపథ్యంలో...బుధవారం ఉదయం 10.40గంటలకు ఇద్దరినీ జైలు నుంచి సిబిఐ కార్యాలయానికి తరలించారు. సాయంత్రం ఆరు గంటల వరకు వేర్వేరుగా విచారించారు. వివేకానంద రెడ్డితో విభేదాలపైనే ప్రధానంగా విచారణ అధికారులు దృష్టి పెట్టినట్టు తెలిసింది. హత్య జరిగిన రోజు, అదే సమయానికి అవినాష్ రెడ్డితో పదే పదే ఎందుకు సంభాషించారని ఉదయ్‌ను అధికారులు ప్రశ్నించారు. ఇద్దరి స్టేట్‌మెంట్లను రికార్డు చేశారు. వీరు కూడా గురువారం ఉదయం పది గంటలకు విచారణకు హాజరుకానున్నారు. వేర్వేరుగా విచారించి స్టేట్‌మెంట్లు రికార్డు చేసిన తర్వాత , ముగ్గురినీ కలిపి విచారించే అవకాశం ఉంది. విచారణ సందర్భంగా సిబిఐ కార్యాలయం పరిసరాల్లో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.

రైల్వేల భద్రత పట్ల అప్రమత్తం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రైల్వేల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా భద్రతా ప్రమాణాలు పెంచేందుకు చర్యలు తీసుకోవాలని అడిషనల్ డిజి రైల్వేస్ కుమార్ విశ్వజీత్ ఆదేశించారు. మంగళగిరిలోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో స్టేట్ లెవెల్ సెక్యూరిటీ కమిటి మీటింగ్ ఫర్ రైల్వేస్ (ఎస్ఎల్ఎస్‌సిఆర్) సమావేశం బుధవారం జరిగింది. ఈ సమావేశంలో కుమార్ విశ్వజీత్, లా అండ్ ఆర్డర్ అడిషనల్ డిజి ఎస్ బాగ్చీతో కలిసి రైల్వేల భద్రత ప్రమాణాలపై సమీక్షించారు. రాష్ట్ర పరిధిలోని రైల్వే జోన్‌లలోని ఆర్‌పిఎఫ్, జిఆర్‌పి అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కుమార్ విశ్వజీత్, బాగ్చీ మాట్లాడుతూ.. రైళ్లలో టికెట్ లేకుండా ప్రయాణం చేసే వారిపై నిఘాను పెంచాలన్నారు. ప్రతి రైల్వేస్టేషన్‌లోనూ సిసి కెమెరాలు అమర్చాలన్నారు. జిఆర్‌పి పోలీసులకు రైల్వే ఆస్పత్రుల్లో వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే రైల్వే పాస్‌లను మంజూరు చేయాలన్నారు. సిబ్బంది కొరతను అధిగమించేందుకు హోమ్‌గార్డులను రిక్రూట్ చేసుకోవాలన్నారు.

అలా కుదరదు

- సోలార్ పవర్ తీసుకోవడంపై ప్రభుత్వం తిరకాసు
- కొనుగోలు రూ.4.60
- అమ్మకం రూ.10.15
- రూ.లక్షలు వెచ్చించి సోలార్ సెటప్ పెట్టుకున్న సంస్థలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సాంప్రదాయేతర ఇంధన వనరుల వినియోగంలో భాగంగా ఎక్కడికక్కడ సోలార్ విద్యుదుత్పత్తి చేసేందుకు ప్రోత్సాహకాలు అందిస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పుడు మాట మార్చింది. ఫిబ్రవరి నుండి నేరుగా విద్యుత్ కొనుగోలు చేస్తామని, అమ్మకాలకు, సోలార్ విద్యుత్ కొనుగోలుకు ఎటువంటి సంబంధమూ లేదని, దేని బిల్లు దానికేనని ప్రకటించింది. దీంతో రూ.లక్షలు వెచ్చించి సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసుకున్న సంస్థలు ఇప్పుడు లబోదిబోమంటున్నాయి. తాము వాడుకునే విద్యుత్‌కు యూనిట్‌కు రూ.10.15 పైసలు కడుతున్నామని, అమ్ముదామంటే రూ.4.60 పైసలు మాత్రమే ఇస్తున్నారని చెబుతున్నారు. విజయవాడ వంటి నగరంలో ఓ సంస్థ తమ విభాగాలున్న నాలుగు చోట్ల సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసింది. దీనికిగానూ ఒక యూనిట్లో నెలకు 1800 యూనిట్ల సోలార్ విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తోంది. నాలుగు యూనిట్లలోనూ ఇదే తరహాలో నెలకు 1800 యూనిట్ల చొప్పున ఉత్పత్తి సాధిస్తోంది. ఈ ఏడాది జనవరి వరకూ వీరిదగ్గర ఉత్పత్తయిన విద్యుత్ (యూనిట్లు) మినహాయించుకుని మిగిలిన యూనిట్లకు బిల్లు వసూలు చేస్తున్నారు. ఫిబ్రవరి నుండి పద్ధతి మార్చారు. ఇక నుండి యూనిట్లో ఉత్పత్తయిన విద్యుత్‌కు మినహాయింపు ఇవ్వబోమని, వాడుకున్న విద్యుత్‌కు పూర్తిగా బిల్లు చెల్లిస్తే తాము కొనుగోలు చేసిన విద్యుత్‌కు తిరిగి డబ్బు చెల్లిస్తామని తెలిపారు. అయితే విద్యుదుత్పత్తి చేసిన సంస్థ 11,500 యూనిట్లు వినియోగించింది.

దీనికిగాను రూ.10.15 చొప్పున విద్యుత్ సంస్థలు డబ్బులు కట్టించుకున్నాయి. వీరిదగ్గర కొన్న 1800 యూనిట్లకు రూ.4.60 చొప్పున ఇస్తామని తెలిపారు. ఆ బిల్లులు కూడా వెసులుబాటు చూసుకుని చెల్లిస్తామని ప్రకటించడంతో సోలార్ ప్యానల్ పెట్టుకున్న సంస్థ విస్తుబోయింది. ఒకవేళ తాము ఉత్పత్తిచేసే విద్యుత్‌ను వినియోగించుకునేందుకు అవకాశం ఇవ్వాలని కోరినా దానికి అంగీకరించలేదని యజమానులు తెలిపారు. అమ్మితే పూర్తిగా తమకే అమ్మాలని, నేరుగా వాడుకోవడానికి లేదని స్పష్టం చేశారని చెబుతున్నారు. తొలుత తమను ప్యానెల్స్ పెట్టుకోవాలని ప్రోత్సహించి ఇప్పుడు నిరుత్సాహ పరుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని సంస్థలు నెలకు 3000 యూనిట్లు కూడా ఉత్పత్తి చేస్తున్నాయని, దానికంటే తక్కువ విద్యుత్‌ను వాడుకుంటున్నా నేరుగా వినియోగించుకునే అవకాశం ఇవ్వడం లేదని స్పష్టం చేస్తున్నారు. దీనిపై త్వరలోనే విద్యుత్‌శాఖ అధికారులను కలిసి తాము ఉత్పత్తి చేసుకున్న విద్యుత్ నేరుగా తామే వాడుకునేలా అవకాశం ఇవ్వాలని కోరనున్నామని, లేదా బిల్లులో మినహాయింపు ఇవ్వాలని కోరనున్నామని యజమానులు తెలిపారు.

అప్పు ఇచ్చిన వ్యక్తి భూమిని కాజేయడంతో యువజంట ఆత్మహత్య

ప్రజాశక్తి-చెన్నూరు (కడప)

కడపలో విషాదం నెలకొంది. అప్పుచ్చిన వ్యక్తి భూమిని కాజేయడంతో యువ దంపతులు రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నారు. మృతురాలి తల్లి, రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చెన్నూరు మండలం రామనపల్లె గ్రామానికి చెందిన సాయికుమార్‌రెడ్డి(30), హేమమాలిని (28)కి ఏడాది క్రితం వివాహమైంది. దంపతులిద్దరూ కడపలోని విజయదుర్గా కాలనీలో నివసిస్తున్నారు. సాయికుమార్‌రెడ్డి వాటర్ డిస్టిబ్యూటర్ కంపెనీ నిర్వహిస్తుండగా.. మరియాపురంలోని రియల్ ఎస్టేట్ సంస్థలో హేమమాలిని ఉద్యోగం చేస్తున్నారు. తన అవసరం నిమిత్తం ఎకరా పొలాన్ని రూ. మూడు లక్షలకు కడప నగరానికి చెందిన నారాయణ స్వామి వద్ద సాయికుమార్‌రెడ్డి తనఖా పెట్టాడు. తిరిగి డబ్బులు చెల్లించినా నారాయణ స్వామి పొలాన్ని తిరిగివ్వకపోగా తన అనుచరులతో బెదిరింపులకు పాల్పడ్డాడు. ఈ విషయమై పలుసార్లు పంచాయితీలు కూడా పెట్టారు. దీంతో దంపతులిద్దరూ మానసిన వేదనకు గురయ్యారు. తమ భూమి ఇక తిరిగిరాదని నిశ్చయించుకుని దంపతులిద్దరూ కడప శివారులోని కనుమలోపల్లి సమీపంలోని రైల్వేట్రాక్‌పై మంగళవారం అర్ధరాత్రి ఆత్మహత్య చేసుకున్నారు. మృతురాలు హేమమాలిని ఎనిమిది నెలల గర్భిణీ. రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించి మృతదేహాలను శవపరీక్ష నిమిత్తం రిమ్స్ జనరల్ ఆస్పత్రికి తరలించారు. యువ దంపతుల మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడి ఇటీవల కులాంతర వివాహం చేసుకున్నారు.

ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

- ఆక్టోపస్ ఎస్‌పి బి రవిచంద్ర

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆరోగ్య సమస్యలు పెరిగిపోతున్న నేపథ్యంలో ఉచిత వైద్యసేవలు ఎక్కడ అందిస్తున్నా.. సద్వినియోగం చేసుకోవాలని ఆక్టోపస్ ఎస్‌పి బల్లి రవిచంద్ర సూచించారు. మంగళగిరిలోని ఆక్టోపస్ ప్రధాన కార్యాలయంలో విజయవాడ లోని అమరావతి హాస్పిటల్ ఉచిత వైద్య శిబిరాన్ని బుధవారం నిర్వహించింది. ఈ ఉచిత వైద్య శిబిరాన్ని ఎస్‌పి ఎం నాగేంద్రరావుతో కలిసి రవిచంద్ర ప్రారం భించారు. ఈ వైద్యశిబిరంలో అధికారులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులకు వైద్య పరీక్షలు చేసి వైద్య సేవలు అందించారు. ఆర్థోపెడిక్, చర్మ సమస్యలకు, జనరల్ మెడిసిన్, కంటి సమస్యలకు వైద్యసేవలు అందించారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో డాక్టర్ వేణు నాదెళ్ల, డాక్టర్ శైలజ, వికాస్ కాట్రగడ్డతోపాటు యూనిట్ వైద్యులు టి రత్నాకర్, జి మంజువాణి వైద్యసేవలు అందించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్‌పిలు కె నగేష్‌బాబు, కె రామచంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు. మొత్తం 180 మంది వైద్యసేవలు పొందారు.

తాడేపల్లిలోని రామయ్యకాలనీలో సిపిఎం, సిపిఐ ప్రచార భేరిలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

అధికారం కోసం సైనికులను బలిచేస్తారా?

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

ప్రజాశక్తి - తాడేపల్లి (గుంటూరు జిల్లా)

పుల్వామాలో 2019లో జరిగిన సైనిక మరణాలు.. మోడీ స్వయంకృత అపరాధమేనని వెల్లడైందనిసిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. ఇటువంటి దుర్మార్గమైన ప్రభుత్వానికి అధికారంలో ఉండే అర్హతలేదని తెలిపారు. మోడీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా తాడేపల్లిలోని నులకపేట ఎంఎల్ రామయ్య కాలనీలో బుధవారం ప్రచారభేరి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. దేశంలోని ఓడరేవులు, ఎల్‌ఐసి, రైల్వేలు, విమానాశ్రయాలు తదితర ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు కట్టబెడుతోందన్నారు. దేశ సంపదను లూటీ చేయడంతో పాటు ప్రపంచ మోసగాడిగా అదానీ తన రికార్డులను తానే బద్దలు కొట్టారని ఎద్దేవా చేశారు. ఇటువంటి మోసగాడికి కేంద్ర ప్రభుత్వం కొమ్ముకాస్తోందని విమర్శించారు. ఒక్కొక్కరి ఖాతాలో రూ.15 లక్షలు వేస్తామని చెప్పి జన్‌ధన్ ఖాతాలు ప్రారంభించిన పెద్ద మనిషి ఒక్క రూపాయి కూడా ఖాతాలో వేయలేదని దుయ్యబట్టారు. నీరవ్ మోడీ లాంటి దొంగలు రూ. లక్షల కోట్లు బ్యాంకులకు ఎగ్గొట్టి విదేశాలకు పారిపోతుంటే మోడీ ప్రభుత్వం ఏం చేస్తోందని ప్రశ్నించారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని తుంగలో తొక్కి మనుధర్మ శాస్త్రాన్ని అమలు చేయడానికి యత్నిస్తోందని మండిపడ్డారు. పేదలకు ఇళ్లస్థలాలు, పట్టాలు ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వానికి చేతులు రావడంలేదని అన్నారు. అనేక త్యాగాలతో రామయ్య కాలనీ నిర్మాణం జరిగిందని తెలిపారు. కాలనీ ఏర్పాటై 12 సంవత్సరాలైనా నేటికీ అనేక సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. స్వాతంత్ర్యోద్యమ కాలంలో రాజకీయాలంటే ప్రజలకు మంచి చేయడానికేనని ప్రజలు భావించేవారని, ఆనాటి నాయకులు కూడా సేవాతత్పరతో పనిచేసే వారన్నారు. ఆ వారసత్వాన్ని కమ్యూనిస్టులు కొనసాగిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు, సిపిఐ మంగళగిరి నియోజకవర్గ సహాయ కార్యదర్శి కంచర్ల కాశయ్య, సిపిఎం పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు, వేముల దుర్గారావు పాల్గొన్నారు.

ఆధార్ అప్‌డేట్స్‌లో వ్యత్యాసాలను పర్యవేక్షించాలి

- కలెక్టర్లకు జిఎస్‌డబ్ల్యుఎస్ శాఖ ఆదేశాలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆధార్ అప్‌డేట్స్‌లో వ్యత్యాసాలు కనపడుతున్నాయని, వాటిని పర్యవేక్షించడానికి కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని గ్రామ, వార్డు సచివాలయాలశాఖ ఆదేశించింది. ఈ మేరకు జిఎస్‌డబ్ల్యుఎస్‌శాఖ డైరెక్టరు భావన వశిష్ట బుధవారం జిల్లా కలెక్టర్లకు ఉత్తర్వులు జారీ చేశారు. ఆధార్ అప్‌డేషన్‌లో సస్టైనబుల్ డెవలప్‌మెంట్ అభివృద్ధి (ఎస్‌డిజి) 8 అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. చీఫ్ ప్లానింగ్ ఆఫీసరు, డిప్యూటీ స్టాటిస్టికల్ ఆఫీసర్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఒలు ప్రత్యేకంగా మానిటరింగ్ చేయాలని కలెక్టర్లకు పంపిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆరోగ్యశాఖలోని గర్భిణుల డేటాలో ఒకే ఆర్‌సిహెచ్ ఐడికి రెండు ఆధార్ నెంబర్లు మ్యాప్ చేయబడ్డాయని, 0-5 ఏళ్లలోపు పిల్లలు, 6 నుంచి 19 ఏళ్లలోపు పిల్లల్లో ఒకే తల్లి ఆధార్ ఐడితో మ్యాప్ చేయబడిన బహుళ పిల్లల ఆధార్ ఐడిలు ఉన్నట్లు, బోగస్ చిల్డ్రన్స్ ఆధార్ ఐడిలు పిల్లలకి వ్యతిరేకంగా మ్యాప్ చేయబడినట్లు గుర్తించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వారంలోగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

చర్చి గోడ కూలి ఇద్దరు నిర్మాణ కార్మికులు దుర్మరణం

ప్రజాశక్తి - సామర్లకోట(కాకినాడ)

చర్చి గోడ కూలి ఇద్దరు భవన నిర్మాణ కార్మికులు మృతి చెందిన సంఘటన కాకినాడ జిల్లా సామర్లకోట మన్సిపాలిటీ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. బలుసులపేటలో హౌస్ ఆఫ్ ప్రేయర్ చర్చి పాత భవనాన్ని తిరిగి నిర్మించేందుకు నలుగురు కార్మికులు వచ్చారు. గోడను కూలీలు పిట్టా అర్జునరావు, మచ్చా నాగేశ్వరరావు, యడగల అబ్రహామ్, మరో కూలీ కూల్చుతుండగా ఒక్కసారిగా చర్చి పైభాగంలోని బీమ్ పిల్లర్ వారిపై పడింది. స్థానికులు గమనించి అతికష్టం మీద శిథిలాల నుంచి కూలీలను బయటకు తీశారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన పిట్టా అర్జునరావు (35), మచ్చా నాగేశ్వరరావు (35)ను కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలోనే మృతి చెందారు. అబ్రహాం చికిత్స పొందుతుండగా, మరోకరు స్వల్పంగా గాయపడ్డాడు. సామర్లకోట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భద్రత కల్పించండి

- ఎఎస్‌పికి దస్తగిరి ఫిర్యాదు

ప్రజాశక్తి-కడప అర్బన్/పులివెందుల టౌన్

ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి, కడప ఎంపి వైఎస్.అవినాష్‌రెడ్డి నుంచి తనకు ప్రాణహాని ఉందని, భద్రత కల్పించాలని వివేకా హత్య కేసులో అప్రూవర్‌గా మారిన దస్తగిరి కోరారు. ఈ మేరకు ఎస్‌పి అన్బురాజన్‌కు ఫిర్యాదు చేసేందుకు బుధవారం ఆయన కడపకు వచ్చారు. ఎస్‌పి అందుబాటులో లేకపోవడంతో ఎఎస్‌ప తుషారా డూడీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దస్తగిరి మీడియాతో మాట్లాడుతూ.. భాస్కర్‌రెడ్డి అరెస్టు కావడంతో నాకు ప్రాణహాని పొంచి ఉందని, తక్షణమే భద్రతా సిబ్బందిని పెంచాలని కోరారు. ఎంపి అవినాష్‌రెడ్డి పదేపదే నా మీద తప్పుడు అభియోగాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వివేకానందరెడ్డి హత్య కేసులో సిబిఐ నుంచి గానీ, సునీత వద్ద గానీ డబ్బులు తీసుకున్నట్లు నిరూపిస్తే తాను జైలుకు వెళ్లడానికి సిద్ధమన్నారు. అలా నిరూపించలేకపోతే మీ పార్టీకి రాజీనామా చేసి మీరు జైలుకు పోతారా అంటూ అవినాష్‌రెడ్డిని ప్రశ్నించారు. నాకు, నా కుటుంబానికి రక్షణ కల్పించాలని కోరారు. వివేకా హత్య కేసును సిబిఐ వేగవంతం చేసిందని తెలిపారు. దస్తగిరి ఫిర్యాదు మేరకు పోలీసులు భద్రతను పెంచారు. ముందు ఒకరు ఉండగా ప్రస్తుతం ఐదుగురిని కేటాయించారు. దీంతో భద్రత ఆరుగురికి చేరింది.

గిద్దలూరు బహిరంగ సభలో మాట్లాడుతున్న చంద్రబాబు

'మార్కాపురాన్ని జిల్లా' చేస్తాం

వైసిపిది విధ్వంసక పాలన : చంద్రబాబు

ప్రజాశక్తి- యంత్రాంగం

విధ్వంసానికి, నేరాలకు, దాడులకు, అక్రమ కేసులకు, హత్యలకు వైసిపి పాలన చిరునామాగా మారిందని మాజీ ముఖ్యమంత్రి, టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబునాయుడు విమర్శించారు. ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా ప్రకాశం జిల్లా గిద్దలూరులో బహిరంగ సభ, కడప జిల్లా బద్వేలులో కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ..తాము అధికారంలోకి వస్తే మార్కాపురాన్ని జిల్లాగా చేస్తామని హామీనిచ్చారు. చెత్తమీద కూడా పన్ను వేసిన చెత్త ముఖ్యమంత్రి జగన్ అని విమర్శించారు. గతంలో ఉచితంగా దొరికే ఇసుక ఇప్పుడు బంగారంగా మారిందని, దేశంలో ఎక్కడా దొరకని జే బ్రాండ్ మద్యం ఎపిలోనే దొరుకుతోందని మండిపడ్డారు. పోలీసులు సహకరించకపోతే జగన్ ఇంట్లో నుంచి కూడా బయటకు రాలేరన్నారు. వైసిపి అసమర్థ, చేతగాని పాలన కారణంగా నిరుద్యోగం 35 శాతానికి పెరిగి పోయిందన్నారు.ఉమ్మడి రాష్ట్రంలో సైబరాబాద్, హైటెక్ సిటీ, ఐటిసెంటర్, జిఎన్ఎస్ఎస్, హెచ్ఎన్ఎస్ఎస్, తెలుగుగంగ, గండికోట, ఫార్మా సంస్థలను ఏర్పాటు చేసిన ఘనత టిడిపిదేనన్నారు. టిడిపి హయాంలో సర్పంచులకు రాజయోగం కల్పించామని తెలిపారు. దేశంలో ప్రతి రైతు నెత్తిన రూ.76 వేలు అప్పు ఉండగా, రాష్ట్రంలో ప్రతి రైతుపై రూ.రెండు లక్షల కోట్లు ఉందన్నారు. టిడిపి హయాంలో రూ.8,500 కోట్ల మేరకు సాగునీటి రంగానికి ఖర్చు చేశామని, వైసిపి హయాంలో ఏమి చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో గంజాయి, గన్‌కల్చర్ పెరిగిపోయిందని ఆరోపించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి, పొలిట్‌బ్యూరో సభ్యులు ఆర్.శ్రీనివాసులరెడ్డి, మాజీ మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, అమర్నాథ్‌రెడ్డి, కడప జిల్లా టిడిపి అధ్యక్షులు లింగారెడ్డి, మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, అమీర్‌బాబు, పెద్దఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోండి

- ఎపిఎస్‌ఆర్‌టిసి ఎమ్‌డికి ఎస్‌డబ్ల్యుఎఫ్ వినతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎపిఎస్‌ఆర్‌టిసి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఎపిపిటిడి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ కోరింది. ఆర్‌టిసిని నిర్వీర్యం చేసే ప్రక్రియను నిలుపదల చేయాలని డిమాండ్ చేసింది. ఎపిఎస్‌ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమలరావుకు ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎస్‌కె జిలాని బాషా, ప్రధాన కార్యదర్శి ఎం అయ్యప్పరెడ్డి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఆర్‌టిసిలో సొంత బస్సులను కొనుగోలు చేయకుండా, హైర్ బస్సులపై ఆధారపడటం సరికాదన్నారు. ఆర్‌టిసి స్థలాలను, బస్టాండ్లను లీజుకు ఇచ్చే ప్రక్రియను నిలుపదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ బస్సులను కన్సార్టియం ద్వారా కాకుండా, నేరుగా ఆర్‌టిసినే నిర్వహించాలన్నారు. డీజిల్‌పై పన్నులు తగ్గించాలన్నారు. ఉద్యోగులకు సంబంధించి వైద్య విధానంలో పాత విధానాన్ని కొనసాగించాలని కోరారు. వేతనాల ఎరియర్స్, పెండింగ్‌లో వున్న డిఎలను చెల్లించాలని డిమాండ్ చేశారు. క్రమశిక్షణ చర్యలకు గురైన వారికి అప్పిలేట్ అథారిటీని ఏర్పాటు చేయాలన్నారు. ఆర్‌టిసిలో పనిచేస్తూ... 2016కు ముందు చనిపోయిన వారి కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాలు చేపట్టాలన్నారు.

వడదెబ్బతో ఉపాధి కూలీ మృతి

ప్రజాశక్తి సింగనమల

అనంతపురం జిల్లా శింగనమల మండల పరిధిలోని గోవిందరాయునిపేట గ్రామంలో వడదెబ్బకు గురై ఉపాధి కూలీ బుధవారం ఉదయం మృతి చెందాడు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... గ్రామానికి చెందిన కట్టుబడి ఇమామ్ హుస్సేన్(52) బుధవారం ఉదయం ఉపాధి హామీ పనికి వెళ్లాడు. పనులు ముగించుకుని ఇంటికి వచ్చిన తర్వాత వడదెబ్బకు గురై అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆయన్ను మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మతునికి భార్య కట్టుబడి ఫాతిమా, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

బైక్ షోరూంలో అగ్ని ప్రమాదం

- 50 ఎలక్ట్రికల్ బైక్‌లు, రెండు లగేజీ ఆటోలు దగ్ధం

ప్రజాశక్తి - పలాస (శ్రీకాకుళం జిల్లా)

శ్రీకాకుళం జిల్లా పలాస-కాశీబుగ్గ మున్సిపాల్టీలో ఎలక్ట్రికల్ బైక్ షోరూం, పెయింట్స్ దుకాణంలో బుధవారం వేకువజామున అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో 50 ఎలక్ట్రికల్ బైక్‌లు, రెండు లగేజీ ఆటోలు, రెండు సైకిళ్లు కాలి బూడిదయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. కాశీబుగ్గకు చెందిన పి.సింధు, బ్రాహ్మణతర్లాకు చెందిన కోరాడ హరిశంకర్ కలిసి సమన్వి ఎంటర్‌ప్రైజెస్ గో గ్రీన్ మోటార్స్ ఎలక్ట్రికల్ బైక్ షోరూం నిర్వహిస్తున్నారు. షోరూం నుంచి ఉదయం 5.30 గంటలకు పొగలు వచ్చాయి. స్థానికులు గమనించి షోరూం యజమానులకు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అప్పటికే బైక్ షోరూం నుంచి మంటలు పక్కనే ఉన్న శ్రీసాయి పెయింట్స్ దుకాణానికి వ్యాపించాయి. ఈ ప్రమాదంలో షోరూంలో ఉన్న 50 బైక్‌లు, రెండు లగేజీ ఆటోలు, రెండు సైకిళ్లతోపాటు ఫ్యాన్లు, కంప్యూటర్లు, ఇన్వర్టర్ పూర్తిగా కాలిపోయాయి. షోరూంలోనే ప్రత్యేక గదిలో ఉన్న సుమారు రూ.15 లక్షల విలువైన స్పేర్ పార్ట్స్ కూడా అగ్నికి ఆహుతయ్యాయి. పెయింట్స్ దుకాణంలో సుమారు రూ.15 లక్షల విలువ గల రంగుల డబ్బాలు మంటలకు పాడయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేసినా అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్లే ఈ ప్రమాదం సంభవించిందని, రెండు దుకాణాల్లో సుమారు రూ.85 లక్షల వరకు నష్టం వాటిల్లిందని పలాస అగ్నిమాపక అధికారి సోమేశ్వరరావు తెలిపారు.

మెటాలో మరో 10 వేల మందిపై వేటు..!

- డిస్నీలోనూ 15% మందికి ఉద్వాసన
- విప్రోలో ఫ్రెషర్లకు గడ్డుకాలం

వాషింగ్టన్ : ఆర్థిక సంక్షోభ భయాలతో దిగ్గజ టెక్ కంపెనీలు ఉద్యోగులకు ఉద్వాసనలు పలుకుతూనే ఉన్నాయి. తాజాగా మెటా, వాల్ట్ డిస్నీలు భారీ మొత్తంలో తొలగింపులకు సంకేతాలు ఇవ్వగా.. విప్రో ఫ్రెషర్లపై వేటుకు సిద్ధం అయ్యింది. ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ మాతృసంస్థ అయినా మెటా మరోసారి వేలాది ఉద్యోగులను ఇంటికి పంపించే చర్యలకు దిగుతోందని సమాచారం. ఈ దఫా 10,000 మంది ఉద్యోగులకు కోత విధించనుందని బ్లూమ్‌బర్గ్ తాజాగా రిపోర్ట్ చేసింది. ఒక్కటి, రెండు రోజుల్లోనే దీనిపై అధికారికంగా ప్రకటన వెలుపడే సూచనలున్నాయి. ఇంతక్రితం మార్చిలో 10వేల మంది ఉద్యోగులను తొలగించనున్నట్లు మెటా సిఇఒ మార్క్ జుకర్ బర్గ్ ప్రకటించిన విషయం తెలిసిందే. దీనికి కొనసాగింపుగానే ప్రస్తుత నిర్ణయం. బ్లూమ్‌బర్గ్ రిపోర్ట్ ప్రకారం.. సంస్థ పునర్నిర్మాణంలో భాగంగా ఈ కఠిన నిర్ణయం తీసుకోక తప్పడం లేదని జుకర్ బర్గ్ పేర్కొన్నారు. తొలగింపు అంశంపై మేనేజర్లకు మెటా సమాచారం కూడా ఇచ్చింది. ఉద్యోగులు ఇంటిబాట పట్టడానికి సిద్ధపడి ఉండాలని తెలిపింది. ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, వర్చువల్ రియాలిటీ సంస్థ రియాలిటీ ల్యాబ్స్, క్విస్ట్ హార్డ్ వంటి విభాగాల్లోని ఉద్యోగులకు ఉద్వాసన పలికే అవకాశం ఉందని తెలుస్తోంది. గతేడాది నవంబరులో 13 శాతానికి సమానమైన 11,000 మంది ఉద్యోగులపై వేటు వేసింది. ఇప్పటికే కొత్త నియామకాల్ని దాదాపు నిలిపివేసింది. ప్రకటనల ఆదాయం తగ్గడంతో పాటుగా ప్రతికూల వ్యాపార పరిస్థితుల నేపథ్యంలో ఉద్యోగులను తొలగించాల్సి వస్తుందని మెటా పేర్కొంది.

అమెరికాకు చెందిన ప్రముఖ వినోద సంస్థ వాల్ట్ డిస్నీ దాదాపు 15 శాతం మంది ఉద్యోగులను తొలగించనుంది. వచ్చే వారం ఆ సంస్థ ఎంటర్‌టైన్‌మెంట్ విభాగంలోఉద్వాసనలు ఉండనున్నాయని తెలిపింది. ఏప్రిల్ 24 నాటికి తొలగింపులపై సిబ్బందికి స్పష్టమైన సమాచారం చేరవేస్తామని ఆ వర్గాలు తెలిపాయి. ఆ సంస్థ 2023 ఫిబ్రవరిలోనే ఏడు వేల మంది ఉద్యోగులను తీసేసింది. తాజాగా మరో విడత తొలగింపు ప్రకటనతో ఆ కంపెనీ ఉద్యోగులు తీవ్ర ఆందోళన నెలకొంది.

భారత దిగ్గజ ఐటి కంపెనీల్లో ఒక్కటైన విప్రో తన ఫ్రెషర్లకు ఎసరు పెట్టే యోచనలో ఉందని తెలుస్తోంది. దాదాపు 15 నెలలకు పైగా ంచే పనిలో ఉఆన్‌బోర్డింగ్ కోసం ఎదురుచూస్తున్న ఫ్రెషర్‌లకు మరో పరీక్ష విధించడం ద్వారా అనేక మందికి ఉద్వాసన పలకనుందని రిపోర్టులు వస్తోన్నాయి. ఈ తరహా పరీక్షను ఇప్పటికే ఫ్రెషర్లు ఎదుర్కొన్నప్పటికీ.. మరోసారి ఈ చర్యకు దిగడం గమనార్హం. ఇటీవల ఫ్రెషర్లకు ఇచ్చే వేతనాలను రూ.6.5 లక్షల నుంచి రూ.3.5 లక్షలకు కోత పెట్టింది.

గ్రామ పంచాయతీ కార్మికులకు అందని జీతాలు

వెంటనే చెల్లించాలని యూనియన్ డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ పంచాయతీ కార్మికులు, పార్ట్‌టైమర్స్, గ్రీన్ అంబాసిడర్లకు బకాయిపడ్డ జీతాలు వెంటనే చెల్లించాలని, అక్రమ తొలగింపులు ఆపాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని ఎపి గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) డిమాండ్ చేసింది. ఈ మేరకు యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి వెంకటరామయ్య, కె ఉమామహేశ్వరరావు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గ్రామ పంచాయతీ కార్మికులకు నాలుగు నుంచి ఎనిమిది నెలలు, పార్ట్ టైమర్స్‌కు జిఒ 6 ప్రకారం రెండేళ్లు, గ్రీన్ అంబాసిడర్లకు 6 నుంచి 18 నెలలు జీతాల బకాయిలు ఉన్నాయని, తక్షణమే ప్రభుత్వం చెల్లింపులు చేపట్టాలని వారు విజ్ఞప్తి చేశారు. పార్ట్ టైమర్స్‌కు జిఒ 6 ప్రకారం రూ.20 వేలు, బిల్ కలెక్టర్లకు రూ.23 వేలు, జీతం, డిఎ చెల్లించాల్సి ఉండగా, కేవలం 3, 4 నెలలకు మాత్రమే జీతాలు చెల్లించి తర్వాత పాత జీతాలు (13-15 వేలు) మాత్రమే చెల్లిస్తున్నారని తెలిపారు. 010 పద్దు ద్వారా జీతాలు చెల్లించాల్సి ఉండగా, పంచాయతీల మీదకు నెట్టివేయడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. గ్రీన్ అంబాసిడర్లకు నెలకు రూ.10 వేలు చెల్లిస్తామని జారీ చేసిన జిఒ 680ని, ప్రభుత్వం అటకెక్కించిందని విమర్శించారు. గ్రామ పంచాయతీ కార్మికులకు గుర్తింపు కార్డు, కనీస వేతనం, ఇపిఎఫ్, ఇఎస్ఐ అమలు చేస్తామంటూ 1999లో సంయుక్త రాష్ట్రంలో జారీ చేసిన జిఒ 551 ఇప్పటికీ అమలుకు నోచుకోలేదన్నారు. గతం నుంచి విధులు నిర్వహిస్తున్న కార్మికులను టెండర్లతో సంబంధం లేకుండా విధుల్లో కొనసాగించాలని 2020లో పంచాయతీరాజ్ ప్రిన్సిపల్ సెక్రటరీ, కమిషనరు, 13 జిల్లాల కలెక్టర్లు, జిల్లా పంచాయతీ అధికారులకు హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను ఏ ఒక్కరూ అమలు చేయడం లేదని తెలిపారు. బకాయి జీతాలు ఇవ్వకుండా, కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలను ఉధృతంగా చేపడతామని వారు హెచ్చరించారు.

ఉత్తరాంధ్రను కొల్లగొట్టేందుకే విశాఖ రాజధాని

- టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉత్తరాంధ్రను కొల్లగొట్టేందుకే విశాఖ రాజధాని అంటూ సిఎం జగన్ పూటకో తేదీ, నెల అంటూ ప్రకటనలు చేస్తున్నారని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు విమర్శించారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. నాలుగేళ్లలో విశాఖలో రూ.40 వేలకోట్ల విలువైన భూములు మింగారని, విలువైన భూములు కాజేసేందుకు కుట్ర పన్నారని విమర్శించారు. ఇప్పటికే ముడుపులకు భయపడి రాష్ట్రంలో పరిశ్రమలు పొరుగు రాష్ట్రాలకు తరలిపోయాయని పేర్కొన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ఇఒఐలో ఎందుకు పాల్గొనలేదని ప్రశ్నించారు. ఉన్న పోర్టుల్లో వాటాలు కూడా అమ్మేసి, అవినీతికి పాల్పడ్డారని, పోర్టుల పేరుతో ఇప్పటికే రూ.5 వేలకోట్ల కమీషన్ కొట్టేశారని విమర్శించారు. విద్యుత్ ప్లాంట్ల పేరుతో 75 వేల ఎకరాల ఆదివాసుల భూములు కాజేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. సొంత మీడియా, పత్రికలు, ఎలాంటి అండా లేదని జగన్ అబద్ధాలు చెబుతున్నారన్నారు. సాక్షి మీడియా ఎవరిదో చెప్పాలని ప్రశ్నించారు. కెసిఆర్ డబ్బుతోనే ఎన్నికల్లో లబ్ధి పొందారని ఆరోపించారు. శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలంలో రూ.వందల కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశామంటూ ప్రజలను పక్కదారి పట్టిస్తున్నారని పేర్కొన్నారు. నాలుగేళ్లుగా గుర్తుకురాని ఉత్తరాంధ్ర అభివృద్ధి ఇప్పుడే గుర్తుకు వచ్చిందా? అని ప్రశ్నించారు.

తాడేపల్లి నులకపేట వాసులకు ఇళ్ల పట్టాలు

- సిఎంకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి లేఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

తాడేపల్లి నులకపేట ప్రాంత కాలనీలకు మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని, ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు బుధవారం ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి లేఖ రాశారు. లేఖను మీడియాకు విడుదల చేశారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలో నులకపేట సమీపంలో ఎమ్మెల రామయ్య, బ్రహ్మానందపురం తదితర తొమ్మిది కాలనీల్లో ఎస్‌సి, బలహీన వర్గాలకు చెందిన రెండు వేల కుటుంబాల వారు 40 సంవత్సరాల నుండి ఉంటున్నారని తెలిపారు. ఇప్పటికీ వారికి ఇంటి పట్టాలు, అభివృద్ధి కార్యక్రమాలు లేవని తెలిపారు. వీరంతా ఇంటిపన్ను, కరెంటు కనెక్షన్లు కలిగి ఉన్నారని అయినా ఇప్పటి వరకు రోడ్లు, మురుగు కాలువలు, డ్రైనేజీ వంటి సదుపాయాలు పూర్తిస్థాయిలో కల్పించలేదని పేర్కొన్నారు. వీధిదీపాలు లేవని, గుంటల మెట్లు, మట్టిరోడ్లపైనే నడవాల్సి వస్తోందని లేఖలో వివరించారు. మురుగునీరు, వర్షపునీరు పోయే మార్గం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, మురుగునీటిలో దోమలు పెరిగి ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని, కాలనీల్లో సి.సి.రోడ్లు, అవసరమైన డ్రైనేజీ నిర్మాణం చేపట్టేందుకు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజల అవసరానికి తగువిధంగా విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాలని కోరారు. విభజన చట్టం ప్రకారం ఈ ప్రాంతం డి.ఫారెస్టుకు కేంద్ర ప్రభుత్వం అనుమతినిచ్చినప్పటికీ ఆ దిశగా ఎటువంటి చర్యలూ తీసుకోలేదని, రాష్ట్ర ప్రభుత్వం ఈ కాలనీల్లో ఉంటున్న వారికి వెంటనే ఇళ్లపట్టాలు వెంటనే మంజూరు చేయాలని కోరారు.

ఐఎఫ్‌టియు జాతీయ కమిటీ ఎన్నిక

- పలు తీర్మానాలు ఆమోదం

ప్రజాశక్తి - తిరుచానూరు (తిరుపతి)

తిరుపతి జిల్లా తిరుచానూరులో మూడురోజులపాటు జరిగిన ఐఎఫ్‌టియు అఖిల భారత మహాసభలో బుధవారం జాతీయ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా అపర్ణ (ఢిల్లీ), ప్రధాన కార్యదర్శిగా టి.శ్రీనివాస్ (తెలంగాణ), ఉపాధ్యక్షులుగా వికె పఠోలి, ప్రదీప్, ప్రసాద్, కుల్విందర్ సింగ్, సహాయ కార్యదర్శులుగా 12 మంది ఎన్నుకోబడ్డారు. ఆంధ్రా నుంచి ఎం.వెంకటేశ్వర్లు, జి.భారతి ఎన్నికయ్యారు. 44 కార్మిక చట్టాలను మార్పుచేసి కార్పొరేట్లకు అనుకూలంగా తీసుకొచ్చిన నాలుగు లేబర్‌కోడ్లను వ్యతిరేకిస్తూ మహాసభ తీర్మానించింది. పాత పెన్షన్ స్కీమ్‌ను పునరుద్ధరించాలని, పర్యావరణ అనుకూల, మానవశ్రమ ఆధారిత జూట్ పరిశ్రమను జాతీయ పరిశ్రగా గుర్తించాలని, స్కీం వర్కర్లకు కనీస వేతనం నెలకు రూ.26 వేలు ఇవ్వాలని, భవన నిర్మాణ కార్మికులకు నిలిపివేసిన సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఆర్‌ఎస్‌ఎస్ కనుసన్నల్లో నడుస్తున్న మోడీషా విధానాలను వ్యతిరేకిస్తూ మహాసభ తీర్మానం చేసింది.

అయోమయంలో పసుపు, మొక్కజొన్న రైతులు

- కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని వినతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో పసుపు, మొక్కజొన్న పండించిన రైతులు, కౌలురైతులకు పంట ఎక్కడ అమ్ముకోవాలో తెలియని పరిస్థితిలో ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయిస్తున్నారని, ప్రభుత్వం తక్షణమే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు ఎపి మార్క్‌ఫెడ్ జనరల్ మేనేజరు ఆదినారాయణను సంఘం అధ్యక్షులు వై రాధాకృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎమ్ హరిబాబు నేతృత్వంలోని ప్రతినిధుల బృందం సభ్యులు పంచకర్ల రంగారావు, ఎమ్ నాగేశ్వరరావు, ఆర్ రమేష్ బుధవారం కలిసి వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వం పసుపుకు రూ.6,850, మొక్కజొన్నకు రూ.1,962 కనీస మద్దతు ధరగా నిర్ణయించిందని పేర్కొన్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో పసుపు రైతులు క్వింటాకు రూ.2 వేలకు పైగా నష్టపోతున్నారన్నారు. తక్షణమే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి.. కనీస మద్దతు ధర, ధాన్యం రైతులకు ఇచ్చినట్లు కాటా కూలి, రవాణా ఛార్జీలు, సంచులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

రాయలసీమకు స్పోర్ట్స్ వర్సిటీ

- యువగళంలో నారా లోకేష్

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే రాయలసీమకు స్పోర్ట్స్ యూనివర్సిటీని తీసుకొస్తామని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ హామీ ఇచ్చారు. ఆయన చేపట్టిన యువగళం పాదయాత్ర బుధవారం 75వ రోజుకు చేరింది. కర్నూలు జిల్లా ఆలూరు నియోజకవర్గంలోని వలగొండ నుంచి ప్రారంభమై పాదయాత్ర పుప్పులదొడ్డి, కైరుప్పల, వెంగళదొడ్డి, కారుమంచి మీదుగా ములుగుందం వరకూ సాగింది. వలగొండలో లోకేష్ మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధిలో కీలకపాత్ర వహించే మౌలిక సదుపాయాలను జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చాక రోడ్లు, డ్రెయిన్లు, వంతెన నిర్మాణాలు, సాగు, తాగు నీటి ప్రాజెక్టులు ఎక్కడివి అక్కడే నిలిచిపోయాయని విమర్శించారు. టిడిపి అధికారంలోకి వచ్చాక తుమ్మలవంక బ్రిడ్జి, వలగొండ నుండి పప్పులదొడ్డి వరకు రోడ్డు నిర్మాణాన్ని చేపడతామని హామీ ఇచ్చారు. కారుమంచిలో బిసి తరగతి ప్రతినిధులతో లోకేష్ మాట్లాడుతూ వాల్మీకులకు టిడిపి ఇచ్చిన హామీకి కట్టుబడి ఉందన్నారు. బిసిల్లో ఉపకులాలకు దామాషా ప్రకారం నిధులు మంజూరు చేస్తామని, నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసే ఇండస్ట్రియల్ క్లస్టర్లలో బిసిలకు రిజర్వేషన్ కల్పిస్తామని హామీ ఇచ్చారు. మద్యం దుకాణాల్లో కల్లు గీత కార్మికులకు రిజర్వేషన్ కల్పిస్తామని, విద్యార్థులపై ఒత్తిడి లేకుండా నేరుగా కాలేజీలకు ఫీజులు చెల్లిస్తామని తెలిపారు.

డప్పు కళాకారులను, యాదవులను ఆదుకుంటామన్నారు. కారుమంచి శివార్లలో లోకేష్ ఓ రైతు పొలంలోకి వెళ్లి అరక దున్నుతూ రైతన్న కష్టాలు తెలుసుకున్నారు. ప్రభుత్వాలు ఆదుకోకపోతే వ్యవసాయాన్ని వదిలేయడం తప్ప మరో మార్గం లేదని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే చంద్రన్న ప్రభుత్వం అన్నదాతలకు అన్ని విధాలా అండగా ఉంటుందని లోకేష్ హామీ ఇచ్చారు. లోకేష్ పాదయాత్ర బుధవారం సాయంత్రానికి ములుగుందంకు చేరుకుంది. గురువారం ఆదోని నియోజకవర్గంలో పాదయాత్ర సాగనుంది.

కర్నూలు జిల్లా ఆలూరు నియోజకవర్గంలో అరక దున్నుతున్న నారాలోకేష్

రూ. 50, 100 స్టాంపులు 'ప్రియం'

కృత్రిమ కొరత సృష్టిస్తున్న అమ్మకందారులు

ప్రజాశక్తి- తిరుపతి

తిరుపతి జిల్లాలో స్టాంపు పత్రాల కొరతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మరో వైపు కృత్రిమ కొరతను సృష్టించి స్టాంపు పేపర్ల వెండర్లు వీటిని రెట్టింపు ధరలకు విక్రయిస్తున్నారు. తిరుపతి బాలాజీ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట రూ.50 విలువ గల స్టాంపు పేపర్లను రూ.150 చొప్పున విక్రయిస్తున్నారు. ఆస్తుల రిజిస్ట్రేషన్లతో పాటు వివిధ రకాల దరఖాస్తులకు, న్యాయస్థానంలో కేసు దాఖలు మొదలు అన్నింటికీ స్టాంపు పత్రాల అవసరం ఉంది. ఆస్తులు, ఇతర లావాదేవీలు రిజిస్ట్రేషన్ చేసే సమయంలో మొదటి పేజీ మాత్రం స్టాంపు పేపరుపై ముద్రిస్తున్నారు. దీనికి రూ.50 లేదా రూ.100 ముఖ విలువ కలిగిన పత్రాన్ని వినియోగిస్తారు. మిగిలిన రుసుములు చలానా రూపంలో చెల్లిస్తున్నారు. రూ.10, రూ.20, రూ. 50, రూ.100 డినామినేషన్ పత్రాలు ఎక్కువగా సరఫరా అవుతున్నాయి. తహసీల్దారు కార్యాలయంలో విద్యార్థులు దరఖాస్తు చేసే ప్రతి అంశానికి అఫిడవిట్ అడుగుతున్నారు. కుల, నివాస, ఆదాయ, ఇబిసి, ఈడబ్ల్యూఎస్ లాంటి ధ్రువీకరణలకు నోటరీ గుర్తింపు ఉన్న న్యాయవాదితో అఫడవిట్ దాఖలు చేయాల్సి ఉంటుంది. దీనికి రూ.10 లేదా రూ.50 విలువ గల స్టాంపు పత్రం మీద ఇవ్వాల్సి ఉంది. వాటికి రూ.300 నుంచి 450 వరకు వసూలు చేస్తున్నారు. కేవలం స్టాంపు పత్రానికే రూ.150 అవుతోంది. మిగిలిన వ్యయం టైపిస్టు, న్యాయవాది ఖర్చుల కింద తీసుకుంటున్నారు. దీన్ని ఆసరాగా చేసుకుని కృత్రిమ కొరత సష్టించి అధిక ధరలకు విక్రయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

నిబంధనలు పాటించని విక్రయందారులు

జిల్లాకు స్టాంపు పత్రాలు నాసిక్ నుంచి సరఫరా అవుతున్నాయి. అక్కడ ప్రభుత్వ ప్రింటింగ్ ముద్రణాలయంలో అత్యంత భద్రత మధ్య వీటిని ముద్రిస్తారు. జిల్లా రిజిస్ట్రార్ (ఇండెంట్) నివేదన మేరకు సరఫరా అవుతాయి. ఆయా రిజిస్ట్రార్ పరిధిలోని లైసెన్సు ఉన్న వెండర్లకు ఇవి సరఫరా చేస్తారు. వారు నూటికి 5శాతం కమీషన్ మాత్రమే తీసుకోవాల్సి ఉంటుంది. అంటే రూ.100 విలువగల పత్రాన్ని రూ.105కు మాత్రమే విక్రయించాల్సి ఉంటుంది. ఈ నిబంధనను ఎవరూ పాటించడం లేదు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో నెలకు దాదాపు రూ.100కోట్ల విలువైన పత్రాలు సరఫరా అవుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. లైసెన్సు ఉన్న స్టాంపు వెండర్ల నుంచి వీటిని తిరిగి టైపిస్టులు, దస్తావేజు లేఖరులు కొనుగోలు చేసి విక్రయిస్తుంటారు. అయితే ప్రస్తుతం లైసెన్సు లేకుండానే యధేచ్ఛగా తిరుపతి బాలాజీ సబ్‌రిజిస్ట్రార్, ఎంఆర్ పల్లిలోని రూరల్ రిజిస్ట్రేషన్ కార్యాలయం ఎదుట యధేచ్ఛగా అమ్మకాలు సాగిస్తుండటం గమనార్హం. రిజిస్ట్రేషన్ల విలువ కాకుండా ఇతర అవసరాలకు అఫడవిట్ల రూపంలో వినియోగించే స్టాంపు పత్రాలు ఎక్కువ. కనీసం రెట్టింపు ధరకు విక్రయించినా జిల్లాలో నెలకు రూ.50 కోట్ల భారం క్రయదారులపై పడుతోంది.

హైదరాబాద్‌లో 78% పెరిగిన సంపన్నులు

వాషింగ్టన్ : ప్రపంచంలో అత్యంత సంపన్న నగరాల జాబితాలో హైదరాబాద్ 65వ స్థానంలో నిలిచిందని హెన్లీ అండ్ పార్ట్‌నర్స్ ఓ రిపోర్ట్‌లో వెల్లడించింది. ఈ నగరంలో అత్యధిక నికర సంపదగల వ్యక్తుల సంఖ్య ఏడాదిలో 78 శాతం పెరిగిందని తెలిపింది. ఇక్కడ 11,100 మంది మిలియనీర్లు (రూ.8 కోట్ల పైగా సంపద) ఉన్నారని పేర్కొంది. హెన్లీ అండ్ పార్ట్‌నర్స్ రూపొందించిన 'ప్రపంచంలోనే అత్యంత సంపన్న నగరాల నివేదిక 2023' రిపోర్ట్ ప్రకారం.. మొత్తం 97 నగరాలు ఈ జాబితాలో చోటు దక్కించుకున్నాయి. 2022 డిసెంబర్ 31 నాటికి భారత్ నుంచి ముంబయి నగరం 59,400 మంది మిలియనీర్లతో 21వ స్థానంలో, 12,600 మంది సంపన్నులతో బెంగళూరు 60వ స్థానంలో, కోల్‌కత్తా 12,100 మందితో 63వ స్థానంలో నిలిచాయి. అమెరికాలోని న్యూయార్క్ నగరం 3,40,000 మంది మిలియనీర్లతో అగ్ర స్థానంలో నిలిచింది. జపాన్ రాజధాని టోక్యో 2,90,300 మంది మిలియనీర్లతో రెండో స్థానంలో ఉంది. శాన్‌ఫ్రాన్సిస్కో, లండన్, సింగపూర్, లాస్ ఏంజెల్స్, హాంకాంగ్, బీజింగ్, షాంఘై, సిడ్నీ నగరాలు టాప్ 10లో వరుసగా ఉన్నాయి.

ఫోన్‌పేలో పసిడిపై అక్షయ తృతీయ ఆఫర్లు

న్యూఢిల్లీ : అక్షయ తృతీయ సందర్భంగా తమ వినియోగదారులకు భారీగా క్యాష్ బ్యాక్ ఆఫర్లను అందిస్తున్నట్లు ఫోన్ పే తెలిపింది. తమ యాప్ ద్వారా ఏప్రిల్ 22న ఒక్క గ్రాము లేదా అంతకన్నా ఎక్కువ పరిమాణంలో డిజిటల్ బంగారం కొనుగోలు చేసే వారికి రూ.50 నుండి రూ.500 వరకు క్యాష్ బ్యాక్ తప్పనిసరి ఆఫర్ చేస్తున్నట్లు పేర్కొంది. తాము నిల్వ చేసిన బంగారాన్ని ఏ సమయంలో విక్రయించినా, 48 గంటల్లో దానికి సంబంధించిన డబ్బు వారి బ్యాంక్ ఖాతాలకు జమ అవుతుందని తెలిపింది.

మలబార్ గోల్డ్ ప్రచారకర్తగా అలియా భట్



హైదరాబాద్ : ప్రముఖ అభరణాల రిటైల్ సంస్థ మలబార్ గోల్డ్ అండ్ డైమాండ్స్ తన బ్రాండ్ అంబాసిడర్‌గా ప్రముఖ బాలీవుడ్ నటీ అలియా భట్‌ను నియమించుకుంది. అలియా అందం, అభినయంతో ప్రేక్షకులను అలరిస్తోందని.. ఆమె తమ సంస్థకు మరింత వన్నె తీసుకురాగలదని మలబార్ గోల్డ్ అండ్ డైమాండ్స్ ఓ ప్రకటనలో పేర్కొంది. సంస్థ 30 ఏళ్ల వేడుకల సందర్భంగా అలియాతో జట్టు కట్టినట్లు మలబార్ గ్రూప్ ఛైర్మన్ ఎంపి అహ్మద్ పేర్కొన్నారు. ఈ సంస్థ 10 దేశాల్లో 312 షోరూంలను కలిగి ఉంది.

భారత ప్రభుత్వం

కేంద్ర పర్యావరణం, అడవులు & వాతావరణ మార్పుల శాఖ

ఇంటిగ్రేటెడ్ రీజనల్ ఆఫీస్, విజయవాడ

గ్రీన్ హౌస్ కాంప్లెక్స్, గోపాలరెడ్డి రోడ్డు, విజయవాడ - 520010, ఆంధ్రప్రదేశ్. ఇ-మెయిల్: iro.vijayawada-mefcc@gov.in

F.No.4-APA144/2022-VIJ/597. తేది: 31 అక్టోబర్ 2022

టు, స్పెషల్ చీఫ్ సెక్రటరీ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, పర్యావరణం, అడవులు, సైన్సు & టెక్నాలజీ విభాగం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, రూమ్ నెం.268, 1వ ఫ్లోర్, 4వ బ్లాకు, ఆంధ్రప్రదేశ్ సచివాలయం, వెలగపూడి, అమరావతి, గుంటూరు జిల్లా 522 503. వారికి

విషయము: భారతదేశంలో (లాటు-3/ఒడిశా & ఝార్ఖండ్ /ప్యాకేజ్-2) రాయపూర్-విశాఖపట్నం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో భారత్ మాల పరియోజన క్రింద వాహన రాకపోకల సామర్థ్యం మెరుగుపరచుటకు ఎకనామిక్ క్యారిడార్లు, అంతరత రహదారులు, మరియు ఫీడర్ రూట్లు మరియు కోస్టల్ రోడ్ ప్రధానంగా అభివృద్ధి పరచుట కొరకు విజయనగరంలో 44.52 హెక్టార్ల అటవీ భూమిని ప్రాజెక్టు డైరక్టర్, NHAI, PIU, విజయనగరం వారి పేరున మళ్ళించుటకు సంబంధించినది.

ఆర్యా, పైన తెలిపిన ప్రాజెక్టు కొరకు అటవీభూమి మళ్ళింపు నకు 1980 అటవీ (సంరక్షణ) చట్టం యొక్క 2 విభాగం పరిధిలో కేంద్రప్రభుత్వం వారి ముందస్తు అనుమతిని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారి లెటర్స్ నెంబర్లు 178/సెక్షన్- II /2022/(1629500) తేది 08.02.2022 ఆన్ లైను ప్రతిపాదన నెం. FP/AP/ROAD/151048/2022 ననుసరించినది. కేంద్ర ప్రభుత్వం వారిచే లెటరు తేది 30.03.2022 ననుసరించి ప్రాజెక్టునకు ప్రిన్సిపల్ (స్టేజ్-I) అనుమతి ఇవ్వటమైనది. ప్రిన్సిపల్ అనుమతి నందలి నిర్దేశించిన షరతులను సమ్మతిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నివేదిక లెటరు తేది 23.08.2022 పంపినది (25.10.2022న అందినది)

రాష్ట్ర ప్రభుత్వం వారు దాఖలు చేసిన ప్రతిపాదనను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం, కేంద్ర ప్రభుత్వం తరపున 1980 అటవీ (సంరక్షణ) చట్టం యొక్క 2 విభాగం పరిధి ననుసరించి భారతదేశం లో (లాటు-3/ఒడిశా & ఝార్ఖండ్ /ప్యాకేజ్-2) రాయపూర్-విశాఖపట్నం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లో భారత్ మాల పరియోజన క్రింద వాహన రాకపోకల సామర్థ్యం మెరుగుపరచుటకు ఎకనామిక్ క్యారిడార్లు, అంతర్గత రహదారులు, మరియు ఫీడర్ రూట్లు మరియు కోస్టల్ రోడ్ ప్రధానంగా అభివృద్ధి పరచుట కొరకు విజయనగరంలో **44.52 హెక్టార్ల** అటవీ భూమిని ప్రాజెక్టు డైరక్టర్, NHAI, PIU, విజయనగరం వారి పేరున మళ్ళించుట ఈ క్రింది షరతులకు లోబడి బదలాయింపు చేయుటకు (స్టేజ్-II) అనుమతి ఇవ్వటమైనది.

(i) చట్టపరమైన మళ్ళింపు చేసిన అటవీ భూమి స్థితిలో మార్పు ఉండదు.

(ii) ప్రతిపాధిత అటవీ ప్రాంతం సరిహద్దుని 4 అడుగుల ఎత్తు సిమెంట్ కాంక్రీటు స్థంభాలను తగిన సంఖ్యలో ఒకదానికి మరొకదానికి మధ్య 20 మీటర్ల దూరం ఉండేలాగ యూజర్ ఏజెన్సీ ఖర్చుతో ఏర్పాటు చేయాలి. **మళ్ళింపునకు ప్రతిపాదించిన అటవీ ప్రాంతం యొక్క కొన్ని ప్యాచెస్ అటవీయేతర ప్రాతానికి అనుకుని ఉన్నాయి. కనుక రాష్ట్ర అటవీ శాఖ వారు ఆక్రమణలు నివారించుటకు మళ్ళింపు సక్రమంగా చేయుటకు సరిహద్దులు సరిగా ఉండేటట్లు చూడాలి.**

(iii) దిగువ తెలిపిన **90.22 హెక్టార్ల** విస్తీర్ణంలో క్షీణించిన అటవీ భూమిని గుర్తించటం జరిగినది, యూజర్ ఏజెన్సీ నుండి ఇప్పటికే పొందిన మొత్తముతో నష్టపరిహార మొక్కల పెంపకంను రాష్ట్ర అటవీ శాఖ చేపట్టాలి.

వ.నెం.	ప్రాంతం (రేంజ్)	ఆర్ఎఫ్ పేరు	కంపార్టుమెంట్ నెం.	ఏరియా (హెక్టార్లు)
01	విజయనగరం	దామరసింగి	249	20.36
02	విజయనగరం	పూల్ బాగ్	254	25.02
03	పార్వతీపురం	షికారుగంజ్	169	10.50
04	పార్వతీపురం	షికారుగంజ్	171	10.00
05	పార్వతీపురం	సంగంవలస	201	14.79
06	సాలూరు	తాడూరు (పార్ట్-ఎ)	388	3.18
07	సాలూరు	తాడూరు (పార్ట్-బి)		6.37
మొత్తం				90.22

(iv) బయోటిక్ ఒత్తిడి నివారించుటకు CA పథకంలో అవసరమైతే; కంచె వంటి కార్యక్రమాలతో కలుపుకుని MoEF & CC మార్గదర్శకాలు మరియు వర్కింగ్ ప్లానులోని సూచనలు దృష్టిలో ఉంచుకుని క్షీణించిన అటవీ ప్రాంతంలో అవసరమైన సంఖ్యలో మొక్కలు ఉండేలాగ రాష్ట్ర అటవీశాఖ చూసుకోవాలి.

(v) రాష్ట్ర అటవీ శాఖ CA భూమిని ప్రయోజనం కోసం తగిన విధంగా గుర్తించాలి IRO విజయవాడ ద్వారా భవిష్యత్ పర్యవేక్షణ ప్రయోజనం కొరకు ప్లాట్ల గుర్తింపు కొరకు మరియు విజయవంతమైన ప్లాంటేషన్ సాధనకు CA ప్లాంటేషన్ ను రాష్ట్ర అటవీ శాఖ క్రమం తప్పకుండా పర్యవేక్షించాలి.

(vi) CA ప్రయోజనం మరియు CA పథకం కొరకు గుర్తించిన ప్రాంతంను కేంద్ర ప్రభుత్వం వారి ముందస్తు అనుమతి లేకుండా మార్చకూడదు.

(vii) బదలాయించిన అటవీ భూమి యొక్క నికర ప్రస్తుత విలువ (NPV) కు సంబంధించి అదనపు మొత్తము ఏదైనను రివిజన్ అనంతరం గౌరవ సుప్రీం కోర్టు ఆఫ్ ఇండియా వారు భవిష్యత్తులో సూచించినచో ఆ మొత్తమును కూడా యూజర్ ఏజెన్సీ నుంచి రాష్ట్ర ప్రభుత్వం వసూలు చేస్తుంది.

(viii) **యూజర్ ఏజెన్సీ నుండి ఇప్పటికే వసూలు చేయబడిన మొత్తము నుండి చీఫ్ వైల్డ్ లైఫ్ వారెన్ ఆమోదించిన వైల్డ్ లైఫ్ మిటిగేషన్ ప్లాన్ రాష్ట్ర అటవీ శాఖ వారిచే అమలు చేయబడాలి. వన్యప్రాణి మిటిగేషన్ ప్లాను యొక్క అమలు పైన వివరణాత్మక నివేదిక IRO, విజయవాడ వారికి క్రమం తప్పకుండా డాక్యుమెంట్ల రుజువులతో తెలియచేయాలి.**

(ix) **సంబంధిత DFO కన్సల్టేషన్ లో రోడ్డునకు ఇరువైపుల వరుస చెట్లను పెంచటం మరియు నిర్వహణను యూజర్ ఏజన్సీ చేపట్టాలి.**

(x) సంబంధిత DFO ను సంప్రదించుట ద్వారా అవసరమైన చోట రిటైనింగ్ వాల్స్ మరియు చెక్ వాల్స్ ప్రాజెక్ట్ ఖర్చుతో యూజర్ ఏజెన్సీ నిర్మించాలి.

(xi) సహజమైన వాగులు/నదులు/కాలువలు పైన నిర్మించు కల్వర్టులు/వంతెనలు ఏవైనను నీటి ప్రవాహానికి అడ్డంకి కాకుడదు, నీటి ఎద్దడి కలిగించకూడదు మరియు అడవి జంతువుల కదలికలకు ఆటంకం కలిగించకూడదు.

(xii) రోడ్డు ప్రక్కన కటింగ్స్ మరియు ఫిల్లింగ్ కొరకు ఇంజనీరింగ్ మద్దతు అవసరమైతే, మట్టిని స్థిరీకరించుటకు సంబంధిత DFO సూచనలు అందించడతాయి.

(xiii) **అవసరమైనచోట చెట్ల నరికివేతను సంబంధిత DFO పర్యవేక్షణలో నిర్వహించాలి మరియు సాధ్యమైన చోట చెట్లను వేరొక చోటకు బదిలీ చేయుటను UA ప్రాజెక్ట్ ఖర్చుతో చేయాలి.**

(xiv) త్రవ్వి తీసిన మెటీరియల్/వ్యర్థాలను అటవీ ప్రాంతం వెలుపల పడవేయకూడదు. ఏదైన మెటీరియల్ అటవీ ప్రాంతం నందు నిల్వ చేయరాదు.

(xv) కేంద్ర ప్రభుత్వం వారి ముందస్తు అనుమతి లేకుండా ప్రతిపాదించిన లే అవుట్ ప్లాను మార్చకూడదు.

(xvi) నష్టం/చెట్లు నరకటం నివారించుటకు తగినంత వంటచెరకు, ప్రత్యామ్నాయ ఇంధనంగా యూజర్ ఏజెన్సీ శ్రామికులకు ఏర్పాటు చేయాలి మరియు అటవీ ప్రాంతము నందు శ్రామికుల శిబిరం స్థాపించకూడదు.

(xvii) అటవీ ప్రాంతానికి బయట సాధ్యమైనంత దూరంగా వేసే శ్రామిక శిబిరాలు వలన కనీస ఇబ్బంది కలిగించరాదు మరియు పని నిర్వహణలో నిమగ్నమైన శ్రామికులు మరియు సిబ్బంది వలన సమీప వృక్షజాలం మరియు జంతుజాలంనకు ఇబ్బంది కలగకుండా యూజర్ ఏజెన్సీ బాధ్యత వహించాలి.

(xviii) ప్రాజెక్ట్ కొరకు వినియోగించు మొత్తం అటవీ భూమి **44.52 హెక్టార్లకు** మించరాదు. మరియు మళ్ళింపునకు ప్రతిపాదించిన అటవీ భూమిని మళ్ళింపు చేసిన దానిక తప్ప మరే ఇతర ప్రయోజనానికి వాడకూడదు.

(xix) మళ్ళింపునకు ప్రతిపాదించిన భూమిని కేంద్ర ప్రభుత్వ ముందస్తు అనుమతి లేకుండా ఎట్టి పరిస్థితులలోను ఏదైన ఇతర సంస్థ, శాఖ లేదా వ్యక్తికి బదిలీచేయుట లేదా సబ్ లెట్ నకు ఇచ్చుట చేయకూడదు.

(xx) ఈ ప్రాజెక్టునకు వర్తించు అన్ని చట్టముల యొక్క నియమావళి, నియమ నిబంధనలు, మార్గదర్శకాలు, మరియు కాలానుగుణంగా అమలు లో నున్న వాటిని యూజర్ ఏజెన్సీ మరియు రాష్ట్ర ప్రభుత్వం సమ్మతించాలి.

(xxi) వృక్షజాలం మరియు జంతుజాలం ప్రాంతంలో మొక్కల పెంపకం, సంరక్షణ మరియు యాజమాన్యత పట్ల ఆసక్తితో కేంద్ర ప్రభుత్వం లేదా ప్రాంతీయ అధికారి, (సెంట్రల్) సమగ్ర ప్రాతీయ కార్యాలయం (IRO), విజయవాడ వారు కాలానుగుణంగా ప్రవేశపెట్టు ఏవైన ఇతర షరతులకు యూజర్ ఏజెన్సీ కట్టుబడి ఉండాలి.

(xxii) పైన తెలిపిన షరతులు ఏవైనను భర్తీ చేయుటలో యూజర్ ఏజెన్సీ విఫలమైనచో FCA-1980 పరిధిలోని నియమావళి / మార్గదర్శకాలు ప్రకారం చట్టపర చర్యకు బాధ్యులగుదురు.

ఇట్లు : తమ విశ్వాసపాత్రుడు
(ఎన్.ఎస్.మురళి)
ఇన్ స్పెక్టర్ జనరల్ ఆఫ్ ఫారెస్ట్స్ (సెంట్రల్)

సంపాదకీయం

ప్రైవేటుకు 'సహకారం'

స్వాతంత్ర్యోద్యమంలో అంతర్భాగమైన సహకార ఉద్యమ స్ఫూర్తితో రైతులు నిర్మించుకున్న కోఆపరేటివ్ వ్యవస్థను ధ్వంసం చేసేందుకు కేంద్ర బిజెపి ప్రభుత్వం ప్రయత్నిస్తుండగా, రాష్ట్ర ప్రభుత్వం కనీసం ఆలోచించకుండా సాదరంగా ఆహ్వానిస్తోంది. ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల (పిఎసిఎస్-ప్యాక్స్) లోకి ప్రైవేటు పెట్టుబడికి ఆస్కారం కల్పిస్తూ మొన్న రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు కేంద్రం ఆదేశాల మేరకే వెలువడ్డాయి. సొసైటీల్లో 50 శాతం వాటాలు ప్రైవేటు వ్యక్తులకు, కంపెనీలకు ఇచ్చేయడమంటే వాటిని ప్రైవేటీకరించడమే. ఇంతకాలం రైతుల పూర్తి అజమాయిషీలో నడిచిన ప్యాక్స్‌లోకి ప్రైవేటు వ్యక్తులు చొరబడతారు. రాజ్యాంగం ప్రకారం 'సహకారం' రాష్ట్రాల పరిధిలోనిది. మోడీ సర్కారు రాజ్యాంగాన్ని తుంగలో తొక్కి కేంద్రంలో సహకార మంత్రిత్వ శాఖను నెలకొల్పి హోం మంత్రి అమిత్‌షా చేతుల్లో పెట్టింది. సహకార వ్యవస్థ నిర్వీర్యానికి, కొన్ని దశాబ్దాలుగా పోగుబడిన ప్రజాధనంపై పెత్తనానికి చట్ట సవరణలు, మోడల్ బైలాస్ రూపొందించి రాష్ట్రాలు వాటిని ఆమోదించాలని శాసిస్తున్నారు. ఆ పూర్వరంగంలో వచ్చిందే ప్యాక్స్ ప్రైవేటీకరణ జీవో.

సహకార వ్యవస్థను పునరుజ్జీవింపజేస్తామని మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన వైసిపి ప్రభుత్వం చేసిందేమీ లేదు. పిఎసిఎస్‌లపై నాక్బాబ్ కన్సల్టెన్సీతో అధ్యయనం చేయించి నివేదికను ఆమోదించింది. ప్యాక్స్‌లో ప్రైవేటు కన్సల్టెన్సీల నియామకం, వారికి డైరెక్టర్ వంటి పోస్టులివ్వాలని నాక్బాబ్ సిఫారసు చేసింది. ఇది సహకార రంగ అసలు లక్ష్యానికి విఘాతం కలిగిస్తుంది. చట్ట ప్రకారం ప్యాక్స్‌లో రైతులు, కౌలు రైతులు మాత్రమే సభ్యులుగా ఉండాలి. ఇప్పుడు బయటి వ్యక్తులు, కంపెనీల ప్రతినిధులు సభ్యులవుతారు. నాక్బాబ్ నివేదికలో ఉద్యోగుల పాలసీ అని ప్రతిపాదించారు. అది ఉద్యోగులకు వ్యతిరేకం. పిఎసిఎస్‌ల పరిస్థితి ఇలా ఉండగా సహకార డెయిరీలు, చక్కెర కర్మాగారాలు, ఆయిల్, స్పిన్నింగ్ మిల్లులు మూతబడుతున్నాయి. వాటిని తెరిపించే ప్రయత్నాలేవీ లేవు. కోఆపరేటివ్ డెయిరీలను పునరుజ్జీవింపజేసే బదులు వాటి ఆస్తులను గుజరాత్‌కు చెందిన అమూల్‌కు ధారాదత్తం చేసింది. గ్రామాల్లో సమాంతరంగా పాల రైతు సంఘాలను నెలకొల్పి వాతావరణం కలుషితం చేసింది. పక్కనున్న కర్ణాటకలో రైతులు స్థానిక నందినికి మద్దతుగా అమూల్‌కు వ్యతిరేకంగా ఆందోళనలు చేస్తున్నారు. అక్కడి గుణపాఠాన్ని మన రాష్ట్ర సర్కారు నేర్వట్లేదు. పాల రైతులకు లీటర్‌కు రూ.4 బోనస్ ఇస్తామని మేనిఫెస్టోలో పేర్కొనగా ఆ ఊసు తేవట్లేదు.

కేంద్రం మొన్న బడ్జెట్‌లో దేశ వ్యాప్తంగా కొత్తగా రెండు లక్షల ప్రైమరీ వ్యవసాయ, మత్స్య, డెయిరీ సంఘాలు ఏర్పాటు చేస్తామంది. ఏ సంఘం లేని గ్రామాల్లో వీటిని నెలకొల్పుతామంటూనే, ఆర్థికంగా చితికిపోయి కొనసాగించలేని వాటిని మూసేస్తామంది. ప్యాక్స్‌ను మల్టీపర్పస్ సర్వీస్ సంఘాలుగా మారుస్తామనీ పేర్కొంది. ఆచరణలోకొస్తే 30 రకాల వ్యాపారాలు సొసైటీలు చేసుకోవచ్చు. రైతుల అవసరాల కోసం కాకుండా కార్పొరేట్ల సరుకులు అమ్ముకోడానికి అనువుగా సొసైటీలు మారిపోతాయి. కేంద్ర ఆత్మనిర్భర్ పథకంలో వ్యవసాయ మౌలిక సదుపాయాల నిధి ఒకటి. ఇది పూర్తి రుణం. ఈ అప్పుతో ఆర్‌బికెలకు అనుబంధంగా రైతులకు అన్ని వసతులూ ఒకే చోట దొరికేలా మల్టీపర్పస్ ఫెసిలిటీ సెంటర్ల (ఎంపిఎఫ్‌సి)ను రాష్ట్ర ప్రభుత్వం నెలకొల్పుతోంది. వాటి నిర్మాణానికి ప్యాక్స్ భూములు ఉపయోగిస్తోంది. అందుకోసమే నిరుడు నవంబర్‌లో ఆర్‌బికె, ప్యాక్స్ అనుసంధానం కోసం 1964- సహకార చట్టానికి సవరణలు చేసింది. దీన్నిబట్టి సహకార వ్యవస్థ ధ్వంసానికి కేంద్ర దర్శకత్వంలో రాష్ట్రం నడుస్తున్నట్లు అర్థమవుతుంది. ఉన్న ప్యాక్స్‌లో సగం నష్టాల్లో ఉన్నాయని నాక్బాబ్ స్టడీ తేల్చింది. వాటి మెడపై కత్తి వేలాడుతోంది. ఇప్పటికైనా సర్కారు ప్రైవేటీకరణ జిఒ ఉపసంహరించుకోవాలి. కోఆపరేటివ్స్‌ను పరిపుష్టం కావించాలి. ప్రైవేటీకరణపై సహకార ఉద్యోగులు ఆందోళనలు చేపట్టారు. రైతులు తమ ఆస్తిని కాపాడుకోవడానికి కదలాలి. సహకార వ్యవస్థ బలోపేతానికి నిర్వహించే పోరాటం దేశభక్తికి గీటురాయి.

మంచి మాట

ఈ ప్రపంచంలో ఒక వ్యక్తి ప్రత్యేకతను...
తన దగ్గర వున్న సంపదను బట్టి
కాకుండా...మొత్తం ప్రజల బతుకుల్లో
సౌభాగ్యాన్ని నింపడానికి
చేసిన కృషిని బట్టి గుర్తించాలి.

- రోబ్ గౌలాండ్,
ఆస్ట్రేలియా కమ్యూనిస్టు పార్టీ
సిడ్నీ నగర కమిటీ కార్యదర్శి, రచయిత.

విశ్లేషణ

యోగి ఆటవిక పాలన!

> **పోలీసు ఎన్‌కౌంటర్లు పెద్ద ఎత్తున జరిగాయా అంటే...అక్కడ శాంతి భద్రతల పరిరక్షణ యంత్రాంగం, న్యాయాన్ని అందించాల్సిన వ్యవస్థ విఫలమయ్యాయని అర్థం. పోలీసు యంత్రాంగాన్ని ఎన్‌కౌంటర్ల విభాగంగా మార్చి , లోపించిన జవాబుదారీతనాన్ని సంస్కరించటం అంత తేలిక కాదు. ఏకు మేకై కూర్చుంటుంది. చివరకు పెంచి పోషించిన వారికే తలనొప్పిగా మారుతుంది. అధికారం మారితే అదే పోలీసు యంత్రాంగం పాలకులు ఎవరి మీద గురి పెట్టమంటే వారి మీదే తుపాకులను ఎక్కు పెడుతుంది.**



ఎం. కోటేశ్వరరావు

శనివారం రాత్రి పదిన్నర గంటలపుడు (ఏప్రిల్ 15వ తేదీ) పటిష్టమైన పోలీసు బందోబస్తులో విలేకర్లతో మాట్లాడుతుండగా అతిక్ అహమ్మద్, అతని సోదరుడు అష్రఫ్ అహమ్మద్ అనే నేరగాళ్లను ముగ్గురు దుండగులు అతి సమీపం నుంచి కాల్చి చంపారు. ఉత్తర ప్రదేశ్‌లో శాంతి భద్రతలకు ఇది చక్కటి ఉదాహరణ. అంతకు రెండు రోజుల ముందు అతిక్ అహమ్మద్ 19 ఏళ్ల కుమారుడిని, అతని అనుచరుడిని పోలీసులు ఎన్‌కౌంటర్‌లో కాల్చి చంపారు. ఇది బూటకపు ఎన్‌కౌంటర్ అని వేరే చెప్పనవసరం లేదు. దాని కొనసాగింపుగానే అతిక్ సోదరులను ఒక పథకం ప్రకారం మట్టుబెట్టించారని అనేక మంది భావిస్తున్నారు. పేరు మోసిన గూండాలను కాల్చి చంపినా తప్పు పడితే ఎలా అని తక్షణ న్యాయం కావాలని కోరుకొనే కొందరు ప్రశ్నిస్తారు. ప్రజాస్వామ్య ముసుగులో ఎన్‌కౌంటర్లు సమాజానికి పీడగా ఉండే నేరగాళ్లకే పరిమితం కావు. తమకు నచ్చనివారిని సైతం అధికారంలో ఉన్న పెద్దలు ఏదో ఒక సాకుతో ఏరిపారవేస్తారు. తమ దాకా వచ్చినపుడు గానీ "తక్షణ న్యాయ" వాదులకు ఈ అంశం అర్థం కాదు. అలా కోరుకోవటం, అలాంటి ఉదంతాలకు మద్దతు ఇవ్వటం అంటే నిరంకుశ శక్తులను ప్రోత్సహించటమే.

ఉత్తరప్రదేశ్‌లో యోగి అధికారానికి వచ్చిన తరువాతే నేరగాళ్లను మట్టుబెట్టి పీడ లేకుండా చేస్తున్నట్లుగా ప్రచారం పెద్దఎత్తున సాగుతున్నది. 2017 నుంచి ఇప్పటి వరకు ఎన్‌కౌంటర్లలో 183 మంది నేరగాళ్లను లేపివేసిన బాహుబలిగా వర్ణిస్తున్నారు. జాతీయ మానవ హక్కుల సంస్థ సమాచారం ప్రకారం 2017 మార్చి నుంచి 2022 మార్చి నెల వరకు దేశంలో ప్రతి మూడు రోజులకు ఒక ఎన్‌కౌంటర్ చొప్పున, 813 మంది మరణించినట్లు వెల్లడించింది. ఇవన్నీ ఉత్తరప్రదేశ్‌లో జరిగినవి కాదు. దుండగులు తమ దగ్గర ఉన్న తుపాకులను లాక్కొనేందుకు, తమ కస్టడీ నుంచి పారిపోయేందుకు, తనిఖీ జరుపుతుండగా కాల్పులు జరిపినపుడు ఆత్మరక్షణ కోసం కాల్చినట్లు పోలీసులు చెప్పటం తెలిసిందే.

జాతీయ మానవ హక్కుల సంస్థ సమాచారం ప్రకారం 2002 నుంచి 2008 వరకు దేశంలో 440 ఎన్‌కౌంటర్ కేసులు జరిగాయి. రాష్ట్రాల వారీ చూసినట్లయితే ఉత్తరప్రదేశ్‌లో 231, రాజస్థాన్‌లో 33, మహారాష్ట్రలో 31, ఢిల్లీలో 26, ఆంధ్రప్రదేశ్‌లో 22, ఉత్తరాఖండ్‌లో 19 ఎన్‌కౌంటర్లు జరిగాయి. తరువాత 2009 అక్టోబరు నుంచి 2013 ఫిబ్రవరి వరకు 555 ఉదంతాలు జరగ్గా రాష్ట్రాల వారీ ఉత్తరప్రదేశ్‌లో 138, మణిపూర్‌లో 62, అసోంలో 52, పశ్చిమ బెంగాల్ 35, జార్ఖండ్‌లో 30 ఉన్నాయి. వీటిలో కొన్ని రాష్ట్రాలలో ఉగ్రవాదులు, వేర్పాటువాదులు మరణించారు. ఈ కాలంలో యోగి అధికారంలో లేరు. ఉత్తరప్రదేశ్‌లో వేర్పాటువాదం లేదా నక్సల్ సమస్య లేదు. జరిగిన ఎన్‌కౌంటర్లలో అగ్రస్థానంలో ఎందుకు ఉన్నట్లు? ఉత్తరప్రదేశ్ పోలీసు కస్టడీ మరణాలకు పేరుమోసింది. దీని గురించి ఎక్కడా ప్రచారం ఎందుకు జరగదు? వారంతా ఎవరు, నేరగాళ్లేనా? టైమ్స్ ఆఫ్ ఇండియా 2022 జులై 26 నాడు ప్రచురించిన వార్త చెప్పిందేమిటి? 2020 ఏప్రిల్ ఒకటి నుంచి 2022 మార్చి 31 వరకు ఎన్‌హెచ్‌ఆర్‌సి సమాచారం ప్రకారం దేశంలో 4,484 పోలీస్ కస్టడీ మరణాలు, 233 ఎన్‌కౌంటర్ మరణాలు జరిగినట్లు లోక్‌సభకు ప్రభుత్వం తెలిపింది. వీటిలో ఉత్తరప్రదేశ్ 952 మరణాలతో అగ్రస్థానంలో ఉంది. నరేంద్ర మోడీ తాను ప్రాతినిధ్యం వహిస్తున్న చోట ఈ దుర్మార్గం ఏమిటనిగానీ, ప్రజాస్వామ్య కబుర్లు చెపితే జనం ఏమనుకుంటారని గానీ ఎప్పుడైనా ఆత్మావలోకనం చేసుకున్నారా?

ఒక పెట్టుబడిదారుడిని చంపినంత మాత్రాన దోపిడీ, ఒక భూస్వామిని చంపినంత మాత్రాన గ్రామాల్లో అణచివేత అంతరించదు. అలాగే గూండాలను చంపినంత మాత్రాన గూండాయిజం అంతం కాదు. అదే జరిగి ఉంటే 1990 దశకం నుంచి 2000 దశకం వరకు ముంబై, మహారాష్ట్ర ఇతర ప్రాంతాల్లో గూండాలు, మాఫియా డాన్లను పోలీసులు చంపివేశారు. వాటితో అక్కడ ఇప్పుడు గూండాయిజం అంతరించిందా? కొత్తవారు పుట్టుకొస్తూనే ఉంటారు. ఏప్రిల్ 13న ఎన్‌కౌంటర్‌లో చంపిన పందొమ్మిదేళ్ల అతిక్ అహమ్మద్ కుమారుడికి యోగి అధికారంలోకి వచ్చే నాటికి 13 సంవత్సరాలుంటాయి. అతను ఈ కాలంలో గూండాగా మారాడా? నిజంగా మారితే ఎన్‌కౌంటర్లను, బాహుబలి యోగిని ఖాతరు చేయటం లేదనుకోవాలి, అలా కాకపోతే తండ్రి అతిక్ అహమ్మద్ మీద కసి తీర్చుకొనేందుకు పోలీసులు అతగాడిని హతమార్చి ఉండాలి. ఏది నిజం? చట్టబద్ద పాలన సాగుతోందా, విరుద్ధంగా ఉందా?

అతిక్ అహమ్మద్ సోదరులను చంపిన ముగ్గురు నేరగాళ్ల గురించి చూస్తే వారిలో లవలేష్ తివారీ సంఘ పరివార్ ఏర్పాటు చేసిన బజరంగ్‌దళ్ నేతగా ఉన్నాడని వార్తలు. తమకేం సంబంధం లేదని ఆ సంస్థలు ప్రకటించటం ఊహించనిదేమీ కాదు. ఫేస్‌బుక్‌లో తనను బజరంగ్ దళ్ జిల్లా సహ నేతగా వర్ణించినపుడే తమకే సంబంధం లేదని ప్రకటించి ఉంటే వేరు. ఇప్పుడు చెబుతున్నారంటే గాడ్సేను కూడా అలాగే తమ వాడు కాదని ఆర్‌ఎస్‌ఎస్ చెప్పిన సంగతి గుర్తుకు వస్తోంది. నేరం చేసిన తరువాత 'జై శ్రీరామ్' అనటాన్ని బట్టి, ముగ్గురూ కలసి వచ్చారంటే మిగిలిన ఇద్దరు కూడా ఆ బాపతే లేదా తోడు తెచ్చుకున్న నేరగాళ్లన్నది స్పష్టం. వివిధ ప్రాంతాలకు చెందిన వారిని పోలీసులే ఒక దగ్గరకు చేర్చి ఉండాలి. గతంలో వారి మీద కేసులు ఉన్నప్పటికీ ముగ్గురూ కలసి చేసినట్లు ఇంతవరకు ఎవరూ చెప్పలేదు. విధి నిర్వహణలో ఉన్న 17 మంది పోలీసులను వెంటనే సస్పెండ్ చేసినట్లు వచ్చిన వార్తలు ఫేక్ అని, ఇంతవరకు ఎలాంటి చర్యలు లేవని అదానీ ఆధీనంలోని ఎన్‌డిటివి పేర్కొన్నది. లవలేష్ తివారీతో తమకెలాంటి సంబంధం లేదని కుటుంబం చెప్పిందట. కొన్ని సంవత్సరాల నుంచి మాట్లాడటం లేదని కూడా తండ్రి చెప్పాడట. తాను బ్రాహ్మణుడినని, శాస్త్రాలను గాక ఆయుధాలు పట్టుకు తిరుగుతానని లవలేష్ చెప్పేవాడట. సన్నీ అనే నేరగాడు రౌడీ షీటర్. పద్నాలుగు కేసులున్నాయి. ఎలా నేరగాడిగా మారిందీ తెలియదని సోదరుడు చెప్పాడు. మూడోవాడు అరుణ్ చిన్నపుడే ఇల్లు వదలి వెళ్లాడు. తాము పేరు మోసిన నేరగాళ్లం కావాలనే కోరికతో అతిక్ సోదరులను కాల్చి చంపినట్లు పోలీసులకు చెప్పారట. యోగి పాలన ఇలాంటి ఉత్తేజాలకు దోహదం చేస్తున్నట్లే కదా! ఇలాంటి గూండాలను ఒక దగ్గరకు చేరుస్తోందా?

యోగి ఆదిత్యనాథ్ అధికారానికి వచ్చిన తరువాత ఇప్పటి వరకు పది వేలకు పైగా ఎన్‌కౌంటర్లు జరిపారని వార్తలు. దీనితో నేరాలు అదుపులోకి వచ్చినట్లు ప్రచారం చేస్తున్నారు. కానీ నేరాల వివరాలను చూసినపుడు అలాంటి దాఖలాలు లేవు. కేంద్ర ప్రభుత్వ జాతీయ గణాంకాలను (పట్టిక) చూద్దాం.

రాష్ట్రం	2016	2017	2018	2019	2020
ఉత్తరప్రదేశ్	4,94,025	6,00,082	5,85,157	6,28,578	6,57,925
అన్ని రాష్ట్రాలు	45,75,746	47,22,642	47,69,681	48,01,091	62,91,485

పట్టికలో వున్న వివరాల ప్రకారం ఉత్తరప్రదేశ్‌లో యోగి అధికారానికి రాక ముందు 2016లో నమోదైన అన్ని రకాల కేసులు 4,94,025 ఉంటే 2020లో అవి 6,57,925కు పెరిగాయి. దేశంలో 45,75,746 నుంచి 62,91,485కు చేరాయి. దేశంలో పెరిగినట్లుగానూ ఉత్తర ప్రదేశ్‌లో కూడా ఉన్నాయి. మొత్తం కేసులలో అక్రమంగా ఆయుధాలు కలిగినవి 2021లో దేశంలో వందకు 3.3 ఉంటే ఉత్తరప్రదేశ్ 11.8 శాతంతో అగ్రస్థానంలో ఉంది. రెండంకెలు గల రాష్ట్రం మరొకటి లేదు. అలాంటి స్థితిలో అక్కడి జనం ప్రశాంతంగా నిద్రపోతారా? యోగి ఆదిత్యనాథ్‌కు రెండు తుపాకులకు లైసెన్సు కూడా ఉన్నట్లు గతంలో వార్తలు వచ్చాయి. సర్వసంగ పరిత్యాగి, నిరంతరం భద్రతా వలయంలో ఉండే యోగి పరిస్థితి ఇది. గూండాలను అణచివేస్తే అన్ని అక్రమ ఆయుధాలు ఎలా ఉంటాయి?

ఎన్‌కౌంటర్ల గురించి ప్రచారం మీద చూపిన శ్రద్ధ ఇతర అంశాల మీద లేదు. తమకు విధించిన జీవితకాల శిక్ష గురించి చేసుకున్న అప్పీళ్లు సంవత్సరాల తరబడి విచారణకు రావటం లేదంటూ 18 మంది నేరస్థులు సుప్రీంకోర్టుకు దాఖలు చేసిన విన్నపంలో అలహాబాద్ హైకోర్టులో 160 మంది జడ్జీలకు గాను 93 మందే ఉన్నారని పేర్కొన్నారు. 2022 ఫిబ్రవరిలో సుప్రీంకోర్టు వారికి బెయిల్ ఇచ్చింది. "బలహీన వర్గాలకు చెందిన వారు ఎప్పటికీ కస్టడీలోనే ఉంటున్నారు. మా అనుభవంలో అలాంటి వారు జైళ్లలో ఉంటున్నారు. ఉన్నత సమాజానికి చెందిన ఒక నేరగాడు శిక్ష పడే సమయానికి దేశం నుంచి తప్పించుకున్నాడని" ఆ సందర్భంగా సుప్రీం కోర్టు పేర్కొన్నది. ఇది యోగి సర్కార్ సిగ్గు పడాల్సిన అంశం. 2021 ఆగస్టు నాటికి 1.8 లక్షల క్రిమినల్ అప్పీళ్లు హైకోర్టులో పెండింగ్‌లో ఉన్నాయి. రెండు వేల సంవత్సరం నుంచి కేవలం 31,044 కేసులనే హైకోర్టు పరిష్కరించింది. పదేళ్లకు ముందు అప్పీలు చేసిన ఖైదీలు 7,214 మంది జైల్లో ఉన్నారు. 2017 మార్చి నుంచి 2021 ఆగస్టు వరకు ఉత్తరప్రదేశ్ పోలీసులు జరిపిన 8,472 ఎన్‌కౌంటర్లలో 3,302 మంది నేరారోపణలు ఉన్నవారు గాయపడ్డారు. వారిలో 146 మంది మరణించారు. పోలీసు ఎన్‌కౌంటర్లు పెద్ద ఎత్తున జరిగాయా అంటే...అక్కడ శాంతి భద్రతల పరిరక్షణ యంత్రాంగం, న్యాయాన్ని అందించాల్సిన వ్యవస్థ విఫలమయ్యాయని అర్థం. పోలీసు యంత్రాంగాన్ని ఎన్‌కౌంటర్ల విభాగంగా మార్చి, లోపించిన జవాబుదారీతనాన్ని సంస్కరించటం అంత తేలిక కాదు. ఏకు మేకై కూర్చుంటుంది. చివరకు పెంచి పోషించిన వారికే తలనొప్పిగా మారుతుంది. అధికారం మారితే అదే పోలీసు యంత్రాంగం పాలకులు ఎవరి మీద గురి పెట్టమంటే వారి మీదే తుపాకులను ఎక్కు పెడుతుంది. ★

సెటైర్



మధ్యాహ్న 'బాలుడు'

మధ్యాహ్న 'బాలుడు' మల్లెపూవు ఛాయ, మల్లెపూవు మీద మంకెన్న పూ ఛాయ అంటూ మా కాంప్లెక్సు లోని ఓ భక్తి ఛానల్ నుండి వచ్చే సుమధుర సంగీతం వినిపిస్తోంది. శ్రద్ధగా వినాలే కాని అన్ని మతాల, అందరు దేవుళ్ళ భక్తి ఛానళ్ళూ వినబడతాయి అక్కడ నిలబడితే. ఆహా నిజంగా నా భారతదేశం ఓ సెక్యులర్ దేశమే కదా అని మనస్సు పరవళ్ళు తొక్కింది. ఎవరి ప్రార్థనలు వాళ్ళు చేసుకొమ్మనండి ఎవరికీ అభ్యంతరంలేదు అది వాళ్ళ హక్కు కూడా. ఐతే ఆ భక్తిని దేశం వైపు, దేశంలో రైతులు, కార్మికులు, సామాన్య ప్రజల వైపు, పెరుగుతున్న ధరలవైపు మళ్ళించే దారి మాత్రం ఆ ఛానళ్ళు చూపరు. కావలిస్తే మధ్యలో వ్యాపార ప్రకటనలు ముఖ్యంగా బంగారు ఆభరణాలు, రియల్ ఎస్టేటు, రకరకాల బ్రాండ్ల బియ్యం, మినపగుండ్లు, ఆట, నూనెలు, సేమియాలు ఇలాంటివి మస్తు మస్తుగా చూపించి దండుకుంటారు. నెంబర్ వన్ హీరోనే ఫలానా సేమియాతో టిఫిన్ చేసి పెట్టమని చెల్లెలికి చెబుతుంటే వినక ఛస్తామా!!

భానుడు అంటే సూర్యుడు తెల్లారినప్పటి నుండి పొద్దుగూకే వరకు ఎలా ఉంటాడో రాసిన ఆ కవిని మనసులోనే అభినందించాను. ఐతే అది ఎప్పుడు రాశాడో తెలీదు. ఇప్పుడున్న వాతావరణాన్ని చూస్తే అది ఎంతగా మరిపోయిందో ఆ పాట వల్ల తెలిసిపోతుంది. మధ్యాహ్న బాలుడు అన్నారే గాని అందులో, మధ్యాహ్నం సూర్యుడు బాలుడు కాదు, బలిష్టమైన బాక్సింగ్ ఆటగాడిలా తన ప్రతాపం చూపుతూ, నిప్పులు కక్కుతూ, మనచేత చెమటలు కక్కించి మరీ పోతాడు. కావాలంటే మా కర్నూలుకు రండి ఎండ ఎలా ఉంటుందో చూపుతాం, ఫ్రీగానేలెండి. అలాగే కొండారెడ్డి బురుజు కూడా చూద్దురు గాని.

ఈ ఎండాకాలంలో సూర్యుడిని "మొత్తం నీవే చేశావ్" అని ప్రకాశ్ రాజ్‌ని బొమ్మరిల్లు సినిమాలో కొడుకు సిద్దార్థ్ అన్నట్టు అందరూ తిట్టేవాళ్ళే. నిజంగా మన భూమి సూర్యుడికి దగ్గరగా పోతుంది ఎండా కాలంలో. నిజం చెప్పాలంటే అలా దగ్గరికి పోతున్నందుకే ఎండాకాలం వచ్చింది. అది వేరే సంగతి. ఆ ఎండకు కొందరు ఒడియాలు, అప్పడాలు పెట్టుకుంటుంటే ఇంకొందరు అంటే కోట్లు కలవాళ్ళు సోలార్ ఎనర్జీ అంటూ సూర్యుడి నుండి కూడా డబ్బు తీయొచ్చని నిరూపిస్తున్నారు. మంచిదే అలా ఆ సూర్యరశ్మి నుండి విద్యుత్తు తీస్తే. మనకే ఇతర విధాల ఉత్పత్తి చేసే కరెంటుకు తోడ్పడుతుంది. కాలుష్యమూ తగ్గుతుంది. ఐతే ఈ ఎండలెందుకు పెరుగుతున్నాయి, రోడ్ల కోసమని చెట్లు కొట్టేసినందునా, కొండలు పగలేస్తున్నందువల్లనా, ఇష్టమొచ్చినట్టు మన ప్రకృతిని మనమే నాశనం చేసుకుంటున్నందువల్లనా, అడవులను క్రమంగా తగ్గిస్తున్నందువల్లనా, నదుల్లో ఇసుకను తోడేసుకుంటూ పోతున్నందునా అనుకుంటూ ఆలోచిస్తే ఇంకా ఎన్నో కారణాలు కనిపిస్తాయి. పాపం సూర్యుడికి ఇవన్నీ తెలియవు. తనను తిట్టుకుంటున్నట్టు కూడా ఆ సూర్యనారాయణుడికి తెలియదు. అది వేరే సంగతి. కాని మనకు అంటే మనుషులకు, అంటే ప్రజలకు, నాయకులకు బాగా తెలుసు. అది అసలు సంగతి. ప్రపంచంలో ఎక్కడో ఒకచోట మూడువందల అరవై ఐదు రోజులూ యుద్ధాలు జరుగుతుంటాయి, ఆ యుద్ధంలో ఒకదేశం తయారు చేసిన ఆయుధాలు, విమానాలు, క్షిపణులు వాడుతుంటారు. ఇంకా ఎక్కువ మాట్లాడితే రెండువైపులా అవన్నీ సమకూర్చి యుద్ధం చేయిస్తుందా దేశం. మళ్ళీ తానే కాలుష్యం కాలుష్యం అని అరుస్తుంటుంది, దొంగ తానే దొంగా దొంగా అని అరచినట్టు. అసలు ప్రపంచానికి పట్టిన కాలుష్యమే ఆ దేశమని మరవద్దు.

కాబట్టి నాదేశ పెజలారా మీ భక్తి మీకు ఉండనీండి. మీ దేవుడు ఎవరైనా కావచ్చు, అల్లా, జీసస్, రాముడు, గురునానక్ ఇలా ఎందరైనా కావచ్చు. కానీ నా రాష్ట్రం, నా దేశం, నా ప్రపంచం కూడా మీకు దేవుడి లాంటివే. తిన్నామా, పడుకున్నామా, తెల్లారిందా, సూర్యుడొచ్చాడా, ఈరోజు ఉష్ణోగ్రత ఎంత అని తెలుసుకొని మళ్ళీ రేపు అంటే మరుసటిరోజు లేయడం కాదు, ఆ రేపటిని కాస్త జాగ్రత్త చేసి మన పిల్లలకి బహుమతిగా ఇచ్చిపోవద్దూ.... ఆలోచించండి. ఉన్నది ఒకటే జిందగీ...అంతే కాదు ఉన్నది ఒకటే దునియా..!

- జంధ్యాల రఘుబాబు,
సెల్ : 9849753298

మీ వ్యాసాలను
పంపాల్సిన మెయిల్ :
editpageps@ gmail.com

విమర్శ

చరిత్ర పాఠాల తొలగింపు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం

కె. విజయ గౌరి

జాతి నిర్మాణానికి విలువలు కలిగిన విద్యార్థులను తయారు చేయడమే విద్యావ్యవస్థ లక్ష్యం. కాని కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జాతీయ నూతన విద్యా విధానం (ఎన్ఇపి) జాతి లక్ష్యాలకు, రాజ్యాంగ సూత్రాలకు భిన్నంగా నిర్ణయాలు చేస్తున్నది. రాష్ట్రంలో ఇప్పటికే క్లస్టరైజేషన్, డిజిటలైజేషన్, విలీన ప్రక్రియలు, వృత్తి విద్యా కోర్సులలో ఎన్ఇపి అమలు వలన ఎటువంటి దుష్పరిణామాలను చవిచూస్తున్నామో అనుభవాలు రుజువు చేస్తున్నాయి. ఇదిలావుండగా సిలబస్‌లో, పాఠ్యాంశాలలో కూడా కేంద్రం జోక్యం పెరుగుతున్నది. తాజాగా 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి పన్నెండవ తరగతి పాఠ్యపుస్తకాలలో చరిత్రకు సంబంధించిన చాప్టర్లను తొలగించారు.

భావి పౌరులకు దేశ చరిత్ర తెలియకూడదనే

సరిగ్గా కోవిడ్ విపత్తు సమయంలో, వ్యవస్థలేవీ పని చేయలేని విపత్కాల పరిస్థితులతో కేంద్ర ప్రభుత్వం ఎన్ఇపి అమలుకు పూనుకుంది. విద్యా సంస్థలు కోల్పోయిన పనిదినాలను దృష్టిలో పెట్టుకుని విద్యార్థులపై భారం తగ్గించాలని 30 శాతం సిలబస్‌ను తగ్గించాలని ఎన్‌సిఇఆర్‌టి కూడా సూచించింది. 'వేటిని తొలగించాలి? ఎవరి అభిప్రాయాలు తీసుకోవాలనే ప్రక్రియగాని, పారదర్శకతగాని లేదు. 2021 లోని సిలబస్‌ను తగ్గించేటపుడు విద్యార్థులపై భారాన్ని తగ్గించే విధంగా లేదు. పాలకుల భావజాల వ్యాప్తికి అడ్డంకిగా వున్న పాఠ్యాంశాలను తొలగించారు. కోవిడ్ విపత్తును అవకాశంగా మలుచుకుని, వారి ఎజెండా అమలుకు పూనుకున్నది. ఎన్ఇపి ముసాయిదాను విడుదల చేసినపుడు అది అమలైతే ఎటువంటి ప్రమాదాలు వస్తాయని ఊహించామో అవి నేడు విద్యారంగంలో జరిగిపోతున్నాయి.

నాడు తొలగించిన వాటిలో ముఖ్యమైనవి

లౌకికవాదం, ప్రజాస్వామ్యం, హక్కులు, పౌరసత్వం, ఉద్యమాలు, జాతీయవాదం, ప్రాంతీయ అవసరాలు, స్థానిక సంస్థలు, ప్రభుత్వాలు, ఆహార భద్రత, పర్యావరణం, పంచవర్ష ప్రణాళికలు, ఇతర దేశాలతో సంబంధాలు, అలీన విధానం, పర్యావరణం, సహజ వనరులు, భిన్నత్వంలో ఏకత్వం వంటి అంశాలకు సంబంధించిన పాఠ్యాంశాలను తొలగించారు. ఇవన్నీ మనదేశ చరిత్ర, వారసత్వ సంపదకు సంబంధించిన అంశాలు. ఒక్క మాటలో చెప్పాలంటే ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాదులు, రాజ్యాంగ లక్ష్యాల సాధన, దేశ చరిత్రను పూర్తిగా కనుమరుగు చేస్తున్నారు. అంతేకాకుండా ఈ కాలంలో పాలకుల వైఫల్యాలకు సంబంధించిన ప్రపంచీకరణ విధానాలు, లింగ వివక్ష, పెద్ద నోట్ల రద్దు, జిఎస్‌టి వంటివి తొలగించారు.

నేడు తొలగిస్తున్న పాఠ్యాంశాలు ...

ఎన్ఇపి అమలు నేపథ్యంలో ఎన్‌సిఇఆర్‌టి రూపొందించిన కొత్త పుస్తకాలలో మహాత్మా గాంధీకి సంబంధించిన పలు పాఠ్యాంశాలను తొలగించారు. ప్రధానంగా తొలగించిన అంశాలివి. 1. థీమ్స్ ఆఫ్ ఇండియన్ హిస్టరీ పార్ట్-2 (16వ, 17వ శతాబ్దాలకు సంబంధించినది) 2. పదకొండవ తరగతిలో సెంట్రల్ ఇస్లామిక్ ల్యాండ్స్, సంస్కృతుల ఘర్షణ 3. పన్నెండవ తరగతి పౌరశాస్త్రంలో స్వాతంత్ర్యం నుండి భారత రాజకీయాలలో ప్రసిద్ధ ఉద్యమాల వరకు 4. పన్నెండవ తరగతి పొలిటికల్ సైన్స్ పాఠ్యపుస్తకం నుంచి గాంధీజీ హత్యానంతరం ఆర్‌ఎస్‌ఎస్ పై విధించిన నిషేధానికి సంబంధించిన కొన్ని పేరాలనూ, అలాగే హిందూ-ముస్లిం ఐక్యతకు గాంధీ చేపట్టిన కృషికి సంబంధించిన కొన్ని పేరాలను కూడా తొలగించారు. 5. గతేడాది కర్ణాటక పాఠ్యపుస్తకాలతో ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు భగత్‌సింగ్ పాఠ్యాంశాన్ని తొలగించారు. 6. సంఘసంస్కర్తలు పెరియార్, నారాయణ గురు, బసవడు వంటి ప్రముఖుల పాఠాలను తొలగించారు. 7. పాఠ్యాంశాలే కాదు. సిబిఎస్ఇ సిలబస్‌కు సంబంధించిన ప్రశ్నాపత్రాలలో 'గుజరాత్‌లో ముస్లింలపై దాడులు ఎవరు చేశారు?' వంటి ప్రశ్నలు దేనికి సంకేతాలు?

జాతీయోద్యమ స్ఫూర్తి అవసరం లేదా?

జాతీయోద్యమ కాలంలో లౌకిక, ప్రజాస్వామ్యం, సార్వత్రిక విద్యకు డిమాండ్ పెరిగింది. కులమతాలకు అతీతంగా జాతిని ఐక్యం చేసే విద్యను కోరుకున్నారు. సామాజిక దురాచారాలకు వ్యతిరేకంగా సంఘ సంస్కరణల ఉద్యమాలు ప్రారంభం అయ్యాయి. ఈ ఉద్యమాలు సామాజిక మార్పులకు దారితీశాయి. ఈ క్రమంలో ప్రగతిశీల శక్తులు, సంఘాలు, వ్యక్తులు, సంస్కర్తలు ఏకమై బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఐక్యంగా పోరాడిన మన దేశ చరిత్ర మన బాలలకు, భావి పౌరులకు అవసరం లేదా?

ప్రాణాలకు వెరవకుండా భగత్‌సింగ్ చేసిన అద్భుతమైన పోరాటం, త్యాగం దేశ ప్రజలను కదిలించింది. క్విట్ ఇండియా, సహాయ నిరాకరణ ఉద్యమం వంటివి లక్షోపలక్షలుగా యువతను, లాయర్లను, ప్రజలను, విద్యార్థులను జాతీయోద్యమం లోకి ఆకర్షించాయి. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత దేశవిభజనకు కుట్ర పన్నిన ఆర్‌ఎస్‌ఎస్ లాంటి మత సంస్థల చర్యలను అంగీకరించని గాంధీజీ మత సామరస్యం కోసం హిందూ-ముస్లిం భాయిభాయి అంటూ విస్తృతంగా పర్యటించాడు. ఇవి నచ్చని హిందూత్వ శక్తులకు ప్రతినిధి అయిన గాడ్సే...మహాత్ముడిని హత్య చేశాడు.

మత రాజ్యం కోసం అవసరమైన ప్రయత్నాలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వం విద్య కాషాయీకరణలో భాగంగా ఉద్దేశ పూర్వకంగానే ఎన్ఇపి ద్వారా గాంధీజీకి సంబంధించిన చరిత్ర ఘట్టాలను తొలగిస్తున్నది. ఎన్ఇపి అమలు కాకముందు పరిస్థితికి, అమలవుతున్న తరువాత పరిస్థితికి స్పష్టమైన తేడా కనిపిస్తుంది.

ప్రమాదంలో దేశం, రాజ్యాంగం

నేడు కేంద్రం లోని పాలకుల విధానాలకు అనుగుణంగా ప్రజలందరికీ ఒకే భావజాలాన్ని గరిపే ప్రయత్నంలో భాగంగా ఎన్ఇపి లో కొన్నిటిని చొప్పించారు. విద్య చోదకశక్తి గనుక తొలుత విద్యారంగాన్ని ప్రభావితం చేసే అనేక చర్యలు చేపట్టారు. విభిన్న జాతులు, మతాలు, కులాలు, సంస్కృతులు గల ప్రజల ప్రయోజనాలను కాపాడే మన రాజ్యాంగానికి భిన్నంగా చర్యలు మొదలు పెట్టారు. ప్రధానంగా యూనివర్సిటీలలో మత సంస్థల జోక్యం పెరిగింది. ఎన్‌సిఇఆర్‌టి, ఎస్‌సిఇఆర్‌టి డైరక్టర్లను తొలగించారు. వారిస్థానంలో పాంచజన్య పత్రిక ఎడిటర్లను నియమించారు. భారతీయ పరిశోధన సంస్థ అధ్యక్షులుగా ఆర్‌ఎస్‌ఎస్ అధినేతలను నియమించారు. జెఎన్‌యు, బెనారస్, జైపూర్ యూనివర్సిటీలలో మత సంస్థలు అల్లర్లు సృష్టించాయి. ఈ విధంగా చూస్తే ఏక పరీక్షా విధానం, ఏక సిలబస్, సిబిఎస్‌ఎఫ్ సిలబస్‌లో చరిత్ర వక్రీకరణలు, సెమిస్టర్ విధానం, నేషనల్ కరికులమ్ ఫ్రేమ్ వర్క్‌లో మార్పులు వంటి వాటితో భారత విద్యారంగం ప్రమాదకరమైన పరిస్థితిలో పడింది.

మేధోపరమైన స్వేచ్ఛ, శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడం ద్వారా ఈ సమాజంలో ఉన్న సామాజిక అసమానతలను తొలగించేటందుకు విద్యా వ్యవస్థ దోహదపడాలి. తద్వారా రాజ్యాంగ విలువలైన ప్రజాస్వామ్యం, లౌకికవాదం, సాంస్కృతిక భాషా వైవిధ్యం, సమానత్వాలను వ్యాపింప చేసేలా మన విద్యా వ్యవస్థ ఉండాలి. ఇటువంటి లక్ష్యాలను చేరుకోడానికి దోహదపడే అంశాలు ఎన్ఇపి లో ఎక్కడా లేవు. కనుక ఎన్ఇపి వ్యతిరేక పోరాటంలో లౌకిక, ప్రజాస్వామిక శక్తుల జోక్యం పెరగాలి.

/ వ్యాసకర్త యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు,
సెల్ నెం.8985383255 /

UNIMONI FINANCIAL SERVICES LIMITED
RO: N.G. 12 & 13 Ground Floor, North Block, Manipal Centre, Dickenson Road, Bangalore - 560 042. CIN No.U85110KA1995PLC018175

బహిరంగ ప్రకటన

యూనిమని ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్‌చే తనఖా పెట్టినబంగారు ఆభరణాలవేలం **24.04.2023, 10.00 AM** వద్ద No. 3-6-2-/1, Ground Floor Grandpas Royal Mansion, Liberty Jn., Himayatnagar, Hyderabad - 500029. ఎద్ద జరుగుతుందనిఇందుమూలంగా ప్రజలకు తెలియచేయబడుతోంది. వేలం వేయబడేబంగారు ఆభరణాలు తమ బకాయిలుచెల్లించడంలో విఫలమైన వివిధ కస్టమర్ల ఋణ ఖాతాలకు చెందినవి. మా వేలంపాట నోటీసులు ఈ ఋణగ్రహీతలకు కూడా జారీచేయబడ్డాయి. వివిధ కస్టమర్ల వేలం వేయబడేబంగారు ఆభరణాలకు చెందిన గడువు తీరిన ఋణ ఖాతా బ్రాంచ్ పేరుతోక్రింద ఇవ్వబడింది.

Loan Nos: GUNTUR (GNR) -1976739, 1982141

For more details, please contact : **Mr. PRAVEEN NAIK - 9346463522**

(Reserves the right to alter the number of accounts to be auctioned &/ postpone / cancel the auction without any prior notice.)

కెనడాలో కార్మిక సంక్షోభం!!

టొరంటో : ప్రపంచంలో ఎక్కువ దేశాలు ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న నేపథ్యంలో కెనడాలో కొత్తగా కార్మిక సంక్షోభం తలెత్తినట్లు తాజా నివేదికలు వెల్లడించాయి. కార్మిక సంక్షోభం వల్ల వ్యవసాయరంగం మరింత కుదేలవుతుందని పరిశోధకులు ఆందోళన వ్యక్తం చేశారు. రాయల్ బ్యాంక్ ఆఫ్ కెనడా పరిశోధనలో వచ్చే పదేళ్ల కాలంలో దాదాపు 40 శాతం మంది వ్యవసాయానికి దూరం కానున్నారని.. వయసుపైబడడంతో వారు సాగుకు దూరమవుతున్నారని తేల్చింది. ఇక అదే సమయంలో రాబోయే దశాబ్ద కాలంలో వ్యవసాయ కార్మికులతో పాటు నర్సరీ, గ్రీన్‌హౌస్ కార్మికులు, సాధారణ కూలీలు దాదాపు 24 వేల మంది కొరత ఏర్పడుతుందని ఈ పరిశోధన వెల్లడించింది. ప్రస్తుతం కెనడాలో 60 శాతం మంది 65 ఏళ్లు పైబడినవారే. దీంతో భవిష్యత్తులో వారు పనికి దూరం కానున్నారని పరిశోధన తెలిపింది. వయసు పైబడిన వారి తర్వాత వారసత్వంగా.. వ్యవసాయం చేయడానికి అక్కడున్నవారు వ్యవసాయాన్ని కొనసాగించడానికి 66 శాతం మంది ఇష్టపడకపోవడమే కార్మిక సంక్షోభానికి మరొక కారణమని పరిశోధన పేర్కొంది. వచ్చే దశాబ్దకాలంలో కెనడాలో 30 వేల మంది వలస కార్మికులు అవసరమౌతారని పరిశోధనలో వెల్లడైంది. అందుకే కార్మిక సంక్షోభాన్ని కొంతమేరకైనా తీర్చుకోవడానికి కెనడా ప్రయత్నిస్తోంది. తాత్కాలిక విదేశీ వలస కార్మికులకు వరాలు కురిపిస్తోంది. అక్కడే శాశ్వత నివాసం ఏర్పరచుకునేందుకు తగిన సౌకర్యాలను కెనడా ప్రభుత్వం అందించేందుకు ప్రయత్నిస్తోంది. అయితే విదేశీయులకు శాశ్వత స్థానాన్ని కల్పించడం వల్ల కార్మిక సంక్షోభం నుంచి బయటపడలేమని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

మండుతున్న ఎండలు : భారీగా నమోదవుతున్న ఉష్ణోగ్రతలు

న్యూఢిల్లీ : మే నెల రాకముందే ఈ ఏడాదిలో ఎండలు మండుతున్నాయి. దేశవ్యాప్తంగా కొన్ని ప్రాంతాల్లో వడగాల్పులు వీస్తున్నాయి. ఎండ వేడిమిని తట్టుకోలేక ప్రతి ఏడాది జనం పిట్టల్లా రాలిపోతున్నారు. ప్రపంచవ్యాప్తంగా అధిక ఉష్ణోగ్రతలకు అత్యధిక మంది మృతి చెందుతున్న దేశాల జాబితాలో భారత్ నిలుస్తోంది. మన దేశంలో సుమారు 1.4 బిలియన్ల మంది జనాభా బయటే పనిచేస్తారు. దీంతో వారికి ఎలాంటి రక్షణ లేకపోవడంతో ప్రతి సంవత్సరం ఎక్కువ సంఖ్యలో భవన నిర్మాణ కార్మికులు, కూలీలు, రిక్షా పుల్లర్లు మృతి చెందుతున్నారు. సోమవారం ఒడిశాలోని బరిపాడలో 44 డిగ్రీల కంటే ఎక్కువ ఉష్ణోగ్రత నమోదైనట్లు భారత వాతావరణ విభాగం (ఐఎండి) వెల్లడించింది. దేశవ్యాప్తంగా చాలా ప్రాంతాల్లో సాధారణ ఉష్ణోగ్రత కంటే 5 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని ఐఎండి తెలిపింది. దీంతో హర్యానా, ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్, బీహార్, ఒడిశాతో సహా పలు ప్రాంతాలకు ఐఎండి హెచ్చరికలు జారీ చేసింది.

కాగా, గత ఆదివారం నవీ ముంబయిలో జరిగిన భూషణ్ అవార్డుల ప్రదానోత్స కార్యక్రమంలో వడదెబ్బ వల్ల 13 మంది మృతి చెందిన సంగతి తెలిసిందే. ముఖ్యంగా వేసవిలో ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలని. తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణశాఖ ప్రజలకు సూచించింది. వేసవిలో బయటకు రావాలనుకునేవారు తప్పనిసరిగా కాటన్ దుస్తులను ధరించాలని, వడదెబ్బ తగలకుండా తలను కవర్ చేసేలా కప్పుకోవాలని ఐఎండి సూచించింది. ముఖ్యంగా విద్యార్థులకు వడదెబ్బ తగలకుండా.. పాఠశాలలను మూసివేయాలని ఐఎండి రాష్ట్రాలను కోరింది. ఇప్పటికే పశ్చిమబెంగాల్‌లో పాఠశాలలకు సెలవులిచ్చారు. ఇక మిగతా అన్ని రాష్ట్రాలు పాఠశాల సమయాలను కుదించిన సంగతి తెలిసిందే.

నైజీరియాలో కలరా విజృంభణ

ఈ ఏడాదిలో 79 మంది మృతి

అబూజ : నైజీరియాలో ఈ ఏడాదిలో కలరా వ్యాధికి గురై 79 మంది మృతి చెందినట్లు తాజాగా నైజీరియా సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ (ఎన్‌సిడిసి) నివేదిక వెల్లడించింది. దేశంలో అబియా, బౌచి, బయోల్సా, క్రాస్ రివర్, ఎబోనీ, కానో, కాట్సినా, నైజర్, ఒండో, ఒసున్, సోకోటో, జంఫారా వంటి రాష్ట్రాలు కలరా వ్యాధికి తీవ్రంగా ప్రభావితమైనట్లు ఎన్‌సిడిసి నివేదిక పేర్కొంది. ఇక ఈ సంవత్సరం ప్రారంభం నుండి 12 నైజర్ రాష్ట్రాల్లో 43 ప్రాంతాల్లో ఈ వ్యాధి వ్యాప్తి ఎక్కువగా వ్యాపించిందని నివేదిక తెలిపింది. దీంతో ఈ ఏడాది నుంచి ఇప్పటివరకు అక్కడ 1336 కలరా అనుమానిత కేసులను గుర్తించినట్లు ఎన్‌సిడిసి పేర్కొంది. ప్రస్తుతం కలరా వ్యాప్తిని అంచనా వేయడానికి మల్టీ సెక్టోరల్ టెక్నికల్ గ్రూప్.. రాష్ట్రాలతో సమన్వయం చేస్తూ... కలరా కేసులను పర్యవేక్షిస్తోంది.

కాగా, నీటికోసం అక్కడ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సౌత్ ఈస్ట్ నైజీరియాలోని ఎనుగు రాష్ట్రానికి చెందిన ఎమెకా ఓడో మాట్లాడుతూ.. 'నేను నీటి కోసం రోజూ 15 కిలోమీటర్లు దూరం వెళ్లాల్సి వస్తోంది. తీవ్రమైన నీటికొరతే కలరా వ్యాప్తికి కారణమవుతోంది' అని ఆయన అన్నారు. నైజీరియాలో ప్రతి ఏడాది కలరా వ్యాప్తి పెరిగి.. కేసులు సంఖ్య విపరీతంగా పెరుగుతుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుటిఓ) హెచ్చరించింది. బ్యాక్టీరియం విబ్రియో కలరా వల్ల తీవ్రమైన డయేరియా ఇన్ఫెక్షన్‌కు గురిచేస్తోందని... దీన్ని నివారించడానికి తప్పనిసరిగా సురక్షితమైన తాగునీటిని తాగాలని ఎన్‌సిడిసి ప్రజలకు పిలుపునిచ్చింది.

రష్యా విదేశాంగ మంత్రి వెనిజులా పర్యటన

కారకాస్ : ద్వైపాక్షిక సంబంధాల ఒప్పందాలను సమీక్షించేందుకు రష్యా విదేశాంగమంత్రి సెర్గీ లావ్‌రోవ్ మంగళవారం వియత్నాం పర్యటనకు వెళ్లారు. ఈ సందర్భంగా వియత్నాం అధ్యక్షుడు నికోలస్ మదురో, సెర్గీ లావ్‌రోవ్‌లు ఇద్దరూ ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలపై సమీక్షించారు. ఈ సమీక్షా సమావేశంలో ఆర్థిక విషయాలు, వ్యవసాయం, ఇంధనం, ఇతర రంగాలతో సహా అనేక రంగాలపె వీరిద్దరూ చర్చింకున్నట్లు మీడియా వర్గాలు పేర్కొన్నాయి. ఈ సమావేశంలో ఇరు దేశాల అగ్ర దౌత్యవేత్తలతోపాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అనంతరం లావ్‌రోవ్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ 'వెనిజులాకు పూర్తిగా మద్దతు ఇస్తున్నాము. అమెరికా ఒత్తిళ్లను నుండి వెనిజులా స్వతంత్ర ఆర్థిక వ్యవస్థగా మారడానికి మేము ఏవిధమైన మద్దతు ఇచ్చేందుకయినా సిద్ధంగా ఉన్నాం' అని అన్నారు.

ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్ — IDFC FIRST Bank
(గతంలో క్యాపిటల్ ఫస్ట్ లిమిటెడ్)
2.	వై బి ఎమ్ ఫ్రూట్ మార్కెట్, ప్రొప్రైటర్ ద్వారా ప్రాతినిధ్యం, సయ్యద్ నసీరుద్దీన్/సయ్యద్ నసీరుద్దీన్/సయ్యద్ మహబూబ్ భాను/నం.11/348, మిట్టగూడెం జగ్గయ్యపేట గ్రామం మండలం, కృష్ణా జిల్లా, విజయవాడ-521175/ 179705003378/179755000001	ఎ.పి., కృష్ణాజిల్లా, జగ్గయ్యపేట సబ్ రిజిస్ట్రీ అధికార పరిధిలో జగ్గయ్యపేట మండలం, షేర్ మహమూద్ పేట గ్రామ పంచాయతీ,ఆర్.ఎస్.నం.114 లో ఉన్న బేరింగ్ ఫ్లాట్ నం.114 తో విస్తీర్ణం 246.0 చ.గ.లు. మరియు ప్రస్తుతం మహబూబ్ భాను, భర్త. సయ్యద్ నసీరుద్దీన్ స్వాధీనం కింద ఉన్న హద్దులు డాక్యుమెంట్ నం.3719/2011 సరిహద్దులు: తూర్పు: ఫ్లాట్ నం.4 యొక్క సైట్ తో బేరింగ్ మోర్ జగన్ మోహనరావు 91.3 ఇంచులు., దక్షిణం: కెనాల్ కొంత మేరకు మరియు మోర్ జగన్ మోహనరావు యొక్క స్థలం 33 ఇంచులు., పడమర: ఫ్లాట్ నం.2 యొక్క సైట్ తో బేరింగ్ మోర్ జగన్ మోహనరావు 89.9 ఇంచులు., ఉత్తరం: ఎన్ హెచ్ 9 బైపాస్ రోడ్డు 33 ఇంచులు.	16/03/2023 Rs. 23,73,667/-	20/11/2022

నోటీసు సర్వీసు ప్రత్యమ్నాయం కొరకు ముందడగు వేయడమైనది. పై రుణగ్రహీత/లు మరియు వారి హామీదారులు (వర్తించబడతారు) ఈ నోటీసు ప్రచురించిన తేది నుండి 60 రోజులలోపల బకాయిలు చెల్లించవలసిందిగా కోరుతున్నాము లేనియెడల సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 ప్రకారం తదుపరిగా ముందడగు వేయడంం జరుగుతుంది.

తేది: 20 ఏప్రిల్, 2023
ప్రదేశం: గుంటూరు మరియు కృష్ణ
అధీకృత అధికారి
ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్

అన్నింటా బిజెపి ప్రభుత్వం వైఫల్యం

- కేంద్రీకరణ నుంచి రాష్ట్రాన్ని కాపాడలేకపోయింది
- సమాఖ్య స్ఫూర్తిని నీరుగార్చింది
- బహుత్వ కర్ణాటక ఫోరం విమర్శలు

నివేదిక విడుదల చేస్తున్న బహుత్వ కర్ణాటక ఫోరం సభ్యులు

బెంగళూరు : కర్ణాటకలోని బిజెపి ప్రభుత్వం దాదాపు అన్ని రంగాల్లోనూ ఘోరంగా విఫలమైందని 'బహుత్వ కర్ణాటక' అనే సంస్థ ఒక నివేదిక విడుదల చేసింది. ప్రధానంగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న కేంద్రీకృత విధానాలకు పూర్తిగా లొంగిపోయిందని, రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను కాపాడటంలో విఫలమైందని విమర్శించింది. కర్ణాటక బిజెపి ప్రభుత్వ పనితీరుపై ఈ ఫోరం వరుసగా రిపోర్టు కార్డులను విడుదల చేస్తోంది. ఈ క్రమంలో 'సమాఖ్య స్ఫూర్తి'ని కాపాడుకోవడంలో బిజెపి ప్రభుత్వం విఫలమైన తీరును ఎండగడుతూ బుధవారం నాడు మరో నివేదిక విడుదల చేసింది. కేంద్రీకరణ ప్రమాదాల నుంచి కర్ణాటక ప్రజలను కాపాడాలనే రాజ్యాంగ విధులను నిర్వహించడంలో రాష్ట్రంలోని బిజెపి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని అందులో పేర్కొన్నారు. భారతదేశాన్ని మన రాజ్యాంగం 'రాష్ట్రాల యూనియన్'గా పేర్కొంది. న్యూఢిల్లీ కీలుబొమ్మల్లో ఒకటిగా మారిపోయిన ఇక్కడి ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం ఆడించినట్లు ఆడిందే మినహా ఇక్కడి ప్రజలకు జవాబుదారీగా లేకుండా పోయిందని 'బహుత్వ కర్ణాటక' విమర్శించింది. నివేదిక విడుదల సందర్భంగా ఫోరం కన్వీనర్ వినయ్ శ్రీనివాస మీడియాతో మాట్లాడుతూ 'కర్ణాటక ఆర్థిక ప్రగతిని, వనరులు దోపిడికి గురౌతున్నాయి. హిందీని బలవంతంగా రుద్దుతున్నందున విలక్షణమైన మన రాష్ట్ర సంస్కృతీ దెబ్బతింటోంది. ఇక్కడి రాష్ట్ర ప్రభుత్వం తన నిర్ణయాధికారాలను ఢిల్లీకి సమర్పించేసుకుంది. దీంతో ఢిల్లీ చేతిలో కీలుబొమ్మలా మారి..రాష్ట్ర ప్రజానీకానికి సమాధానం చెప్పుకోలేని స్థితిలోకి కూరుకుపోయింది' అని విమర్శించారు. 2019-2023 మధ్య కాలానికి రాష్ట్ర ప్రభుత్వ పనితీరుపై ఈ ఫోరం విశ్లేషణాత్మక నివేదికలు విడుదల చేసింది.

తగ్గిన నిధులు

కేంద్ర పన్నులు, జిఎస్‌టిలో రాష్ట్రానికి రావాల్సిన వాటా, అలాగే కేంద్ర ప్రాయోజిత పథకాలకు రావాల్సిన నిధులుగా భారీగా తగ్గిపోయాయని శ్రీనివాస చెప్పారు. 14వ ఫైనాన్స్ కమిషన్ కింద 2015-2020లో రాష్ట్ర వాటా 4.71 శాతంగా ఉండగా ప్రస్తుతం 15వ ఫైనాన్స్ కమిషన్ కింద 2021-26 కాలానికి 3.64 శాతానికి కుదించారని పేర్కొన్నారు. అంటే గతంలో ప్రతి వంద రూపాయల పన్ను ఆదాయానికి గాను కర్ణాటక గతంలో రూ.53 తిరిగి వస్తుండగా ఇప్పుడు రూ.40కు పడిపోయిందని ఆయన విశ్లేశించారు. దీంతో పాటు 2021లో కర్ణాటకను వరదలు ముంచెత్తినా కేంద్రం నుంచి సాయాన్ని రాబట్టడంలోనూ రాష్ట్రంలోని బిజెపి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. ఎప్పుడో మూడు నెలల తర్వాత నామమాత్రపు సాయాన్ని విధిలిస్తే దాంతోనే ఇక్కడి ప్రభుత్వం సరిపెట్టుకుందన్నారు.

హిందీ రుద్దేస్తున్నారు..!

కేంద్ర ప్రభుత్వ నియామకాలకు సంబంధించిన పరీక్షలను కన్నడలోనూ నిర్వహించాలన్న కన్నడ ప్రజల విజ్ఞప్తిని కేంద్రం పెడచెవిన పెట్టినా రాష్ట్ర ప్రభుత్వం మిన్నుకుండిపోయిందన్నారు. కన్నడ భాషాభిమానులు ఎంతగా వ్యతిరేకించినా కూడా ఢిల్లీ పెద్దల మెప్పు కోసం 'హిందీ దినోత్సవాన్ని' ఘనంగా నిర్వహించారని 'బహుత్వ కర్ణాటక' ఫోరం తన నివేదికలో విమర్శించింది. కేంద్ర ప్రభుత్వ కార్యాక్రమాలు, పథకాలకు అన్నింటికి హిందీనే వాడుతున్నారని, దీనివల్ల కన్నడ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఫోరం పేర్కొంది. మరోవైపు భాగస్వామ్య రాష్ట్రాలు అన్నీ కూడా బిజెపి పాలిత రాష్ట్రాలే అయినా కూడా 'మహదాయి' జలాల వాటా వివాదాన్ని పరిష్కరించడంలోనూ రాష్ట్రంలోని బిజెపి ప్రభుత్వం విఫలమైందన్నారు.

డబుల్ ఇంజన్..సమాఖ్య స్ఫూర్తికి వ్యతిరేకం

బిజెపి నాయకులు పదేపదే డబుల్ ఇంజిన్ అంటుంటారని, వాస్తవానికి డబుల్ ఇంజిన్ సర్కార్ అనే విధానమే సమాఖ్య స్ఫూర్తికి వ్యతిరేకమైనదని 'బహుత్వ కర్ణాటక' ఆక్షేపించింది. రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా కేంద్ర ప్రభుత్వపు రిమోట్ కంట్రోల్‌గా మారిపోయిందని ఫోరం కన్వీనర్ శ్రీనివాస విమర్శించారు. శక్తివంతమైన బిజెపి నాయకులు చెప్పుకునే బిఎస్ ఎడ్యూరప్ప లాంటి వ్యక్తిని ముఖ్యమంత్రి పదవి నుంచి కారణమేదీ లేకుండానే దింపేశారని ఆయన గుర్తు చేశారు. ఆయన స్థానంలో సిఎంగా కూర్చోబెట్టిన బసవరాజ్ బొమ్మై పూర్తిస్థాయి కేబినెట్ మంత్రులు లేకుండానే కొన్ని నెలల పాటు ప్రభుత్వాన్ని నడిపారంటే కేంద్రం చేతిలో రాష్ట్రం ఎంతటి కీలుబొమ్మలా మారిందో అర్థం చేసుకోవచ్చున్నారు.

చిన్నచితకా పథకాలూ మోడీ చేతుల మీదుగానే..

రాష్ట్రంలో ఏ చిన్నపాటి అభివృద్ధి కార్యక్రమం చేపట్టినా..'హక్కు పత్రాల పంపిణి' వంటి ప్రతిదానికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీని వచ్చేదాకా వేచిచూడటం, ఆయనతోనే ప్రారంభం చేయించడం వల్ల ఖజానాపై అదనపు భారం పడిందని, ప్రారంభించిన పథకాల వల్ల లబ్దిదారులకు కలిగే ప్రయోజనాల కంటే కేంద్ర ప్రభుత్వ పెద్దల రాకతో ఏర్పాట్లకయ్యే ఖర్చే ఎక్కువగా ఉంటోందని ఆయన ఎద్దేవా చేశారు. ఇదంతా కేంద్రంలో బిజెపి ప్రభుత్వానికి, ప్రధాని మోడీకి ప్రచార కార్యక్రమాలుగా మారాయే తప్ప లబ్దిదారులకు మేలు కలిగించేలా లేవని పేర్కొన్నారు. బృహత్ బెంగళూరు మహానగర పాలిక (బిబిఎంపి) ఎన్నికలు నిర్వహించడంలోనూ, పంచాయితీ ఎన్నికలు నిర్వహించడంలోనూ మూడేళ్లుగా రాష్ట్రంలోని బిజెపి ప్రభుత్వం విఫలమైందని, ఇందుకు కర్ణాటక హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి జరిమానా కూడా విధించిందని, రాష్ట్రంపై కేంద్రం పెత్తనం పెరిగిపోయిందనేందుకు ఇది మరో ఉదాహరణ అని శ్రీనివాస పేర్కొన్నారు. రాష్ట్ర జాబితాలో ఉన్న విద్యుత్ విషయంలోనూ స్వతహాగా నిర్ణయాలు తీసుకోవడంలో ప్రభుత్వం విఫలమైందనీ, ఈ విషయంలో కూడా కేంద్రం ఆడించినట్లే ఆడుతోందని విమర్శించారు. కర్ణాటకలో పాల మార్కెట్‌ను నిలువెల్లా దోచుకునేందుకు గుజరాత్‌కు చెందిన అమూల్ సంస్థ కేంద్ర హోంమంత్రి అమిత్ షా ద్వారా ప్రయత్నాలు చేయగా ఇక్కడి ప్రభుత్వం ఏమాత్రం వ్యతిరేకించలేకపోయిందని, రాష్ట్ర ప్రజల జీవనంలో మమేకమైన నందిని సహకార సంస్థను ప్రజలే కాపాడుకోగలిగారని ఆయన చెప్పారు. సమాఖ్య వ్యవస్థను పరిరక్షించుకోవాలంటే కేంద్రానికి సాగిలపడిపోయి వారి చేతుల్లో కీలుబొమ్మల్లా పనిచేసే పార్టీలను ఈ ఎన్నికల్లో తిప్పికొట్టాల్సిన అవసరం ఉందని రాజకీయ విశ్లేషకులు కోరుతున్నారు.

కలబర్గిలో సిపిఎం అభ్యర్థి నామినేషన్

బెంగళూరు : కలబర్గి (గ్రామీణం) అసెంబ్లీ నియోజకవర్గం నుంచి సిపిఎం అభ్యర్థిగా ఎన్నికల్లో పోటీ చేస్తున్న పాండురంగ్ మావింకర్ బుధవారం తన నామినేషన్ వేశారు. అనంతరం కలబురగిలో భారీ బహిరంగ సభను నిర్వహించారు. ఈ సభలో సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు అశోక్ ధవాలే, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, కలబురగి జిల్లా కార్యదర్శి కె నీలా, పార్టీ నాయుకులు చెన్నప్ప అనేగుడి, శ్రీమంత్ బిరందర్ ఇతర నాయకులు పాల్గొన్నారు. ఈ సభలో వ్యక్తలంతా రాష్ట్ర, కేంద్రాల్లో బిజెపి ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల, అవినీతి, మతతత్వ విధానాలను తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ స్థానం నుంచి సిపిఎం అభ్యర్థిని గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



బిజెపి స్టార్ క్యాంపెయినర్లుగా మోడీ, అమిత్ షా, యోగి, స్మృతి ఇరానీ

బెంగళూరు: కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి బిజెపి తన స్టార్ క్యాంపెనర్స్ జాబితాను విడుదలు చేసింది. 40 మందితో కూడిన ఈ జాబితాలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్రమంత్రి అమిత్ షా, కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ, పార్టీ జాతీయ అధ్యక్షుడు జెపి నడ్డా, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, రాజ్‌నాథ్ సింగ్, నితిన్ గడ్కారీలతో పాటు మధ్య ప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహన్, అస్సాం ముఖ్యమంత్రి హేమంత్ బిస్వా శర్మ తదితరులు ఉన్నారు. ఈ జాబితాకు సంబంధించిన లేఖను కేంద్ర ఎన్నికల కమిషన్‌కు బిజెపి అందచేసింది. వీరితో భారీస్థాయిలో ర్యాలీలు, రోడ్‌షోలు, సమావేశాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. కాగా, రాష్ట్రంలో నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కావడంతో పలువురు నాయకులు బుధవారం నామినేషన్లు వేశారు. ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై, మాజీ ముఖ్యమంత్రి, రెండు రోజుల క్రితం కాంగ్రెస్‌లో చేరిన జగదీశ్ షెట్టర్ బుధవారం నామినేషన్ వారిలో ఉన్నారు. బొమ్మై.. హవేరీ జిల్లాలోని షిగ్గావ్ నియోజకవర్గం నుంచి ఎన్నికల బరిలో ఉన్నారు. బుధవారం నామినేషన్ వేశారు. ఆ సమయంలో ఆయన వెంట జేపీ నడ్డా, కన్నడ స్టార్ హీరో సుదీప్ ఉన్నారు. మరోపక్క మాజీ ముఖ్యమంత్రి యడియూరప్ప కుమారుడు విజయేంద్ర శికారీపుర నుంచి నామినేషన్ వేశారు. మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య బుధవారం నామినేషన్ వేశారు.

అతిక్ హత్య నలుగురు పోలీసులపై వేటు

ప్రయాగ్‌రాజ్: ఉత్తరప్రదేశ్‌లో పోలీసుల సమక్షంలోనే గ్యాంగ్‌స్టర్, మాజీ ఎంపి అతిక్ అహ్మద్, అతని సోదరుడు అష్రాఫ్‌ను ముగ్గురు వ్యక్తులు కాల్చిచంపిన విషయం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ ఘటన చోటుచేసుకోకుండా నిరోధించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారని పేర్కొంటూ నలుగురు పోలీసులపై ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం సస్పెన్షన్ వేటు వేసింది.

పాలస్తీనా సమస్యపై మధ్యవర్తిత్వానికి సిద్ధం: చైనా

బీజింగ్ : అరబ్ ప్రపంచంలో ఉత్తర, దక్షిణ ధ్రువాలుగా ఉన్న సౌదీ, అరేబియా మధ్య సయోధ్య కుదర్చడంలో సఫలమైన చైనా, తాజాగా పాలస్తీనా సమస్యకు పరిష్కారం చూపడంలో మధ్యవర్తిత్వం వహించేందుకు సిద్ధంగా ఉన్నానని చెప్పింది. చైనా విదేశాంగ మంత్రి కిన్ గాంగ్ సోమవారం ఇజ్రాయిలీ, పాలస్తీనా విదేశాంగ మంత్రులతో విడివిడిగా ఫోన్‌లో మాట్లాడుతూ దశాబ్దం తరువాత రెండు దేశాల మధ్య శాంతి చర్చలను పునరుద్ధరించేలా చూసేందుకు చైనా తన వంతు తోడ్పాటునందించేందుకు సిద్ధంగా ఉందని చెప్పారు. ఈ విషయమై చైనా విదేశాంగ శాఖ అదే రోజు ఒక ప్రకటనను విడుదలజేసింది. ఇజ్రాయిల్, పాలస్తీనియన్ల మధ్య ఉద్రిక్తతలు పెరుగుతుండడం పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సౌదీ, ఇరాన్ మధ్య 2016లో తెగిపోయిన సంబంధాలను పునరుద్ధరించడంలో చైనా గత నెలలో నిర్వహించిన మధ్యవర్తిత్వం ఫలించింది. దీంతో ఇరాన్, సౌదీ అరేబియాల మధ్య సంబంధాలు పునరుద్ధరించబడడమే కాదు, ఈ రెండు దేశాలతో ముడిపడి వున్న యెమెన్ యుద్ధానికి కూడా తెర దించి, శాంతిని నెలకొల్పేందుకు అవకాశాలు మెరుగయ్యాయి. అదే సమయంలో అరబ్ ప్రపంచంపై అమెరికా ఆధిపత్యానికి కూడా బ్రేక్ పడినట్లైంది. ఇప్పుడు పాలస్తీనియన్లకు, ఇజ్రాయిలీయులకు మధ్య శాంతి చర్చలు ఫలించి, పాలస్తీనా సమస్య పరిష్కారమైతే యావత్ పశ్చిమాసియాలో అమెరికా పెత్తనానికి నూకలు చెల్లినట్టేనని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

సాయిబాబా కేసును మరోసారి విచారించాలి

- మరో ధర్మాసనంతో విచారణ
- విచారణను నాలుగు నెలల్లోగా పూర్తి చేయాలి
- నిర్దోషిగా ప్రకటించిన ముంబాయి హైకోర్టు తీర్పును పక్కన పెట్టిన సుప్రీం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ విశ్వవిద్యాలయం మాజీ ప్రొఫెసర్ జిఎన్ సాయిబాబాకు బుధవారం సుప్రీంకోర్టులో భారీ షాక్ తగిలింది. మావోయిస్టులతో సంబంధాలున్నాయనే ఆరోపణలతో నమోదైన కేసులో సాయిబాబాని నిర్దోషిగా ప్రకటిస్తూ ముంబాయి హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు రద్దు చేసింది. ఈ కేసును తాజాగా మళ్లీ విచారణ జరపాలని, విచారణను నాలుగు నెలల్లోగా పూర్తి చేయాలని తీర్పు ఇచ్చింది. ముంబాయి హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో ఎన్ఐఎ దాఖలు చేసిన పిటిషన్ ను బుధవారం న్యాయమూర్తులు జస్టిస్ ఎంఆర్ షా, జస్టిస్ సిటి రవి కుమార్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. మహారాష్ట్ర ప్రభుత్వం తరుపున అడిషనల్ సొలిసిటర్ జనరల్ ఎస్ వి రాజు, నిందితుల తరపున సీనియర్ న్యాయవాదులు ఆర్. బసంత్, నిత్య రామకృష్ణన్, న్యాయవాది షాదన్ ఫరాసత్ వాదనలు వినిపించారు. మావోయిస్టులతో సంబంధాలున్నాయని నిర్ధరిస్తూ క్రింది కోర్టు సాయిబాబాకు యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. ముంబాయి హైకోర్టు ఆయనను నిర్దోషిగా తీర్పు చెప్పి, ఆయనకు క్రింది కోర్టు విధించిన శిక్షను రద్దు చేసింది. హైకోర్టు తీర్పును జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) సుప్రీంకోర్టులో సవాల్ చేసింది.

హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టు కొట్టివేస్తూ నాలుగు నెలల్లో మెరిట్స్ ఆధారంగా మళ్లీ సాయిబాబా కేసును విచారించాలని హైకోర్టును ఆదేశించింది. గతంలో నిర్దోషిగా ప్రకటించిన ధర్మాసనంతో కాకుండా మరో ధర్మాసనంతో విచారణ జరిపించాలని తన ఆదేశాల్లో పేర్కొంది.

గాలి జనార్ధన్ రెడ్డికి బెయిల్ సడలింపులకు సుప్రీం నో

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కర్ణాటక మాజీ మంత్రి, కల్యాణ రాజ్య ప్రగతి పక్ష (కెఆర్పిపి) అధ్యక్షులు గాలి జనార్దన్ రెడ్డికి సుప్రీం కోర్టులో చుక్కెదురైంది. అక్రమ మైనింగ్ వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న గాలి జనార్దన్ రెడ్డి బెయిల్ షరతులను సడలించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. కర్ణాటక ఎన్నికల నేపథ్యంలో తనకు బళ్లారి వెళ్లేందుకు అవకాశం కల్పించాలని, అందుకు అనుగుణంగా తన బెయిల్ నిబంధనలను సడలించాలని సుప్రీంకోర్టును గాలి జనార్దన్ రెడ్డి ఆశ్రయించారు. అయితే జనార్ధన్ రెడ్డి విజ్ఞప్తిని జస్టిస్ ఎంఆర్ షా, జస్టిస్ సుందరేష్ ల ధర్మాసనం తోసిపుచ్చింది. బెయిల్ నిబంధనలు సడలించడం కుదరదని ధర్మాసనం స్పష్టం చేసింది. అదేవిధంగా ఎన్నికలు ముగిసిన తరువాత మరోసారి కోర్టుకు వచ్చేందుకు అవకాశం ఇస్తూ పిటిషన్ వెనక్కి తీసుకునే వెసులుబాటు కల్పించాలని గాలి తరపు న్యాయవాది విజ్ఞాపన కూడా సుప్రీంకోర్టు తిరస్కరించింది. జనార్ధన్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్ ను డిస్మిస్ చేసింది.

ఆంగ్ల మాధ్యమం కోర్సుల్లోనూ మాతృభాషలో పరీక్షలు!

న్యూఢిల్లీ : ఇంగ్లిష్ మీడియం కోర్సుల్లో అయినా సరే విద్యార్థులు కోరుకుంటే స్థానిక భాషల్లో పరీక్షలు రాయడానికి వారిని అనుమతించాలని విశ్వవిద్యాలయాలకు యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి) ఉత్తర్వులు జారీ చేసింది. యుజిసి చైర్మన్ జగదీష్ కుమార్ బుధవారం వెల్లడించారు. పాఠ్య పుస్తకాలను రూపొందించడంలోనూ, మాతృభాష/ స్థానిక భాషల్లో బోధన-అభ్యాస ప్రక్రియకు మద్దతు ఇవ్వడంలో విశ్వవిద్యాలయాలు కీలక పాత్ర పోషిస్తాయని యుజిసి తన ఉత్తర్వుల్లో పేర్కొంది. మాతృభాష/స్థానిక భాషల్లో పాఠ్య పుస్తకాలను రూపొందించడం, ఇతర భాషల నుంచి ప్రామాణిక పుస్తకాలను అనువదించడంతో సహా బోధనల్లో వాటి వినియోగాన్ని ప్రోత్సహించడం వంటి కార్యక్రమాలు అవసరం' అని యుజిసి తన ఉత్తర్వుల్లో పేర్కొంది. కాబట్టి, మీ విశ్వ విద్యాలయంలో విద్యార్థులకు ఇంగ్లిష్ మీడియంలో కోర్సులు అందించినప్పటికీ, పరీక్షల్లో స్థానిక భాషల్లో సమాధానాలు రాయడానికి అనుమతించాలని, స్థానిక భాషల్లో అనువాదాన్ని ప్రోత్సహించాలని, విశ్వ విద్యాలయాల ప్రక్రియలో బోధన-అభ్యాసంలో స్థానిక భాషను ఉపయోగించాలని యుజిసి విజ్ఞప్తి చేసింది.

బదిలీపై యథాతథస్థితి

ప్రజాశక్తి-అమరావతి

ఉపాధి హామీ పథకం కింద వివిధ జిల్లాల్లో నియమితులైన సాంకేతిక సహాయకుల బదిలీపై హైకోర్టు యథాతథస్థితి ఉత్తర్వులు జారీ చేసింది. స్టేటస్ కో కొనసాగించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. విచారణను ఈ నెల 24కు వాయిదా వేసింది. ఈలోగా ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయాలని జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు ఇటీవల ఆదేశాలు జారీ చేశారు. ఇతర జిల్లాలకు బదిలీ చేయడాన్ని సవాల్ చేస్తూ అనంతపురం జిల్లాకు చెందిన పి పురుషోత్తంనాయుడు సహా 48 మంది, శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన ఎస్ సంతోష్ నాయక్, కడప జిల్లాకు చెందిన యెరుకల రెడ్డి, కర్నూలు, ప్రకాశం జిల్లాలకు చెందిన పలువురు వేర్వేరుగా వేసిన పిటిషన్ల తరపున న్యాయవాదులు వాదించారు.

సిఎం వ్యాఖ్యలు కోర్టు ధిక్కారమే..

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సెప్టెంబరు నుంచి విశాఖపట్నం కేంద్రంగా చేసుకుని పాలన చేస్తానని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించడం కోర్టు ధిక్కారానికి నిదర్శనమని, ఈ వ్యాఖ్యలు అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టును అగౌరపరచడమేనని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అమరావతినే రాజధాని అని రాష్ట్ర హైకోర్టు తీర్పు ఇచ్చిందని తెలిపారు. ఈ తీర్పును అమలు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టుకు అప్పీల్‌కు వెళ్లిందని, సుప్రీం కోర్టులో కేసు నడుస్తుండగా ఇలాంటి బాధ్యతారాహిత్యమైన ప్రకటనలు చేయడం ముఖ్యమంత్రికి తగదన్నారు. అమరావతిని నిర్వీర్యం చేయకుండా, రాజధానిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు.

వాయు కాలుష్యమే కారణం

- ప్రపంచ మరణాలపై నిపుణుల నివేదిక
- ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం
- పసిపిల్లల పరిస్థితి మరింత దయనీయం

పాట్నా : దేశంలోని పలు ప్రాంతాలలో వీస్తున్న వడగాలుల కారణంగా వాయు కాలుష్యం పెరుగుతోంది. ఇది ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఖాట్మండుకు చెందిన నిపుణుల బృందం నిర్వహించిన అధ్యయనం ప్రకారం ప్రపంచంలోని మరణాలకు కోవిడ్ కంటే వాయు కాలుష్యమే ఎక్కువ కారణమవుతోంది.

భారత్‌లోనే కాకుండా పలు దేశాలలో కూడా ఇదే పరిస్థితి కన్పిస్తోంది. బంగ్లాదేశ్, మయన్మార్, నేపాల్‌తో పాటు దేశంలోని కొన్ని ప్రాంతాలలో వీస్తున్న వడగాలులు...దాని ద్వారా పెరుగుతున్న వాయు కాలుష్యం నిరుపేదలు, కార్మికులకు ప్రాణసంకటంగా మారుతోంది. ముఖ్యంగా నెలలు నిండని పసిపిల్లలు శ్వాసకోశ సమస్యలతో విలవిల్లాడుతున్నారు. వీటితో పాటు గుండె జబ్బులు, ఇతర అనారోగ్యాలతో దినదినగండంగా కాలం గడుపుతున్నారు. ముఖ్యంగా నిరుపేదలే ఎక్కువగా వీటి బారిన పడుతున్నారని నిపుణుల అధ్యయన నివేదిక తెలిపింది.

'ప్రపంచవ్యాప్తంగా ఇప్పటి వరకూ కోవిడ్‌తో మరణించిన వారి కంటే వాయు కాలుష్యంతో ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్యే ఎక్కువగా ఉంది' అని వాయు నాణ్యతా నిపుణుడు డాక్టర్ భూపేష్ అధికారి చెప్పారు. అయినప్పటికీ వాయు కాలుష్యం విషయంలో మనమేమీ చేయలేకపోతున్నామని అన్నారు. యుద్ధ ప్రాతిపదికన గాలి నాణ్యతను మెరుగుపరచేందుకు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని తెలిపారు. 'మన ప్రాంతంలో వాయు కాలుష్యానికి కారణమేమిటో, దానిని ఎలా నివారించాలో మనకు తెలుసు. స్వచ్ఛమైన గాలి కోసం మనం ప్రభుత్వంతో, స్వచ్ఛంద సంస్థలతో కలిసి పనిచేయాల్సి ఉంది' అని భూపేష్ వివరించారు.

అడవులలో ఏర్పడుతున్న అగ్ని ప్రమాదాలు వాయు కాలుష్యానికి కారణమవుతున్నాయని నివేదిక తెలిపింది. వాతావరణ మార్పులు, నివాస ప్రాంతాలలో వ్యర్థ పదార్థాలను తగలబెట్టడం కూడా కాలుష్య కారకాలు అవుతున్నాయి. ఈ కాలుష్యం జీవవైవిధ్యం పైన ప్రతికూల ప్రభావం చూపుతోంది. పెరుగుతున్న ఉష్ణోగ్రతల కారణంగా మంచు పర్వతాలు ఆందోళన కలిగించే స్థాయిలో కరిగిపోతున్నాయి. గ్లోబల్ వార్మింగ్ రెండు డిగ్రీలు పెరిగితే యాభై శాతం మంచు పర్వతాలు కనుమరుగవుతాయి. ఫలితంగా నదీ ప్రవాహాలపై ప్రభావం పడుతుంది. స్వచ్ఛమైన నీటికి సంబంధించిన జీవవైవిధ్యం, వ్యవసాయం, తాగునీరు, ఇతర మానవ అవసరాల విషయంలో కూడా తీవ్ర పరిణామాలు చోటుచేసుకుంటాయి.

వాయు నాణ్యత పడిపోవడంపై నిపుణుల నివేదిక తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. దీనిపై తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పింది.

పరదాల చాటున పేదరికం !

- జీ-20 సదస్సు పేరుతో సర్వాంగసుందరంగా వారణాసి
- అయినా దుర్భరంగానే పేదల బతుకులు

వారణాసి : జీ-20 సదస్సు సందర్భంగా వారణాసి నగరంలోని వీధుల్ని సర్వాంగసుందరంగా ముస్తాబు చేశారు. వివిధ దేశాల నుంచి వచ్చిన అతిథుల్ని ఆకట్టుకునేందుకు చేయాల్సిందంతా చేశారు. రోడ్లన్నీ తళతళలాడుతున్నాయి. అయితే ప్రతి రోజూ ఇలా ఎందుకు ఉండడం లేదని వారణాసి మురికివాడల్లో నివసిస్తున్న ప్రజానీకం వేస్తున్న ప్రశ్నలు అందరినీ ఆలోచింపజేస్తున్నాయి.

జీ-20 సమావేశాల నేపథ్యంలో వారణాసిని అందంగా అలంకరించాలని ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అంతే...ప్రభుత్వ యంత్రాంగం మొత్తం కదిలింది. చెట్లు, వంతెనలకు సైతం రంగులు వేశారు. మురికివాడలు కన్పించకుండా ఆకుపచ్చని పరదాలు కట్టారు. పెద్ద పెద్ద బోర్డులు ఏర్పాటు చేశారు. మొత్తానికి అతిథులకు రోడ్డు పక్కన గుడిసెలు కన్పించకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. వాస్తవానికి వారణాసిలో మూడింట రెండో వంతు ప్రాంతం మురికి వాడలు, పూరి గుడిసెలతోనే నిండి ఉంటుంది. పేదరికాన్ని నిర్మూలిస్తామని హామీలు గుప్పించే నేతలు ఇప్పుడు పేదరికం బయటకు కనబడకుండా మభ్యపెడుతున్నారు. ఆకుపచ్చని పరదాల చాటున నిజాలను ఎందుకు కప్పిపెడుతున్నారని మురికి వాడల ప్రజలు నిలదీస్తున్నారు. ఇంతకుముందు నగరాన్ని ఇలా ఎందుకు శుభ్రం చేయలేదని ప్రశ్నిస్తున్నారు. రాత్రింబవళ్లూ డ్రైనేజీ నీరు పొంగిపొర్లుతూ దుర్గంధం వెదజల్లుతున్న ప్రాంతంలో నివసిస్తున్న గుడియా అనే మహిళ మాట్లాడుతూ "మురికివాడలు కన్పిస్తే చాలు...బుల్‌డోజర్లు వచ్చి నేలమట్టం చేస్తున్నాయని" వాపోయారు. పేదరికం కానీ, పేదలు కానీ అతిథులకు కన్పించకుండా చేస్తున్నారని చెప్పారు. పిల్లలు, వృద్ధులకు రోజుకు రెండు పూటలా ఆహారం దొరకడం కూడా దుర్భరం అవుతోందని, అయినా ఎవరికీ పట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రిజ్వానా అనే మరో మహిళ మాట్లాడుతూ 'నాకు వివాహమై పదేళ్లు అయింది. నగరాన్ని ఇంత సుందరంగా ఎప్పుడూ చూడలేదు. అంతా కృత్రిమంగా కన్పిస్తోంది. బీజేపీ వాళ్లు ఓట్ల కోసమే మా ప్రాంతానికి వచ్చే వారు. ఇప్పుడు రాత్రికి రాత్రే చెత్తాచెదారాన్ని తొలగించారు. ఆకుపచ్చని లాన్లు ఏర్పాటు చేశారు. ఒంటెలు, గుర్రాలు, ఏనుగులు, నెమళ్లు, చివరికి సీతాకోక చిలుకల బొమ్మల్ని కూడా ఏర్పాటు చేశారు. వావ్...ఎప్పుడూ ఇలా ఉంటే ఎంత బాగుండు' అని అన్నారు.

రాజ్‌ఘాట్ సమీపంలోని మురికి వాడలో నివసిస్తున్న అజయ్ గోండ్‌ది మరో వ్యథ. ఆ ప్రాంతంలోని ఇళ్లను కూల్చేస్తామని ఉత్తర రైల్వే నోటీసులు ఇచ్చింది. ఇప్పుడు ఎక్కడికి వెళ్లాలని ఆయన ప్రశ్నిస్తున్నారు. ఇళ్లు కూల్చేస్తే తమ ప్రపంచమే నాశనమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇంటిపన్ను, నీటిపన్ను, కరెంటు బిల్లులు కడుతున్నా తమకు ఎందుకీ దుస్థితి అని నిలదీశారు.

అతిథులను సంతృప్తి పరచడం కోసం తమ బతుకులను నాశనం చేస్తున్నారని వాపోయారు. ప్రభుత్వం పేదరికాన్ని నిర్మూలించడానికి బదులు పేదల్ని నిర్మూలించాలని చూస్తోందని జర్నలిస్ట్ ప్రదీప్ కుమార్ చెప్పారు. జీ-20 సమావేశాల కోసం చేసిన కోట్లాది రూపాయల ఖర్చుతో పేదలకు ఇళ్లు కట్టించి ఇవ్వవచ్చని అన్నారు. ప్రస్తుత వ్యవస్థలో మురికివాడల సంఖ్య పెరుగుతోందని చెప్పారు. మరోవైపు సామాన్య ప్రజానీకం ఆర్థిక పరిస్థితులు క్షీణిస్తున్నాయని తెలిపారు. గొప్పలు చెప్పుకున్నంత మాత్రాన వాస్తవాలు దాగవని అన్నారు. సమావేశాల కోసం చేసిన వ్యయం విషయంలో పారదర్శకత లోపించిందని సర్వధర్మ సంఘ్ డైరెక్టర్ రామ్‌ధిన్ విమర్శించారు. సమావేశాల కోసం తమ భూమిని కూడా లాక్కునేందుకు ప్రయత్నాలు చేశారని చెప్పారు.

వారణాసిలోని పలు ప్రాంతాలలో జీ-20 లోగోలను ప్రదర్శించారు. వీటితో పాటు బీజేపీ ఎన్నికల గుర్తు కమలం కూడా దర్శనమిచ్చింది. దీనిపై ప్రతిపక్షాలు విమర్శలు చేసినా పాలకులు పట్టించుకోలేదు. లోగోలో చూపిన 'వసుదైక కుటుంబం' భావన ఆచరణలో ఎక్కడా కన్పించలేదు.

పింఛను సంస్కరణలపై పోరు మరింత ఉధృతం

ఫ్రెంచ్ కార్మిక సంఘాల ప్రతిన

పారిస్: పింఛనుకు వయో పరిమితి 62 నుంచి 64 ఏళ్లకు పెంచుతూ మాక్రాన్ ప్రభుత్వం తీసుకున్న చర్యకు వ్యతిరేకంగా తమ పోరాటాన్ని మరింత తీవ్రతరం చేస్తామని ఫ్రెంచ్ కార్మిక సంఘాలు ఉద్ఘాటించాయి. పింఛను సంస్కరణలకు సంబంధించిన చట్టాన్ని గత శనివారం మాక్రాన్ తీసుకురావడంతో ఫ్రాన్స్ మరోసారి నిరసనలతో అట్టుడికిపోయింది. 'మాక్రాన్ మా మాట వినలేదు, మేము ఆయన మాట వినము' అంటూ నిరసనకారులు బిగ్గరగా నినదించారు. రాజధాని పారిస్‌లో కొద్ది నిముషాల వ్యవధిలోనే వందల వేల మంది గుమికూడారు. వీరిని చెదరగొట్టేందుకు పోలీసులు యత్నించడంతో చెత్త బకెట్లకు నిప్పంటించి వారిపైకి విసిరారు. అధ్యక్షుడు మాక్రాన్ జాతి నుద్దేశించి చేసిన తన ప్రసంగంలో నిరసనకారుల ఆగ్రహాన్ని తాను గుర్తించాని, అయితే, తాను తీసుకొచ్చిన ఈ మార్పుల వల్ల ప్రతి ఒక్కరికీ పింఛను గ్యారంటీ అని చెప్పారు. సిజిటి యూనియన్ ఫెడరేషన్ జనరల్ సెక్రటరీ సోఫీ బినెట్ మాట్లాడుతూ అధ్యక్షుడి ఉపన్యాసం ఉద్యోగుల ఆకాంక్షలను పూర్తిగా విస్మరించిందని విమర్శించారు.

సూడాన్‌లో కాల్పుల విరమణ

ఖర్తోమ్: గత నాలుగు రోజులుగా ఆర్మీ, పారామిలిటరీ దళాల మధ్యభీకర పోరుతో నలిగిపోతున్న సూడాన్‌లో 24 గంటలపాటు కాల్పుల విరమణకు వైరి వర్గాలు రెండూ అంగీకరించాయి. సూడాన్‌లో రగులుతున్న హింసాగ్నిని చల్లార్చేందుకు ఈ చర్య ఉపయోగపడుతుందని అరబ్ మీడియా పేర్కొంది. మిలిటరీలో ఆధిపత్యం కోసం ఆర్మీ, పారామిలిటరీ దళాలు పరస్పరం వైమానిక, భూతల దాడులకు దిగడంతో పౌరులు తలుపులేసుకుని ఇంట్లో బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీయాల్సిన పరిస్థితి వచ్చింది. ఈ కాల్పుల విరమణకు తాము అంగీకరిస్తున్నామని మిలిటరీ కమాండ్ సీనియర్ అధికారి ఎల్ డిన్ కబాషి చెప్పారు. అంతకుముందు రాపిడ్ సపోర్టు ఫోర్సెస్ చీఫ్ కూడా కాల్పుల విరమణ తమకు అంగీకారమేనని చెప్పారు.

సెయిల్, ఎన్ఎండిసి బిడ్డింగ్‌లో పాల్గొనాలి

(మొదటి పేజీ తరువాయి)

ప్రైవేటీకరణ కాకుండా ఆగిపోయాయని, అలాంటి చొరవను రాష్ట్ర ముఖ్యమంత్రి చూపాలని కోరారు.

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ మాట్లాడుతూ.. విశాఖ స్టీల్ ప్లాంట్ స్థాపన కోసం కేవలం రూ.5 వేల కోట్లు ఇస్తే ఇప్పటిదాకా కేంద్రానికి రూ.50 వేల కోట్లు చెల్లించడంతోపాటు లక్షల ఆస్తులను తయారు చేసుకుందని అన్నారు. స్టీల్ ఫ్యాక్టరీలో మెటీరియల్ సప్లయ్ కోసం బిడ్డింగ్‌కు పిలిస్తే తెలంగాణ రాష్ట్రం ముందుకు వచ్చినట్లు రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. తెలంగాణ బిడ్డింగ్‌లో పాల్గొని మన రాష్ట్రం పాల్గొనకపోతే అది రాష్ట్రానికి అవమానమని విమర్శించారు. మన రాష్ట్ర ఎంపిలు దద్దమ్మలుగా మారకుండా ప్రైవేటీకరణ యత్నాలను అడ్డుకోవాలని డిమాండ్ చేశారు.

టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. 32 మంది ప్రాణత్యాగంతో ఏర్పాటైన విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ కాకుండా అడ్డుకోవాల్సిన బాధ్యత మనందరిపై వుందన్నారు. రెండేళ్లుగా విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం రాష్ట్ర ప్రజలు, కార్మికులు ఆందోళన చేస్తుంటే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి స్పందించకపోవడం సరైంది కాదన్నారు. హిండెన్‌బర్గ్ ఇష్యూ లేకపోతే ఈ పాటికి విశాఖ స్టీల్ ప్లాంట్ అదానీ చేతుల్లోకి పోయేదని అన్నారు. వైఎస్‌ఆర్‌టియు రాష్ట్ర అధ్యక్షులు గౌతంరెడ్డి మాట్లాడుతూ.. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పటికే కేంద్రానికి లేఖ రాశారని, ఎంపి విజయసాయిరెడ్డి కార్మికులతో కలిసి ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ర్యాలీ చేశారని గుర్తు చేశారు. కేంద్రం ప్రైవేటీకరణ యత్నాలను ఉపసంహరించుకోవాలని కోరారు. కాంగ్రెస్ నాయకులు నరహరిశెట్టి నర్సింహారావు మాట్లాడుతూ.. విశాఖ స్టీల్ పరిరక్షణ కోసం కాంగ్రెస్ ఉద్యమిస్తుందని తెలిపారు. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఛైర్మన్ సిహెచ్ నర్సింగరావు మాట్లాడుతూ.. నాణ్యమైన ఉక్కును ఉత్పత్తి చేసే విశాఖ స్టీల్ ఫ్యాక్టరీని మోడీ ప్రభుత్వం ప్రైవేటికరించేందుకు కృత్రిమ నష్టాలను సృష్టిస్తోందన్నారు. అదానీని లోకల్ పాట్నర్‌గా విదేశీ కంపెనీ అయిన పోస్కోకు కట్టబెట్టేందుకు కేంద్రం చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలని కోరారు. ఈ సమావేశంలో సిఐటియు నాయకులు కె ఉమామహేశ్వరరావు, ఎఐటియుసి నాయకులు రావుల రవీంద్రనాథ్, ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ప్రభాకర్‌రెడ్డి, సీనియర్ నాయకులు వై కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

మీకోసం

టమాట రసాన్ని ఒకేసారి తీసి ఐస్ క్యూబ్స్ వేసి డీప్ ఫ్రిజ్‌లో పెడితే వారం రోజుల పాటు నిల్వ ఉంటుంది.

జీవన సౌరభం

వృధా చేసిన ప్రతి క్షణం.. భవిష్యత్తు ప్రయోజనాలను తారుమారు చేస్తుంది.

మూడు రొట్టెలు



పల్లవ రాజ్యంలో గురుకులంలో సకల విద్యలూ పూర్తి చేసుకున్నారు యువరాజు జయంతుడు, మంత్రి కుమారుడు విజయుడు, రైతు కుమారుడు రామయ్య. గురువు సుధాముడికి వెళ్లి వస్తాము అని పాదాభివందనం చేశారు. వారిని ఆశీర్వదించి పొలిమేరలో ఉన్న పేదరాశి పెద్దమ్మ ఇంటికి వెళ్లి ఏదైనా తిని వెళ్లండి అని చెప్పాడు.

ఆ ముగురూ పెద్దమ్మ ఇంటికి వెళ్లారు. పెద్దమ్మ వారిని కాసేపు కూర్చోమని చెప్పి. మూడు రొట్టెలు కాల్చి మూడు విస్తర్లలో పెట్టి జయంతుడికి ఇచ్చింది. జయంతుడు వాటిని చూశాడు వాటిలో ఒక రొట్టె బాగా మాడిపోయి ఉంది, మరొకటి ఒక మోస్తరుగా కాల్చబడి, మూడవది బాగా కాల్చినది ఉంది.

మాడిన రొట్టెను మిత్రులకు కనబడకుండా జయంతుడు పెట్టుకుని మోస్తరుగా కాలిన రొట్టెను విజయుడికి, బాగున్న రొట్టెను రామయ్యకు తినడానికి ఇచ్చాడు. ముగ్గురూ తిన్న తరువాత జయంతుడు పెద్దమ్మకు కొంత ధనం ఇచ్చి వెళ్లి వస్తాము చెప్పి కోటకు బయలు దేరారు.

పెద్దమ్మకు వంటలో సహాయం చేసే సీత 'పెద్దమ్మా! మూడు రొట్టెలను మూడు రకాలుగా ఎందుకు కాల్చావు? ఆ గుర్రాల పైన వచ్చి వాటిని తిని వెళ్ళిన వారు ఎవరు?' అని అడిగింది.

'వారిలో బాగా మాడిన రొట్టెను తిన్నది యువరాజు.. ఎందుకంటే అతను రేపు కాబోయే రాజు. ప్రజలను బాగా చూసుకోవలసిన బాధ్యత అతనిది. మంచి రొట్టెను సామాన్యుడైన రామయ్యకు ఇచ్చాడు. రేపు కాబోయే మంత్రి. రాజుకు సహాయకుడు కనుక ఒక మాదిరి రొట్టెను విజయుడికి ఇచ్చాడు. యువరాజును పరీక్షించడానికే అలా చేశాను' అని చెప్పింది పెద్దమ్మ. కాబోయే యువరాజు దయగల వాడు అని అర్థమయ్యింది సీతకి.

- యు. విజయశేఖర రెడ్డి
99597 36475



అవి ఏవీ?

చిన్నారులూ, ఇక్కడ కొన్ని ఎలుకలు ఉన్నాయి. వీటిలో రెండు ఒకే విధంగా ఉన్నాయి. అవి ఏవో కనిపెట్టండి.

జవాబు: 3-5

నేను గీసిన బొమ్మ

- చంద్ర దీక్షిత,
3వ తరగతి,
నలందా విద్యానికేతన్,
ఆచార్య రంగానగర్,
విజయవాడ.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

భర్త ఆచూకీ కోసం అలుపెరగని పోరాటం ...

ఒళ్లో బిడ్డను పెట్టుకుని భర్త ఆచూకీ కోసం 1786 గంటల సుదీర్ఘ పోరాటం చేసిన ఓ 24 ఏళ్ల పేద యువతి కథ ఇది. పనికి వెళ్లిన భర్త తిరిగి ఇంటికి రాలేదు.. రెండు నెలలు గడుస్తున్నా ఆచూకీ లేదు. ఏమయ్యాడో తెలియదు. అసలు బతికున్నాడో లేదో తెలియదు. ఈ అయోమయంలోనే ఆమె పోరాటం చేసింది. 'మేము ప్రేమించి పెళ్లి చేసుకున్నాం. జీవితం గురించి ఎన్నో కలలుకన్నాం. బిడ్డ భవిష్యత్తు గురించి ఎంతో ఆశ పడ్డాం. కానీ ఇప్పుడు హఠాత్తుగా అతను కనిపించడం లేదు. నేను స్థిమితంగా ఎలా ఉండగలను.. రేపు నా బిడ్డ తండ్రి గురించి అడిగే ప్రశ్నలకు ఏమని సమాధానం చెబుతాను.. అందుకే ఒకవేళ అతను జీవించి లేకపోయినా అతని శవాన్నైనా చూపించమని పోరాడాను' అంటున్న ఆ మహిళ ఊర్వశీ మోరన్. అసోం తిన్‌సుకియా జిల్లా లిడో నగరానికి సమీప గ్రామంలో నివసిస్తోంది. భర్త ఆచూకీ కోసం మూడు నెలల పాటు ఆమె చేసిన సుదీర్ఘ పోరాటం చివరికి విషాదంగానే ముగిసింది. అసలేం జరిగింది?

'రెండు రోజుల్లో వస్తానని చెప్పిన నా భర్త ప్రంజాల్ మోరన్ రెండు వారాలైనా తిరిగి రాలేదు. 2023 జనవరి 6న అతడు మా గ్రామానికి సమీపంలో జరుగుతున్న బొగ్గు అక్రమ మైనింగ్‌లో పని చేసేందుకు వెళ్లాడు. జనవరి 12 ఉదయం కూడా నాతో ఫోన్లో మాట్లాడాడు. ఆ తరువాత నుండే ఆ ఫోను పనిచేయలేదు. ఆరా తీస్తే.. పని ముగిసిన తరువాత కూలీ డబ్బులు తీసుకుని ఇంటికే బయలుదేరాడని యజమాని చెప్పాడు.. మరి ఇంకా ఎందుకు రాలేదు.. ఈ ప్రశ్నే నన్ను ప్రశాంతంగా ఉండనీయలేదు. పోలీసులకు ఫిర్యాదు చేశాను. స్టేషను చుట్టూ చాలా సార్లు తిరిగాను. అయినా ఫలితం లేదు.. ఇంక ఆలస్యం చేయకూడదనుకున్నాను. 500 కిలోమీటర్ల దూరంలోని గౌహతి వెళ్లాను. జిల్లా డిప్యూటీ కమిషనర్ కార్యాలయం ఎదుట నిరాహారదీక్ష చేశాను' అని ఆవేదనతో చెబుతోంది. ఒకటి, రెండు కాదు.. అలా 84 రోజుల సుదీర్ఘ పోరాటం చేసింది.

ప్రంజాల్ తిన్‌సుకియాలోని ఓ ఐరన్ ఫ్యాక్టరీలో పనిచేసేవాడు. జీతం ఎక్కువగా వస్తుందన్న నమ్మకంతో ఆ పని విడిచిపెట్టి గతేడాది నవంబరు నుండి లిడో నగరంలో జరుగుతున్న బొగ్గు అక్రమ తవ్వకాల పనికి కుదిరాడు. ప్రంజాల్ ఒక్కడే కాదు ఆ ప్రాంతంలో ఎందరో యువకులకు అధిక వేతనాల ఆశ చూపి అక్రమ మైనింగ్‌కు తీసుకుపోతారు. ఆ పనిలో ప్రాణాలు పోతే త్రుణమో.. ప్రణమో.. ముట్టజెప్పి చేతులు దులుపుకుంటారు. ఇదంతా అక్కడ సర్వసాధారణంగా జరిగేదే.. కాని ఊర్వశి అలా ఊరుకోలేదు. 'నేను, నా బిడ్డ ఉండగా నా భర్తను అలా ఎల వదిలివేస్తాం' అంటూ పోరాటం చేసింది.

నమ్మకం వదులుకున్నాను..

ఫిబ్రవరి 2న గని యజమాని తరపున ఓ వ్యక్తి ఊర్వశి ఇంటికి వచ్చాడు. ఇక్కడ ప్రమాదాలు సాధారణమని, ప్రంజాల్ కనిపించక పోయినందుకు గాను నష్టపరిహారంగా రూ.5 లక్షలు ఇస్తామని చెప్పాడు. 'అప్పటి వరకు ఈ రోజో.. రేపో.. ప్రంజాల్ వస్తాడనుకున్న నేను ఆ రోజుతో ఇక రాడన్న నమ్మకానికి వచ్చేశాను. అయితే అతని మృతదేహాన్నయినా చూడాలనుకున్నాను. కానీ యజమాని నాకు సహకరించలేదు. డబ్బు తీసుకుని నోర్మూసుకుని ఉండమన్నాడు. నాకు చాలా అవమానంగా అనిపించింది. ఏదో దాస్తున్నారనిపించింది. మరుసటి రోజు ఉదయమే పోలీసుస్టేషనుకు వెళ్లాను. మొదట్లో నిరాకరించిన పోలీసులు రెండు రోజుల తరువాత కేసు ఫైల్ చేశారు. ఈ వార్త స్థానిక మీడియాలో బాగా వైరల్ అయ్యింది. నాకు మద్దతుగా కొన్ని స్వచ్ఛంద సంస్థలు వచ్చాయి. అక్రమ బొగ్గు రవాణాను ఆపేందుకు ఆ సంస్థలతో కలిసి పోరాడాను.

ప్రలోభాలకు లొంగలేదు..

'నా పోరాటం ఆపేందుకు యంత్రాంగం నాకు ఎన్నో ప్రలోభాలు చూపింది. అప్పటి వరకు ఎన్నో వందలసార్లు తిరిగినా పట్టించుకోని అధికారులు రోజుల వ్యవధిలోనే నాకు అరుణోదయ యోజన పథకం కింద రేషన్ కార్డు మంజూరు చేశారు. కలెక్టరుతో సమావేశం ఏర్పాటుచేశారు. అధికమొత్తంలో డబ్బు ఇప్పిస్తామన్నారు. పైగా ఇదంతా నన్ను ఓదార్చడంలో భాగమని, నా ఆరోపణలు నిరాధారణమైనవని మీడియాకు చెప్పారు.

పోలీసు స్టేషనుకు వెళ్లినా.. అధికారులను కలిసినా రెండు నెలలు గడుస్తున్నా నా భర్త ఆచూకీ కోసం ఏ ప్రయత్నం చేయడం లేదు. దీంతో మార్చి నెలలో గౌహతి వెళ్లి బిడ్డతో సహా డిప్యూటీ కమిషనర్ కార్యాలయం ఎదుట రోడ్డుపై బైఠాయించాను. ఈసారి పోలీసు ఉన్నతాధికారులతో సమావేశం ఏర్పాటుచేశారు. ఏప్రిల్ 2న డిజిపిని కలిశాను' అంటున్న ఊర్వశి భర్త ఆచూకీ కోసం ఈసారి పోలీసు బెటాలియన్ లిడో నగరానికి బయలుదేరింది. విచారణలో భాగంగా అరెస్టు చేసిన ఇద్దరు వ్యక్తులు ఇచ్చిన సమాచారం ఆధారంగా ప్రంజాల్ మృతదేహం దాచి ఉంచిన ప్రాంతాన్ని కనుగొన్నారు. దాన్ని వెలికితీసేందుకు ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందం రంగంలోకి దిగింది. ఏప్రిల్ 7న కుళ్లి పోయిన స్థితిలో తీవ్ర దుర్గంధం వ్యాపిస్తున్న ప్రంజాల్ మృతదేహాన్ని వెలికితీశారు. భర్తను ఆ స్థితిలో చూసిన ఊర్వశి దు:ఖం కట్టలు తెంచుకుంది. గుండెలు బాదుకుంటూ శవంపై పడి ఏడ్చింది.

పోరాటం ఆగదు..

భర్త ఆచూకి కోసం ఊర్వశి చేసిన పోరాటం ఆ గ్రామాన్ని కదిలించింది. శవంగానైనా అతన్ని చూసేందుకు ఆమె పడిన వేదనను అర్థం చేసుకున్న గ్రామస్తులు ఊర్వశికి అండగా నిలబడ్డారు. స్థానికంగా న్యాయం జరగడం లేదని జిల్లా కేంద్రానికి వెళ్లి మరీ చేసిన పోరాటంలో ఆమె ప్రదర్శించిన తెగువకు వేనోళ్ల కీర్తించారు. గ్రామమంతా ఏకమై భార్య, కొడుకు సమక్షంలో ప్రంజాల్ అంత్యక్రియలు నిర్వహించారు. ఇప్పటి వరకు పోలీసులు ఈ కేసుతో సంబంధం ఉన్న 18 మందిని అరెస్టు చేశారు. అయితే ప్రమాదం కారణంగానే ఇది సంభవించిందని పోలీసులు చెబుతున్నారు. కాని ఊర్వశి వారితో ఏకీభవించడం లేదు. 'నా భర్త చావుకు అసలు కారణం తెలుసుకునే వరకు నా పోరాటం ఆపను' అంటోంది.

రానా నాయుడు సీజన్ 2 వీడియో

హీరోలు దగ్గుబాటి వెంకటేశ్, రానా కాంబినేషన్‌లో తెరకెక్కిన నెట్‌ఫ్లిక్స్ సిరీస్ 'రానా నాయుడు'. అమెరికన్ హిట్ సిరీస్ రే డోనోవ్యాన్‌కు ఆధారంగా తెరకెక్కిన ఈ ప్రాజెక్ట్ తెలుగు, తమిళంతోపాటు వివిధ భాషల్లో విడుదలైంది. డిజిటల్ ప్లాట్‌ఫాంలో ఈ వెబ్ ప్రాజెక్టుకు మిక్స్‌డ్ రివ్యూస్ వచ్చాయి. తండ్రీ కొడుకులుగా నాగానాయుడు (వెంకటేశ్), రానా నాయుడు (రానా) మధ్య జరిగే హోరా హోరీ పోరు, ఇతర అంశాల చుట్టూ తిరిగే కథాంశంతో ఇంట్రెస్టింగ్ ఎలిమెంట్స్‌తో తెరకెక్కింది. ఇప్పుడు సీజన్ 2తో కూడా సందడి చేయబోతుంది. దీనికి సంబంధించిన గ్లింప్స్ వీడియోను విడుదల చేసింది. రానా నాయుడులో సుచిత్ర పిళ్లై, గౌరవ్ చోప్రా, సుర్వీన్ చావ్లా, ప్రియా బెనర్జీ, ఆదిత్యా మీనన్, అభిషేక్ బెనర్జీ, సుశాంత్ సింగ్, మిలింద్ పాఠక్, ఆశిష్ విద్యార్థి రానానాయుడులో కీలక పాత్రల్లో నటించారు.



'ఓజి' హీరోయిన్ ప్రియాంక అరుళ్

పవన్ కల్యాణ్ హీరోగా సుజిత్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'ఓజి' (వర్కింగ్ టైటిల్) చిత్రం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. తాజాగా ఈ సినిమాలో నటించే హీరోయిన్‌ను ఖరారు చేస్తూ పోస్టర్ రిలీజ్ అయింది. ప్రియాంక అరుళ్ మోహన్‌ని కథానాయికగా ఎంపిక చేశామని మేకర్స్ స్పష్టం చేశారు. ఈ సినిమాలో ప్రియాంక నటిస్తోందని... కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో వార్తలు వస్తున్నాయి. ఇప్పుడు అదే విషయాన్ని టీం ఖరారు చేసింది. తాజాగా ఆమె సెట్స్‌లోకి అడుగుపెట్టింది. 'ఓజీ' నిర్మాణ సంస్థ ట్వీట్‌ను షేర్ చేస్తూ చిత్రబృందానికి ప్రియాంక్ థ్యాంక్స్ చెప్పింది.

కేరళలో 'కంగువ'

సూర్య, దర్శకుడు సిరుత్తై శివ ప్రస్తుతం 'కంగువ' అనే పీరియాడికల్ యాక్షన్ డ్రామా కోసం పనిచేస్తున్నారు. తాజా సమాచారం ప్రకారం బుధవారం నుండి ఈ చిత్ర షూటింగ్ కేరళలో ప్రారంభమైనట్లు తెలుస్తోంది. ఇప్పటికే 50 శాతం చిత్రీకరణ పూర్తి చేసుకున్న షూటింగులో జరిగిన ఈ తాజా షెడ్యూల్‌లో సూర్య, దిశా పటానీ తదితరులు పాల్గొననున్నారు. యువి క్రియేషన్స్‌తో కలిసి స్టూడియో గ్రీన్ నిర్మిస్తున్న ఈ చిత్రం 10 భాషల్లో 3డిలో విడుదల కానుంది. 2024 ప్రారంభంలో విడుదల కానున్న ఈ చిత్రానికి దేవి శ్రీ ప్రసాద్ సంగీత దర్శకుడుగా వ్యవహరిస్తున్నారు.

అమ్మ మళ్లీ మాటలు నేర్పింది



సాయి ధరమ్ తేజ్ హీరోగా నటించిన లేటెస్ట్ సినిమా 'విరూపాక్ష' ఈ శుక్రవారం విడుదల అవుతోంది. ఈ నేపథ్యంలో ఆయన మీడియాతో ముచ్చటించారు. 'సినిమా విజయవంతం అయితే అందరం సంతోషంగా ఉంటామని, అంతే తప్ప రికార్డులు బద్దలు కొట్టాలని ఏమీ అనుకోవడం లేదు. దర్శకుడు సుకుమార్ శిష్యుడు కార్తీక్ దండు కొత్తవాడైనా చాలా చక్కగా తీశారు. 'విరూపాక్ష' కథలో 80, 90వ దశకంలో జరిగింది. ఓ గ్రామంలో వరుసగా జరిగే మిస్టరీ మరణాల వెనుక కారణం ఏమిటి? అని కనిపెట్టే విషయంలో అంశాల చుట్టూ కథ జరుగుతుంది. 'విరూపాక్ష' అంటే రూపం లేని కన్ను. రూపం లేని దాంతో చేసే పోరాటం కనుక సినిమాకు 'విరూపాక్ష' టైటిల్ పెట్టామన్నారు. ఇదొక మిస్టిక్ థ్రిల్లర్ సినిమా. నేను తొలిసారి ఇటువంటి జానర్ సినిమా చేశా. నా ప్రమాదం జరిగిన తర్వాత సినిమాలు చేస్తానా? లేదా? అని అంతా అనుకున్నారు. అయితే, మా అమ్మ నాకు ఎంతో మద్దతుగా నిలిచారు. 36 ఏళ్ల వయసులో మళ్లీ మాటలు నేర్పించారు. 'విరూపాక్ష' చిత్ర బృందం కూడా మద్దతుగా నిలిచింది.' అన్నారు.

28న ఇర్ఫాన్ చివరి సినిమా విడుదల

అనుప్ సింగ్ దర్శకత్వంలో ఇర్ఫాన్ ఖాన్ నటించిన చివరి చిత్రం 'ది సాంగ్ అఫ్ స్కార్పియన్స్' ఏప్రిల్ 28న విడుదల కానుంది. తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ని చిత్రబృందం విడుదలచేసింది. రాజస్తాన్‌లో తెరకెక్కిన ఈ సినిమాలో ఒంటెలని అమ్మే వ్యాపారిగా ఇర్ఫాన్ ఖాన్ కనిపించనున్నారు. ఇరాన్ నటి ఫరాహాని 'నూరన్' అనే గ్రామీణ యువతి పాత్రలో నటిస్తున్నారు. రాజస్థాన్‌లో ఓ తెగలో ప్రచారంలో ఉన్న ఓ జానపద కథ ప్రకారం అక్కడ ఓ ప్రాంతంలో తేలు కుట్టిన మనిషి 24 గంటల్లో చనిపోతాడు. అయితే తేలు కుట్టిన వ్యక్తి దగ్గరకు 'నూరన్' అనే అమ్మాయి వచ్చి పాట పాడితే, విష ప్రభావం తగ్గి మనిషి బతుకుతాడు అనేది అక్కడి ప్రజల నమ్మకం. ఈ జానపద ఇతివృత్తాన్ని ఆధారం చేసుకొని ఈ సినిమా రూపొందింది. 2020 ఏప్రిల్ 29న క్యాన్సర్ కారణంగా ఇర్ఫాన్ మరణించారు. ఆయన చనిపోయిన మూడేళ్ల తరువాత ఈ సినిమా విడుదలవుతోంది.

మైత్రీ మూవీ మేకర్స్ ఇళ్లపై ఐటీ దాడులు

హిట్ సినిమాలతో జోష్ మీదున్న మైత్రి మూవీ మేకర్స్ నిర్మాతలు రవి శంకర్, నవీన్ నివాసాలు, కార్యాలయాలతోపాటు, దర్శకుడు సుకుమార్ ఇంటిపైనా ఐటీ అధికారులు రైడ్స్ నిర్వహించారు. బంజారాహిల్స్, మాదాపూర్ జూబ్లీహిల్స్ సహా పలు ప్రాంతాల్లో తనిఖీలు కొనసాగాయి. మైత్రి మూవీ మేకర్స్ సంస్థ ఈ ఏడాది నందమూరి బాలకృష్ణతో 'వీర సింహారెడ్డి', మెగాస్టార్ చిరంజీవితో కలిసి 'వాల్తేరు వీరయ్య' సినిమాలు తీసింది. ఈ రెండు సినిమాలు టాలీవుడ్ బాక్సాఫీస్ దగ్గర వసూళ్లు వచ్చాయి. వాటికి సంబంధించిన ఫైల్స్ తనిఖీ చేశారు. ఇప్పుడు 'పుష్ప 2' చిత్రాన్ని నిర్మిస్తోంది. దర్శకుడు సుకుమార్ మైత్రిమూవీ మేకర్స్ నిర్మిస్తున్న సినిమాలకు భాగస్వామిగా కొనసాగుతున్నారు. డిస్ట్రిబ్యూషన్ వ్యవహారాలను సైతం చూసుకుంటున్నారు. ఈ క్రమంలో ఐటీ అధికారులు పలు కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. ఆర్థిక వ్యవహారాలకు సంబంధించిన విషయాల గురించి సుకుమార్‌ను ప్రశ్నించారు. దాంతో ఆయన పుష్ప షూటింగ్ సెట్ నుంచి హుటాహుటీనా ఇంటికి వచ్చినట్లు సమాచారం

లక్నో సంచలన విజయం

• స్వల్ప లక్ష్యాన్ని ఛేదించలేక చతికిలపడ్డ రాజస్తాన్

ఆల్‌రౌండ్ ప్రదర్శన కనబర్చిన స్టొయినీస్

జైపూర్: ఇండియన్ ప్రిమియర్ లీగ్(ఐపిఎల్)లో లక్నో సూపర్ జెయింట్స్ జట్టు సంచలన విజయం సాధించింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగి 154పరుగులే చేసిన లక్నో జట్టు ఆ తర్వాత రాజస్తాన్‌ను 144పరుగులకే పరిమితం చేసి 10 పరుగుల తేడాతో గెలిచింది. ఛేదనలో భాగంగా రాజస్తాన్ జట్టు 13ఓవర్లు పూర్తయ్యే సరికి 2 వికెట్ల నష్టానికి 95 పరుగులు చేసి సునాయాసంగా లక్ష్యాన్ని ఛేదించేలా కనిపించింది. ఆ దశలో లక్నో బౌలర్లు సమిష్టిగా రాణించి రాజస్తాన్‌ను కట్టడి చేశారు. తొలుత రాజస్తాన్ బౌలర్లు సమిష్టిగా రాణించారు. పేసర్ బౌల్ట్‌తోపాటు స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ బౌలింగ్‌లో చెలరేగడంతో లక్నో జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 154పరుగులే చేయగల్గింది. లక్నో ఓపెనర్లు కేఎల్ రాహుల్, కైల్ మయర్స్ 10 ఓవర్ల వరకు వికెట్ పడకుండా జాగ్రత్తగా ఆడారు. 11వ ఓవర్లో జేసన్ హోల్డర్ బౌలింగ్‌లో కేఎల్ రాహుల్ 39 పరుగుల వద్ద ఔటయ్యాడు. ఆ తర్వాత లక్నో జట్టు వరుసగా వికెట్లను కోల్పోయి కష్టాల్లో పడింది. కైల్ మేయర్స్(51) మినహా మిగతా బ్యాటర్స్ ఆకట్టుకోలేకపోయారు. కేఎల్ రాహుల్(39) పరుగులు చేయగా.. స్టార్ బ్యాటర్ స్టొయినీస్(21), పూరన్(29) మాత్రమే బ్యాటింగ్‌లో రాణించారు. రాజస్థాన్ బౌలర్లలో అశ్విన్‌కు రెండు, బౌల్ట్, సందీప్ శర్మ, హోల్డర్‌కు ఒక్కో వికెట్ దక్కాయి.

ఛేదనలో రాజస్తాన్‌కు అద్భుత ఆరంభం లభించింది. జైస్వాల్(44), బట్లర్(40) కలిసి తొలి వికెట్‌కు 87పరుగులు జతచేశారు. ఆ తర్వాత పడిక్కల్(26), రియాన్ పరాగ్(15) మాత్రమే బ్యాటింగ్‌లో రాణించారు. ఆవేశ్ ఖాన్‌కు మూడు, స్టొయినీస్‌కు రెండు వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ స్టొయినీస్‌కు లభించింది.

ఐపిఎల్‌లో నేడు..

పంజాబ్ × బెంగళూరు
(వేదిక: మొహాలీ; రా.7.30గం॥లకు)
ఢిల్లీ × కోల్‌కతా
(వేదిక: ఢిల్లీ, రా.7.30గం॥లకు)

భువనేశ్వర్ వేదికగా ఇంటర్ కాంటినెంటల్ కప్

న్యూఢిల్లీ: భువనేశ్వర్ వేదికగా ఇంటర్ కాంటినెంటల్ కప్ జూన్‌లో జరగనుంది. ఈ మేరకు ఆలిండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్(ఎఐఎఫ్‌ఎఫ్) జనరల్ సెక్రటరీ షాజీ ప్రభాకరన్ బుధవారం ఓ ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. ఫిఫా అండర్-17 మహిళల ప్రపంచకప్‌ను సజావుగా నిర్వహించడంతో ఇంటర్ కాంటినెంటల్ కప్ ఆతిథ్య హక్కులు భారత్‌కు దక్కాయని ఆయన తెలిపారు. జూన్ 9నుంచి 18వరకు జరిగే ఈ టోర్నమెంట్‌లో ఆతిథ్య భారత్‌తోపాటు లెబనాన్, మంగోలియా, వనాటు దేశాలు ప్రాతినిధ్యం వహించనున్నాయి. ఇంటర్ కాంటినెంటల్ కప్‌కు భారత్ ఆతిథ్యమివ్వడం ఇది మూడోసారి. 2018లో ముంబయి, 2019లో అహ్మదాబాద్ వేదికగా జరిగింది. 2022లో కోల్‌కతా వేదికగా జరిగిన ముక్కోణపు ఫుట్‌బాల్ టోర్నీలో భారతజట్టు 1-2గోల్స్ తేడాతో ఆఫ్ఘనిస్తాన్, 0-4గోల్స్ తేడాతో హాంకాంగ్ చేతిలో ఓడింది. ఆ తర్వాత ఇంఫాల్ వేదికగా జరిగిన అంతర్జాతీయ మ్యాచ్‌లలో భారతజట్టు 1-0గోల్స్ తేడాతో మయన్మార్‌పై, 2-0తో కిర్గిజ్ రిపబ్లిక్‌పై గెలిచింది.

సమాచారం అందించాలంటూ సిరాజ్‌కు మెసేజ్

ముంబయి: హైదరాబాద్ పేసర్ మహ్మద్ సిరాజ్‌కు గతంలో వచ్చిన మెసేజ్‌ను బిసిసిఐ అవినీతి నిరోధక శాఖ విభాగానికి బుధవారం తెలిపాడు. ఈ ఏడాదిలో ఆస్ట్రేలియా జట్టు శ్రీలంక, న్యూజిలాండ్ జట్లు భారత పర్యటనకు రాగా.. ఈ సిరీస్‌ల్లో భారత జట్టుకు సంబంధించిన అంతర్గత విషయాలను చెప్పాలని సదరు వ్యక్తి తనకు మెసేజ్ చేసినట్లు తెలిపాడు. సిరాజ్‌కు పంపిన మెసేజ్‌లో ఆ వ్యక్తి 'తాను బెట్టింగ్‌ల వల్ల చాలా డబ్బు నష్టపోయానని, జట్టులోని అంతర్గత విషయాలు చెబితే భారీ మొత్తంలో డబ్బులిస్తానంటూ' ఆ వాట్సాప్‌లో ఉంది.

టాప్‌లోనే సూర్యకుమార్ యాదవ్

ఐసిసి టి20 ర్యాంకింగ్స్ విడుదల

దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసిసి) తాజా టి20 బ్యాటర్స్ ర్యాంకింగ్స్‌లో మిస్టర్ 360 డిగ్రీస్ సూర్యకుమార్ యాదవ్ అగ్రస్థానాన్ని నిలబెట్టుకున్నాడు. సూర్యకుమార్ యాదవ్ 960పాయింట్లతో టాప్‌లో ఉండగా.. మహ్మద్ రిజ్వాన్(పాకిస్తాన్) 798పాయింట్లు రెండోస్థానంలో ఉన్నాడు. అలాగే భారతజట్టు మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లి 15వ స్థానంలో ఉండగా.. బౌలర్ల జాబితాలో ఎడమచేతి పేసర్ అర్షదీప్ సింగ్ 14వ ర్యాంక్‌లో నిలిచాడు. ఇక టాప్‌లో పాకిస్తాన్‌కు చెందిన షాదాబ్ ఖాన్ ఉండగా.. రవూఫ్ 12వ స్థానంలో ఉన్నాడు. న్యూజిలాండ్‌తో జరిగిన సిరీస్‌లో రవూఫ్ 3టి20ల్లో ఐదు వికెట్లు తీయడంతో అతని ర్యాంక్ మెరుగైంది. ఇక భువనేశ్వర్ కుమార్ 19వ, హార్దిక్ పాండ్యా ఆల్‌రౌండర్ల జాబితాలో 2వ స్థానంలో ఉండగా.. బంగ్లాదేశ్ చెందిన షకీబ్-అల్-హసన్ టాప్‌లో ఉన్నాడు.



Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68